ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

25-10-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 263 పేజీలు: 10+4 వెల: 6.50

## నేడు సీఎం రేవంత్ ఢిల్లీకి పయనం
2లో

## ఎన్డీయె రికార్డు బ్రేక్ విజయం పక్కా: ప్రధాని
5లో




## బస్సు దుర్ఘటనపై రాష్ట్రపతి, ప్రధాని తీవ్ర దిగ్భ్రాంతి

**విజయవాడ,అక్టోబరు 24, ప్రభాతవార్త ప్రతినిధి:** కర్నూలు జిల్లాలో ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఘోర ప్రమాదానికి గురైన ఘటన పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోడీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కర్నూలు జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో ప్రాణనష్టం జరగడం తనను తీవ్రంగా కలచివేసిందని రాష్ట్రపతి ముర్ము విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ విపత్కర సమయంలో నా ఆలోచనంతా బాధిత కుటుంబాల గురించేనని మోడీ అన్నారు. క్షత >>2

# గాఢ నిద్రలోనే బుగ్గి..బుగ్గి


ప్రమాదంలో తగలబడుతున్న బస్సు

పూర్తిగా దగ్ధమై మిగిలిన స్కెలెటిన్

## 19 మంది ప్రయాణికులు సజీవ దహనం


మరణించిన బైకర్

- హైదరాబాద్-బెంగళూరు ప్రైవేటు బస్సుకు కర్నూలు శివారులో మంటలు
- బస్సును ఢీకొని బైక్‌పై వెళ్తున్న మరో వ్యక్తి మృతి
- డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందంటున్న ప్రత్యక్ష సాక్షులు
- ప్రాణాలతో బయటపడిన 22 మంది
- క్షతగాత్రులు తక్షణమే ఆస్పత్రికి తరలింపు
- రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి
- దుబాయ్ నుంచి విడియో కాన్ఫరెన్స్ ద్వారా పరిస్థితిని సమీక్షించిన ఎపి సిఎం చంద్రబాబు
- మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన తెలంగాణ సిఎం రేవంత్
- ఘటనా స్థలానికి వెంటనే వెళ్లిన మంత్రి జూపల్లి
- స్పీడ్ లిమిట్ నిబంధనలు తప్పనిసరి చేస్తాం: మంత్రి పొన్నం

**కర్నూలు, అక్టోబరు 24, ప్రభాతవార్త :** నిర్లక్ష్యం.. మద్యం మత్తు.. అతివేగం.. కారణం ఏదైనా నిండు ప్రాణాలను నిశీథిలో కలిపేసింది. అందులో అభం శుభం తెలియని చిన్నారుల కూడా ఉన్నారు ఈ దారుణంలో మాంసపు ముద్దలు కూడా మసిబొగ్గల్లాగా కనిపిస్తున్నాయి. ఆ మసిబోగ్గుల కుప్పలు అయిన వారికి ఆనవాలుగా అప్పగించే పరిస్థితి వచ్చింది. ఈ దారుణానికి కారణం ఓ డ్రైవర్ దుర్మార్గమే. అతివేగంతో బైకర్‌ను చంపి తప్పించుకోబోయి బస్సులోని 19 మంది ప్రాణాలు బలిగొన్నాడు. ఈ దారుణ సంఘటనతో దేశం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఎన్నో కుటుంబాలు శోక సముద్రంలో మునిగిపోయాయి. మాటలకందని విషాదం ఇది. కాసేపట్లో తెల్లవారు తుందనగా.. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా బస్సులో 20 మంది జీవితాలు తెల్లవారిపోయాయి. కర్నూలు నగర శివారులోని చిన్నటేకూరు గ్రామ సమీపంలోని నాయకల్లు దగ్గర ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఘోర అగ్ని ప్రమాదానికి గురైంది. >>2

## మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షలు ఎక్స్‌గ్రేషియా - సిఎం రేవంత్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు24:** హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు కర్నూలు జిల్లా చిన్నటేకూరు వద్ద ఘోరప్రమాదానికి గురైన సంఘటనపై తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తంచేశారు. ఆంధ్రప్రదేశ్ అధికా >>2

## దుర్ఘటనలో మరణించిన వారు..

**కర్నూలు, అక్టోబర్ 24, ప్రభాతవార్త :** కర్నూలు జిల్లాలో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న వి.కావేరి ట్రావెల్స్ బస్సు కర్నూలు శివారు చిన్నటేకూరులో జాతీయ రహదారి 44 పై అగ్ని ప్రమాదానికి గురైంది... బస్సు ప్రయాణికుల జాబితా.. అశ్విన్‌రెడ్డి(36), జి.ధాత్రి(27), కీర్తి(30) పంకజ్(28), యువన్ శంకర్‌రాజు(22) తరుణ్(27), ఆకాశ్(31), గిరిరావు(48), బున సాయి(33), గణేశ్(30), జయంత్ పుష్వాహ్(27) పిల్వామిన్ బేబి(64), కిశోర్ కుమార్(41) రమేష్, అతని ముగ్గురు కుటుంబ సభ్యులు రమేష్(30), అనూష(22), మహ్మద్ ఖైజర్(51), దీపక్ కుమార్ 24 అన్డోజ్ నవీన్‌కుమార్(26), ప్రశాంత్(32) ఎం.సత్యనారాయణ(28), మేఘనాథ్(25) వేణుగుండ(33), చరిత్(21), చందన మంగ(23) సంధ్యారాణి మంగ(43), గ్లోరియా ఎల్లెస శ్యామ్(28) సూర్య(24) హారిక(30), శ్రీహర్ష(24) శివ(24), శ్రీనివాసరెడ్డి(40), సుబ్రహ్మణ్యం(26) కె.అశోక్(27), ఎం.జి.రామారెడ్డి(50) ఉమాపతి(32), అమృత్ కుమార్(18), వేణుగోపాల్‌రెడ్డి(24).

## మృతుల కుటుంబాలకు 5 లక్షల సాయం: ఎపి సిఎం చంద్రబాబు



**కర్నూలు, అక్టోబర్ 24, ప్రభాతవార్త :** కర్నూలు సమీపంలో జరిగిన బస్సు ప్రమాదంపై ఎపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఉన్నతాధికారులు, ఇతర రాష్ట్రాల రవాణా శాఖ మంత్రులు మరియు అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో సిఎం చంద్రబాబు నాయుడు ప్రమాదానికి సంబంధించి సమగ్ర విచారణ జరిపి, మృతుల వివరాలు తక్షణం గుర్తించి కుటుంబాలకు రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని ఆదేశించారు. గాయపడిన వారికి ఉత్తమ వైద్య సేవలు అందేలా వైద్యశాఖను దిశానిర్దేశం చేశారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై ఫిట్‌నెస్, సేఫ్టీ మరియు పర్మిట్ తనిఖీలు కఠినంగా నిర్వహించాలని రవాణా శాఖకు సిఎం ఆదేశాలు జారీ చేశారు. అన్ని జిల్లాల్లో బస్సుల సాంకేతిక తనిఖీలు తక్షణం చేపట్టాలని సూచించారు. ప్రమాదానికి కారణమైన నిర్లక్ష్యం ఏదైనా తేలితే సంబంధితులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల భద్రతే ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యత అని సిఎం స్పష్టం చేశారు.

## రాష్ట్రంలో 3 కొత్త వ్యవసాయ కాలేజీలు

### ఈ యేడాదినుంచే తరగతులు ఆరంభం

### కొడంగల్, హుజూర్‌నగర్, డిచ్‌పల్లిలో ఏర్పాటు

**హైదరాబాద్, అక్టోబరు 24, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ విద్యారంగాన్ని బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం దృష్టిసారించింది. ఇందులో భాగంగా ప్రస్తుత విద్యా సంవత్సరం నుండి కొత్తగా మూడు వ్యవసాయ కళాశాలలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ సమర్పించిన ప్రతిపాదనలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదం తెలిపారు. వ్యవసాయా ధారిత తెలంగాణ రాష్ట్రానికి ఇది ఒక ముందడుగు. పెరుగుతున్న వరి దిగుబడితో దేశంలోనే అగ్రస్థానంలో ఉన్న నేపథ్యంలో ఈ నూతన కళాశాలలు భవిష్యత్ వ్యవసాయ నిపుణులను తీర్చిదిద్ది, ఆహార భద్రత, గ్రామీణాభివృద్ధికి దోహదపడతాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది. వ్యవసాయ విద్య అందుబాటులో లేని ప్రాంతాలలో ఈ కళాశాలలను ఏర్పాటు చేయాలనే ఉద్దేశ్యంతో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలోని తెలంగాణ అగ్రికల్చరల్ యూనివర్సిటీకి ఈ బాధ్యతలను అప్పగించారు. అగ్రివర్సిటీ రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర అధ్యయనం నిర్వహించి నూతన కళాశాలల ఏర్పాటుకు అనువైన మూడు ప్రాంతాలను గుర్తించింది. నిజామాబాద్ జిల్లాలోని డిచ్‌పల్లి, నల్గొండ జిల్లాలోని హుజూర్‌నగర్, వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ జాతీయ రహదారి సమీపంలో ఉన్న స్థలాలను ఎంపిక చేసింది. ఈ ప్రాంతాల్లో కనీసం 75 ఎకరాల నుంచి 100 ఎకరాల విస్తీర్ణంలో స్థలం అందుబాటులో ఉందని వర్సిటీ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఈ ప్రతిపాదనల ప్రకారం, ఒక్కో కళాశాల >>2

# మున్సిపాలిటీలకు భారీ నజరానా


శుక్రవారం సిఎం రేవంత్‌ను షహీది గురుపురబ్ ఉత్సవాల్లో పాల్గొనాలని ఆహ్వానిస్తున్న పంజాబ్ మంత్రులు -2లో

### రూ. 2780 కోట్లు విడుదల చేసిన సర్కార్

### 138 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో 2432 పనులకు ఆమోదం

### వెంటనే టెండర్లు పిలవాలని సిఎం రేవంత్ ఆదేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు24:** రాష్ట్రంలో కొత్త మున్సిపాలిటీలు, కొత్త గ్రామాలు విలీనమైన మున్సిపాలిటీల్లో పనులకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. ఈమేరకు రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులకు తెలంగాణ ప్రభుత్వం భారీ మొత్తంలో నిధులు మంజూరు చేసింది. రాష్ట్రంలోని 138 మున్సిపాలిటీల్లో రూ.2780 కోట్లు మంజూరు చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ కోర్ అర్బన్ సిటీని మినహాయించి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులకు వెంటనే నిధులు విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ శాఖ ఈ నిధులు మంజూరు చేసింది. తెలంగాణ రైజింగ్ విజన్‌లో భాగంగా గ్రేటర్ హైదరాబాద్తో పాటు రాష్ట్రమంతటా ఉన్న పట్టణాలను గ్రోత్ హబ్‌గా తీర్చిదిద్దాలని సిఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు. పట్టణాల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఉన్న మున్సిపాలిటీల విస్తరణతో పాటు కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలన్నింటా మెరుగైన పౌర సదుపాయాలతో పాటు పెరుగుతున్న డిమాండ్‌ను అందుకునేలా అభివృద్ధిపనులు చేపట్టాలని లక్ష్యంగా ఎంచుకున్నారు.
ఇందులో భాగంగా మున్సిపల్ శాఖ ఇచ్చిన ప్రతిపాదనల మేరకు రాష్ట్రంలోని 138 మున్సిపాలిటీల్లో రూ.2,780 కోట్ల ఖర్చుతో 2,432 పనులు చేపట్టేందుకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌లో పొందుపరిచిన నగరాభివృద్ధి నిధులతోపాటు అర్బన్‌ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవెలప్‌మెంట్ ఫండ్ (యుఐడిఎఫ్) పథకాల >>2

## 'జూబ్లీ' బరిలో 58 మంది

### 23 మంది నామినేషన్ల ఉపసంహారణ

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), అక్టోబరు 24, ప్రభాతవార్త :** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల బరిలో అభ్యర్థుల జాబితా ఖరారైంది. నవంబరు 11న పోలింగ్ జరిగే ఈ ఎన్నికల్లో 58 మంది అభ్యర్థులు పోటీపడుతున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి. సాయిరాం ప్రకటించారు. మొత్తం 211 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా 81 మంది అభ్యర్థులు అందులో అర్హత పొందారు. కాగా వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు, పలువురు స్వతంత్రులు మొత్తం 23మంది నామినేషన్లను శుక్రవారం ఉపసంహరించుకున్నారు. ఇంత మంది పోటీ చేయడం జూబ్లీహిల్స్ అసెంబ్లీ చరిత్రలో ఇదే తొలిసారి. 2009 ఎన్నికల్లో 13 మంది, 2014 ఎన్నికల్లో 21 మంది, 2018 ఎన్నికల్లో 18 మంది పోటీపడగా 2023లో జరిగిన ఎన్నికల్లో 19 మంది పోటీ పడ్డారు. వారిలో బిఆర్‌ఎస్ నుంచి బరిలోకి దిగిన మాగంటి గోపీనాథ్ విజయం సాధించారు. ఆయన అకాల మరణంతో ఉపఎన్నికరావడంతో ఈసారి ప్రధాన >>2

# రండి.. అద్భుతాలు ఆవిష్కరిద్దాం



### ఉమ్మడిగా పరిశోధనలు, ప్రాజెక్టులు చేపడదాం

### ఆస్ట్రేలియాలోని ప్రసిద్ధ మోనాష్ వర్సిటీ ప్రతినిధులను ఆహ్వానించిన మంత్రి శ్రీధర్ బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు24:** అడ్వాన్స్డ్ టెక్నాలజీస్, గ్లోబల్ హెల్త్ ఇన్నోవేషన్, లైఫ్ సైన్సెస్, బయో టెక్నాలజీ, మెడికల్ డివైసెస్, సస్టైనబుల్ ఇంజనీరింగ్, క్రిటికల్ మినరల్స్ రీసెర్చ్ తదితర రంగాల్లో వినూత్న ఆవిష్కరణల కోసం తెలంగాణతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని మెల్‌బోర్న్‌లోని ప్రఖ్యాత మోనాష్ యూనివర్సిటీ ప్రతినిధులను రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆహ్వానించారు. ఇక్కడి ప్రముఖ విద్యా సంస్థలను భాగస్వామ్యం చేస్తూ జాయింట్ రీసెర్చ్ ప్రోగ్రామ్స్, ప్రాజెక్టులు, ఫ్యాకల్టీ, స్టూడెంట్ ఎక్స్ఛేంజ్‌లు, కోఇన్నోవేషన్ ఇనిషియేటివ్స్‌ను చేపట్టాలని కోరారు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం మెల్బోర్న్‌లోని ప్రఖ్యాత మోనాష్ యూనివర్సిటీని సందర్శించారు. అనంతరం ఉమ్మడి పరిశోధన, ఇన్నోవేషన్ బేస్డ్ కొలాబరేషన్, అకడమిక్ ఎక్స్ఛేంజ్ , స్టార్టప్‌ల భాగస్వామ్యం తదితర అంశాలపై యూనివర్సిటీ ప్రతినిధులతో చర్చించారు. అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా తెలంగాణను గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. భారత్ ఫ్యూచర్ సిటీ, ఎఐ సిటీ, ఎఐ ఇన్నోవేషన్ హబ్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ క్వాంటం కంప్యూటింగ్, తెలంగాణ డేటా ఎక్స్ఛేంజ్, టి హబ్, టి వర్క్స్ తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలో వినూత్న ఆవిష్కరణలు, పరిశో >>2

## తెలంగాణకు మరోసారి వానగండం

### పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ
2లో

## తుది దశకు చేరుకున్న ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారం
7లో

### వారి తరపున అడ్వకేట్లు హాజరు, విచారణ జరిపిన స్పీకర్

## వంగర గురుకులంలో బాలిక ఆత్మహత్య

### సిబ్బంది వేధింపులే కారణం: తల్లిదండ్రుల ఫిర్యాదు

### ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి : ప్రజాసంఘాలు


### విచారణ అనంతరం కారణాలు వెల్లడిస్తాం: డిఇఓ వాసంతి


శ్రీవర్షిత (ఫైల్)

**భీమదేవరపల్లి, అక్టోబరు 24 ప్రభాతవార్త:** వంగర గురుకుల పాఠశాలలో బాలిక ఆత్మహత్య సంఘటన చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై దివ్య తెలిపిన వివరాల ప్రకారం హుజురాబాద్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన వనం తిరుపతి మమత దంపతుల కుమార్తె అయిన వనం శ్రీవర్షిత వంగర గురుకుల పాఠశాలలో గత నాలుగు సంవత్సరాలుగా విద్యాభ్యాసం కొనసాగిస్తూ ప్రస్తుతం పదో తరగతి చదువుతున్నది. దీపావళి పండుగ సెలవులకు స్వగ్రామం వెళ్లి నిన్నటి రోజున (ఈనెల 23న) తిరిగి మృతురాలు తండ్రి తిరుపతి పాఠశాలకు పంపించానని ఈరోజు ఉదయం చరవాణి ద్వారా పాఠశాలలో ప్రిన్సిపల్ సిబ్బంది ఇబ్బందులకు గురిచేస్తున్నారని భయాందోళనగా ఉందని >>2



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి, అధికారులు



బూడిదైన మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు



ఘటనా స్థలంవద్ద పోలీసులతో మాట్లాడుతున్న బాధితులు

# గాఢ నిద్రలోనే బుగ్గి.. బుగ్గి

>> బైక్‌ను ఢీకొన్న బస్సులో మంటలు చెలరేగగా.. 19 మంది సజీవ దహన మయ్యారు. బైక్‌పై ఉన్న వ్యక్తితో కలిపి మొత్తం 20 మంది మరణించారు. మరో 22 మంది ప్రయాణికులతో పాటు ఇద్దరు డ్రైవర్లు ఎమర్జెన్సీ డోర్, విండో ద్వారా బతికి బయటపడ్డారు. క్షతగాత్రులకు కర్నూలు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటన రెండు తెలుగు రాష్ట్రాలను కుదిపేసింది. వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లు కలిసి సుమారు 43 మందితో వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు (డిడి 01 ఎన్ 9490) హైదరాబాదు నుంచి బెంగుళూరు బయలుదేరింది. కర్నూలు జిల్లా కేంద్రం దాటిన తర్వాత కల్లూరు మండలం చిన్నటేకూరు ప్రాతం లోని నాయకల్లు ప్రాంతానికి 3 గంటల సమయంలో చేరుకుంది. ప్రయాణికు లంతా గాఢ నిద్రలో ఉన్నారు. అదే సమయంలో కర్నూలు నగరంలోని ప్రగతి నగర్‌కు చెందిన శివశంకర్ పల్సర్ ద్విచక్ర వాహనంపై బస్సు ముందు వెళ్తున్నాడు. ఈ క్రమంలో డ్రైవర్ బస్సు ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో బైక్‌పై ఉన్న శివశంకర్ ఎగిరి రోడ్డు పక్కన పడడంతో అక్కడికక్కడే చనిపోయాడు. బైకుకు ఢీకొన్న విషయం గుర్తించిన డ్రైవర్ బస్సు ఆపితే ప్రమాదంపై కేసు అవుతుంది లేదా మరో వివాదం అవుతుంది అనే ఉద్దేశంతో బస్సును ఆపకుండా మరింత వేగంగా ముందుకు వెళ్లాడు. అయితే బైక్‌పై ఉన్న శివశంకర్ మాత్రం రోడ్డు పక్కన పడ్డాడు బైక్ మాత్రం బస్సు కిందికి వెళ్లింది. బైకు దాటి వచ్చామనే ఉద్దేశంతో డ్రైవర్ ముందుకు వెళ్లాడు. సుమారు 300 మీటర్లు వెళ్లిన తర్వాత పెద్ద శబ్దంతో బస్సుకు మంటలు అంటుకున్నాయి. బస్సు బైక్‌ను ఢీకొన్న సమయంలో బైక్ బస్సు కింద ఇరుక్కుపోయింది. అలా కొంత దూరం వెళ్లగానే బైక్ పెట్రోల్ ట్యాంక్ నుంచి మంటలు వ్యాపించడంతో బస్సుకు మంటలు అంటుకున్నట్లు నిపుణులు తేల్చారు. బస్సులో ఉన్న ఫ్యాబ్రిక్ ప్లాస్టిక్ తదితర పలుచని వస్తువుల కారణంగా క్షణాల్లో మంటలు బస్సు అంతా వ్యాపించాయి. అప్పటికే డ్రైవర్ బస్సును ఆపి సహచర డ్రైవర్‌ను నిద్ర లేపాడు. ఇంతలో బస్సులో పొగ అమ్ముకుంది. ప్యాసింజర్ క్యాబిన్ డోర్ తీశారు. కానీ బస్సు మెయిన్ డోర్ ఓపెన్ కాలేదు. అప్పటికే ప్రయాణికుల అరుపులు మొదలయ్యాయి. గందరగోళం నెలకొంది. కొందరు ప్రయాణికులు డ్రైవర్ డోర్ నుండి కిందికి దిగేశారు చాలామంది పెద్ద శబ్దంతో నిద్ర నుంచి తేరుకున్న చూడగా బస్సు మంటల్లో ఉంది. వెంటనే ఎమర్జెన్సీ డోర్ ద్వారా, కిటికీల ద్వారా దాదాపు 22 మంది బస్సులో నుంచి తప్పించుకుని బతికి బయటపడ్డారు. ఇద్దరు డ్రైవర్లు బస్సు దిగి పరారయ్యారు. నిద్రలో ఉన్న వారు మాత్రం బయటకు రాలేకపోవడంతో సజీవ దహనమయ్యారు. 19 మంది బస్సులోనే మంటల్లో కాలిపోయి మరణించారు. బైకర్ కూడా అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు, ఫైర్ సిబ్బంది, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. ఫైర్ సిబ్బంది బస్సులో మంటలను అదుపు చేశారు. ప్రాణాలతో బస్సు నుంచి బయటపడిన వారిని పోలీసులు కర్నూలు ప్రధాన ఆస్పత్రికి తరలించారు. ఘటన స్థలాన్ని కర్నూలు కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, కర్నూలు, నంద్యాల ఎంపీలు బస్తిపాటి నాగరాజు, డాక్టర్ బైరెడ్డి శబరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి పరిశీ లించారు. మంటలకు బస్సు మొత్తం పూర్తిగా కాలిపోయింది. అందులోని కాలిపోయిన మృత దేహాలు మాంసపు ముద్దలుగా మారి గుర్తుపట్టడానికి వీలు లేకుండా తయారయ్యాయి. అతికష్టం మీద బస్సుల్లో సజీవ దహనమైన 19 మంది మృతదేహాలను వెలికి తీశారు. ఫోరెన్సిక్ బృందాలు వీటిని బస్సులో నుంచి వెలికితీశాయి. డిఎన్ఎ పరీక్షలు నిర్వహించిన తర్వాత మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగించనున్నారు. బస్సు నుంచి బయటపడి గాయపడిన వారిలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 12 మంది చేరారు. ఆరుగురు డిశ్చార్జ్అయ్యారు. మరో ఆరుగురు చికిత్స తీసుకుం టున్నారు. ఈ బస్సు దగ్ధం ఘటనపై ఉల్లిందకొండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. రమేష్ అనే ప్రయాణికుడి ఫిర్యాదు మేరకు 125 సీ/ఏ , 106 సీ/1 సెక్షన్ల మేరకు అభియోగాలు నమోదు చేశారు.

## తెలంగాణలో జాయింట్ కలెక్టర్ పదవి రద్దు

### ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్లుగా అదనపు కలెక్టర్లకు బాధ్యత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, అక్టోబరు24:** తెలంగాణప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. అన్ని జిల్లాల్లో అదనపు కలెక్టర్లని ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్లుగా నియమిస్తూ రేవంత్‌రెడ్డి సర్కార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. జాయింట్ కలెక్టర్ పదవి రద్దు చేసి.. కొత్త బాధ్యతలని అదనపు కలెక్టర్లకు అప్పగించింది. ఈ క్రమంలో అడవి భూసర్వే, హక్కుల నిర్ధారణ, సెటిల్‌మెంట్ పనులు వీరి పరిధిలోకి రానున్నాయి. రేవంత్ రెడ్డి ప్రభుత్వం 1967 ఫారెస్ట్ యాక్ట్ కింద ఉత్తర్వులు జారీ చేసింది.. ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ పర్యవేక్షణలో అమలు చేయనుంది. అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు తగిన చర్యలు చేపట్టా లని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశించింది.

## భారీ నజరానా

>> నుంచి ఈ నిధులను మంజూరు చేసింది. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలకు రూ.15 కోట్లు, అదనంగా గ్రామ పంచాయతీలు విలీనమైన మున్సిపాలిటీలకు రూ.20 కోట్లు, పాత మున్సిపాలిటీలకు రూ.15 కోట్ల చొప్పున నిధులు విడుదల చేశారు. కొత్తగా ఏర్పడిన మున్సిపల్ కార్పొరేషన్లకు రూ.30 కోట్లు మంజూరు చేశారు. ప్రాధాన్యత క్రమంలో ఈ నిధులను ఖర్చు చేయాలని మున్సిపల్ శాఖ మార్గదర్శకాలను రూపొందించింది. మున్సిపా లిటీల్లో విలీనమైన ప్రాంతాల అభివృద్ధి, అంత ర్గత రహదారులనిర్మాణం, వర్షపునీరు, మురు గునీటికి డ్రైన్ల నిర్మాణం, జంక్షన్ల అభివృద్ధి, చెర్వులు, కుంటల్లో కాలుష్య నివారణ, డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించిన ప్రాంతాల్లో ప్రాథమిక సదుపాయాల ఏర్పాటు, పార్కుల అభివృద్ధి, కల్వర్టుల నిర్మాణం, షాపింగ్ కాంప్లెక్సుల నిర్మాణ పనులకు ఈ నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అన్ని మున్సిపాలిటీల్లో సంబంధిత విభాగాలు వెంటనే టెండర్లు పిలిచి ఈ పనులు ప్రారంభించాలని సూచించారు. 2026 మార్చి నాటికి అన్ని పనులను పూర్తి చేయాలని గడువుగా నిర్ణయించారు.

## 'జూబ్లీ' బరిలో 58 మంది

>> పార్టీలతోపాటు పెద్దసంఖ్యలో స్వతంత్రులు, విద్యార్థి సంఘాల నాయకులు, రైతులు నామినేషన్లు వేశారు. పెద్దసంఖ్యలో నామినేషన్లు దాఖలవ్వడం చర్చానీయంశంగా మారింది.

**భారీ నామినేషన్ల వెనుక..**

జూబ్లీ ఉప ఎన్నికల్లో ఈ సారి నమోదైన భారీ నామినేషన్ల వెనుక పలువురు తమ ఉద్యమానికి వేదికగా మలుచుకొనేందుకు, తమ సమస్యలను ఫోకస్ చేసేందుకు నామినేషన్లు వేశారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ. 5వేలు, ఇతరులు రూ. 10 వేలు చెల్లించి మరీ నామినేషన్లు వేశారు. ఆర్ఆర్ఆర్ బాధిత రైతులు, ఫార్మా సిటీ రైతులు, నిరుద్యోగులు, మాల సంఘాల జెఏసి, సీనియర్ సిటిజన్లు ఇలా పలువురు నామినేషన్లు దాఖలు చేసిన వారిలో ఉన్నారు. బరిలో నిలిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు చేయి గుర్తు, బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు కారు గుర్తు, బిజెపి అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డికి కమలం గుర్తుతోపాటు మిగిలిన రిజిస్టర్, స్వతంత్ర అభ్యర్థులకు కేటాయించిన గుర్తులను బంజారాహిల్స్ రోడ్ నంబరు 2లోని షేక్‌పేట ఎమ్మార్వో కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఎన్నికల అధికారులు అభ్యర్థులకు వివరించారు. మొత్తం 58 మంది అభ్యర్థులకు సంబంధించి నాలుగు ఇవిఎం యంత్రాలు ఏర్పాటుచేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. అభ్యర్థులు తేలడంతో ఇక జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రచారం మరింత హోరెత్తనుంది.

## 3 కొత్త వ్యవసాయ కాలేజీలు

>> నిర్మాణానికి సుమారు రూ.120 కోట్లు కేటాయించాల్సి ఉంటుంది. అంతేకాకుండా, ప్రతి కళాశాలకు సుమారు 100 మంది బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలు అవసరమవుతాయి. ప్రస్తుతం రాష్ట్రంలో వ్యవసాయ కోర్సుల కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగుతున్న తరుణంలో వీలైనంత త్వరగా ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ అనుమతిని పొంది, ఈ విద్యాసంవత్సరం నుంచే తరగతులను ప్రారంభించాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం యోచిస్తోంది.

ఇందుకోసం తాత్కాలిక భవనాలలో మౌలిక సదుపాయాలు కల్పించి, ఇతర కళాశాలల నుంచి సిబ్బందిని బదిలీ చేసి బోధన చేపట్టాలని ప్రణాళికలు సిద్ధం చేసింది. నూతనంగా ఏర్పాటు కానున్న ఒక్కో కళాశాలలో బీఎస్సీ వ్యవసాయ కోర్సులో 60 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించి, మొదటి సంవత్సరం తరగతులను ప్రారంభించేందుకు వీలుంటుంది. ఈ కొత్త కళాశాలల ఏర్పాటు నిర్ణయం రాష్ట్రంలోని గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా మారనుంది. అధునాతన వ్యవసాయ పద్ధతులు, సాంకేతికతపై శిక్షణ పొందే అవకాశం పెరగడం ద్వారా, తెలంగాణలో వ్యవసాయ రంగం మరింత సాంకేతికపరంగా అభివృద్ధి చెందుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

## అద్భుతాలు ఆవిష్కరిద్దాం

>> ధనలకు ఈ భాగస్వామ్యం మరింత ఊతమిస్తుందని మంత్రి శ్రీధర్ బాబు అభిప్రాయపడ్డారు. గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్ మారేందుకు అవసరమైన ఎకో సిస్టం కలిగిన తెలంగాణ లాంటి రాష్ట్రాలతో కలిసి పని చేసేందుకు ఆసక్తిగా ఉన్నట్లు యూనివర్సిటీ అకడమిక్ అఫైర్స్ వైస్‌ప్రోవోస్ట్ ప్రొఫెసర్ మ్యాథ్యూ గిలెస్పీ వెల్లడించారు. రాబోయే రోజుల్లో ఉమ్మడి పరిశోధనలు, సంయుక్త ప్రాజెక్టులను చేపట్టేందుకు వీలుగా రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీన్ రీసెర్చ్ ప్రొఫెసర్ లే హై వూ, డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ క్రిస్టోఫర్ థామ్సన్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకులంలో బాలిక ఆత్మహత్య

>> తెలుపగా మృతురాలు తండ్రికి ఈరోజు ఉదయం పాఠశాలకు చేరుకోగా ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినట్టు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

**విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని: డిఇఓ వాసంతి**

హనుమకొండ జిల్లా విద్యాధికారి గురుకులాన్ని సందర్శించి అనంతరం మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న శ్రీవర్షిత ఈనెల 14న అనారోగ్య కారణంగా రాంపూర్ వెళ్లిందని తిరిగి ఈనెల 23న మధ్యాహ్నం తండ్రి తిరుపతి చేర్పించి వెళ్లారని తెలిపారు. మృతురాలు వర్షిత తెలివైన అమ్మాయని తరగతి గదిలో ప్రథమ స్థానంలో ఉంటుందని ఆత్మహత్యకు అనారోగ్య కారణాల కావచ్చు అని అన్నారు. విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని హామీ ఇచ్చారు.

**ప్రిన్సిపల్ సంబంధిత సిబ్బందిని వెంటనే సస్పెండ్ చేయాలని ప్రజా సంఘాల డిమాండ్:**

వంగర గురుకుల పాఠశాల ఎదుట సిపిఐ నాయకులు సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఆదరి శ్రీనివాస్ గురుకుల పాఠశాల ఎదుట ధర్నాచేపట్టుతూ ప్రిన్సిపల్‌తో పాటు బాలికల ఆత్మహత్యకు కారకులైన సంబంధిత సిబ్బందిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాలకు మండల అధికా రుల సందడి డిఇఒ వాసంతితో పాటు ఎంఇఒ సునితారాణి, ఎమ్మార్వో రాజేష్, ఎంపిడిఒ వీరేశం, సిఐ పులి రమేష్, ఎల్కతుర్తి ఎస్ఐ ప్రవీణ్, ముల్కనూర్ ఎస్సై ఎం రాజు తదితర పోలీస్ సిబ్బంది రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీవర్షిత కుటుంబానికి ప్రభుత్వం కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి: ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి డిమాండ్

### విద్యార్థిని మృతదేహంతో ధర్నా, తీవ్ర ఉద్రిక్తత

**జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త:** హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర ప్రభుత్వ గురుకుల హాస్టల్‌లో పదోవ తరగతి చదువుతున్న హుజురాబాద్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన విద్యార్థినీ శ్రీవర్షిత శుక్రవారం ఉదయం హాస్టల్ గదిలో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అటు గురుకులంలో, ఇటు హుజురాబాద్ రాంపూర్‌లో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఈ మేరకు హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం శ్రీవర్షిత మృతదేహాన్ని హుజురాబాద్‌కు తీసుకురాగా, పోస్టుమార్టం అనంతరం హుజురాబాద్ బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, అనేక మంది బిఆర్ఎస్ నేతలు అసుపత్రి నుండి విద్యార్థినీ శ్రీవర్షిత మృతదేహాన్ని 400 మీటర్ల దూరం ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి స్వయంగా తన చేతులపై తీసుకువెళ్లి అంబేద్కర్ చౌక్ ముందు ఉంచి, కౌశిక్‌రెడ్డి, బిఆర్ఎస్ నేతలు ధర్నాకు దిగడంతో ఒక్కసారిగా హుజురాబాద్‌లో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ర్యాలీగా వచ్చి రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురుకులాల విద్యావ్యవస్థను నిర్లక్ష్యం చేసి, గాలికి వదిలివేయడంతో రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల ప్రాణాలు గాలిలో దీపాలుగా ఆరిపోతున్నాయని కౌశిక్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసారు. తక్షణమే మృతి చెందిన శ్రీవర్షిత కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, విద్యార్థినీ మృతిపై సమగ్ర న్యాయవిచారణ జరిపించాలని, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేసారు.మృతి చెందిన విద్యార్థినీ శ్రీవర్షిత మృతదేహంతో రాంపూర్ గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, వారి కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాడ సంతాపాన్ని తెలియజేసి, తన వంతుగా 50వేల రూపాయలను శ్రీవర్షిత కుటుంబ సభ్యులకు అంత్యక్రియలకు అందజేసారు.

## సిఎంను కలిసిన పంజాబ్ మంత్రులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు24:** షహీది గురుపురబ్ ఉత్సవాల్లో పాల్గొనాల్సిందిగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని పంజాబ్ రాష్ట్ర మంత్రులు ఆహ్వానించారు. పంజాబ్ పరిశ్రమల శాఖమంత్రి సంజీవ్ ఆరోరా, వ్యవసాయ శాఖ మంత్రి గుర్మీత్ సింగ్ కుడియన్ జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. వచ్చే నెలలో జరిగే శ్రీ గురుతేజ్ బహదూర్ జీ 350వ అమరవీరుల వార్షికోత్స వేడుకల్లో (గురుపురబ్) ఉత్సవాల్లో పాల్గొనాల్సిందిగా ముఖ్య మంత్రికి ఆహ్వానం అందించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు ఇతర ప్రతినిధులు ఉన్నారు.

## రాష్ట్రపతి, ప్రధాని తీవ్ర దిగ్భ్రాంతి

>> గాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానని ప్రధాని మోడీ విచారం వ్యక్తం చేశారు. పిఎం రిలీఫ్ ఫండ్ కింద మృతుల కుటుంబాలకు రూ.2లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. క్షతగాత్రులకు రూ.50వేల చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు.ఇక, ఈ ఘటనపై ఉప రాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ కూడా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపిన ఆయన క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలన్నారు.

## ఎక్స్‌గ్రేషియా

>> రులతో మాట్లాడి అవసరమైన సహాయ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అధికారులను ఆదేశించారు. ఈ ఘటనలో మరణించిన కుటుంబాలకు తీవ్ర సంతాపం తెలిపారు. బస్సు ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డిజిపిలతో మాట్లాడారు. సహాయక చర్యల కోసం హెల్ప్ లైన్ ఏర్పాటు చేయాలని చెప్పారు. వెంటనే ఘటనా స్థలానికి వెళ్లాలని గద్వాల్ కలెక్టర్, ఎస్పీలను ఆదేశించారు. కర్నూల్ బస్సు ప్రమాదంలో మరణించిన తెలంగాణ పౌరు లకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా, గాయపడిన క్షతగాత్రు లకు రూ.2 లక్షలు ప్రకటించినట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు నాణ్యమైన వైద్యం అందించేలా చర్యలు తీసు కుంటున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

## నేడు సిఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి పయనం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు24:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శని వారం ఢిల్లీకి వెడుతున్నారు. శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు ఎఐసిసి కార్యాలయంలో మల్లికార్జున అధ్యక్షతన జరగబోయే సమావేశంలో రాష్ట్రంలో డిసిసి అధ్యక్షుల నియామకంపై ప్రధానంగా చర్చించబోతున్నట్లుగా తెలుస్తోంది. ఈ భేటీలో సిఎం రేవంత్‌రెడ్డితో పాటు పిసిసి చీఫ్ మహేష్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమకుమార్ రెడ్డి పాల్గొంటారు. ఈనెలాఖరున డిసిసి అధ్యక్షు లను ప్రకటించేందుకు ఎఐసిసి కసరత్తు చేస్తోంది. మరోవైపు జిల్లా అధ్యక్ష పదవుల కోసం ఆశావహులు భారీగా దరఖాస్తు చేసు కున్నారు. తెలంగాణతో పాటు రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో డిసిసి అధ్యక్షుల ఎంపికను కాంగ్రెస్ అధిష్టానం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నది. ఈ మేరకు తెలంగాణకు 22 మంది అబ్జర్వర్లను కూడా నియమించింది. సీనియర్ నాయకులకు ఎఐసిసి సంస్థాగత ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ ఈ బాధ్యతలను కట్టబెట్టారు. ఎలాంటి ఒత్తిళ్లకు తావులేకుండా నిర్ణయాలు తీసుకునేందుకు ఎఐసిసిలో సీనియర్ నాయకులను ఇన్చార్జిలుగా నియమించింది.

## 'బస్సు ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం'

**కర్నూలు,అక్టోబరు 24 ప్రభాతవార్త:** ఈరోజు హైదరాబాద్ నుండి బెంగళూరు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్ ప్రమాదానికి గురి అయింది ఇందుకు సంబంధించి కర్నూలు ప్రభుత్వా సుపత్రికి క్షతగాత్రులను తరలించడం జరిగింది దీనికి సంబంధించి కర్నూలు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు వివరణ కోరగా 12మంది అడ్మిషన్ అయ్యారు వారికోసం ప్రత్యేక డాక్టర్ టీంను అరేంజ్ చేసి వారికి ట్రీట్మెంట్ ఇచ్చారు. ఆరు మంది అప్పటి కప్పుడే డిశ్చార్జ్ అవ్వగా 5 మందిని అడ్మిషన్‌లో ఉన్నారు. వారికి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు అని తెలియజేశారు అంతే కాకుండా బస్సులో మరణించిన 19 మందిమృతదేహాల కొరకు మార్చరిరూమ్ దగ్గర అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి 19 ఫ్రీజర్ బాక్స్‌లను రెడీ చేసి అన్ని విధాల సంసిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. ఏ క్షణంలో ఏమి కావాలన్నా అందించడానికి ప్రభుత్వాసుపత్రి సిబ్బంది అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తారని సూపర్డెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలియజేశారు

## బస్సు ప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది

### స్పీడ్ లిమిట్ నిబంధనలను తప్పనిసరి చేస్తాం

### త్వరలో ఎపి, కర్ణాటక మంత్రులతో సమావేశం

### రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, ప్రభాతవార్త, అక్టోబరు 24ః** కర్నూల్ జిల్లాలో జరిగిన బస్సు ప్రమాదం తీవ్ర ద్రిగ్భాంతికి గురి చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. బస్సు ప్రమాద సంఘటన దురదృష్టకరమని, చాలా బాధ కలుగుతుందని, మృతులకు సంతాపం వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు..బస్సు ప్రమాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరాలు తెలుసుకోవడం జరిగిందని, తెలంగాణ ప్రభుత్వం నుండి తక్షణం తీసుకోవాల్సిన చర్యలు ఉంటే రవాణా శాఖ నుండి ఆదేశించామన్నారు. ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖ మంత్రి, కర్నూలు జిల్లా కలెక్టర్ ఎస్పీలతో టెలిఫోన్లో మాట్లాడడం జరిగిందని మంత్రి తెలిపారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ మధ్య ప్రతిరోజు వేలాదిమంది ప్రయాణం చేస్తుంటారని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రవాణా శాఖ మంత్రులతో పాటు, రవాణా శాఖ కమిషనర్ల సమావేశం ఏర్పాటు చేస్తామని పొన్నం తెలిపారు. స్పీడ్ లిమిట్ ప్రమాదాలను నివారిస్తుందని, అలాంటి నిబంధనలను తప్పనిసరి చేస్తామన్నారు. బస్సులపై రోజువారి రవాణా శాఖ చెక్ చేస్తే వేధింపులు అంటున్నారని, ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయ న్నారు. ప్రమాదం జరిగిన బస్సు ఒడిశాలో రిజిస్ట్రేషన్ అయిందని, హైదరాబాదు నుండి బెంగళూరు తిరుగుతుందన్నారు. ప్రమాదంలో మరణించిన మృతుల కుటుంబాలకు సానుభూతి వ్యక్తం చేస్తున్నట్టు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరామని మంత్రి తెలిపారు.

## తెలంగాణకు మరోసారి వానగండం

### పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు24:** రాగల 24 గంటల్లో ఈ అల్పపీడనం పశ్చిమ వాయువ్య దిశలో కదిలి శనివారం వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని, ఈ వాయుగుండం ఈనెల 26 నాటికి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. ఈనెల 27వ తేదీ ఉదయానికి నైరుతి బంగాళాఖాతం దాని సమీపంలోని పశ్చిమ మధ్య బంగాళాఖాతం ప్రాంతంలో తుఫానుగా బలపడే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో మూడు రోజుల పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారి శ్రీనివాసరావు వెల్లడించారు. శుక్రవారం దక్షిణ తెలంగాణ జిల్లాల్లో అక్కడకక్కడ భారీ వర్షాలు కురిశాయి. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు కూడా జారీ చేశారు. మాన్‌సూన్ సీజన్‌లో అల్పపీడనాలు నెలకు రెండు మూడు ఏర్పడటం సహజమే. ఈ అల్పపీడనాలు కోస్టుకు దగ్గరగా మాత్రమే ఏర్పడి కేవలం వాయుగుండంగా మాత్రమే ఏర్పడతాయి. ఈనెల 16వ తేదీన నాటికి మాన్‌సూన్ విండ్ పూర్తిగా ఉపసంహరణ జరిగిపోయి నార్త్‌ఈస్ట్ మాన్‌సూన్ ప్రవేశించింది. ఈ సమయంలో ఇలాంటి అల్పపీడనాలు ఏర్పడినట్లు అయితే అవి సైక్లోన్స్‌గా మారే అవకాశం ఉంది. ప్రస్తుతం ఏర్పడిన అల్పపీడనం ఏంటంటే శనివారం వాయుగుండంగానూ, ఆదివారం తీవ్ర వాయుగుండంగానూ, ఈనెల 27వ తేదీ నాటికి తుఫానుగా మారే అవకాశం ఉంది..

## మున్సిపల్ ఎన్నికల్లో పోటీకి ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు24:** స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి ప్రస్తుతం అమలులో ఉన్న ఇద్దరు పిల్లల నిబంధనను ఎత్తి వేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఆర్డినెన్స్ ద్వారా పంచాయతీరాజ్‌తో పాటు మున్సిపల్ చట్టాలను కూడా సవరించనున్నారు. అంటే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు మున్సిపాలిటీలు,కార్పొరేషన్లలో పోటీ చేసేందుకు వెసులు బాటు కల్పించనున్నారు. ఈఆర్డినెన్స్‌ను శుక్రవారం ప్రభుత్వం గవర్నర్‌కు పంపినట్లు సమాచారం.

## వారం - వర్జ్యం

25-10-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
కార్తీకమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
చవితి రా.3.48
అనూరాధ ఉ.7.51
వర్జ్యం : మ.2.08-3.55
దు.ఉ.6.03-7.38
శుభసమయం: ఉ.8.15-8.50, సా.7.00-8.00
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** బ్యాంకు లావాదేవీలలోని లోపములను పరిశీలించుకొని లాభపడుతారు.

**వృషభం :** పంతాలు, వివాదాలు అధికమవుతాయి. ఓర్పు కలిగి ఉండటం చెప్పదగినది.

**మిథునం:** జీవిత భాగస్వామి సహాయసహకారాలు అందుకుంటారు.

**కర్కాటకం :** ఉన్నతాధికారులతో మాట్లాడునప్పుడు సంయమనం పాటించడం వలన లాభపడతారు.

**సింహం:** సంఘసేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**కన్య :** స్థిరాస్తి వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి. వాహన సౌఖ్యం.

**తుల :** మిత్రుల నుండి సహాయ సహకారాలు పొందుతారు. వస్తులాభం.

**వృశ్చికం:** రాజకీయ, పారిశ్రామిక రంగాలలోని వారికి విదేశి పర్యటనలు.

**ధనుస్సు:** అనుకోకుండా కొన్ని అవకాశాలు లభిస్తాయి. సోదరుల కలయిక.

**మకరం:** పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు పెంచుకుంటారు.

**కుంభం:** చాకచక్యంగా వ్యవహరించి పనులు చక్కబెట్టుకుంటారు.

**మీనం :** ఎదుటి వారికి సైతం మీ సహాయసహకారాలు అందిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## బైక్‌ను బస్సు ఢీ కొట్టలేదు: ఎస్పీ విక్రాంత్

### బస్సువెళ్లే సరికే రోడ్డుపై బైక్ పడి ఉంది

### పోలీసులకు లొంగిపోయిన అసిస్టెంట్ డ్రైవర్ స్టేట్‌మెంట్

### కేసును నీరుగార్చే వ్యవహారమంటున్న ప్రజాసంఘాలు

**కర్నూలు, అక్టోబరు 24, ప్రభాతవార్త:** కర్నూలు సమీపంలోని చిన్నటేకూరు వద్ద జరిగిన బస్సు ప్రమాదానికి అతివేగమే కారణమని.. ముందువెళ్తున్న పల్సర్ బైక్‌ను డ్రైవర్ ఢీ కొట్టడని ఉదయం నుంచి చర్చ జరుగుతుంది. అయితే ఆ విషయాన్ని జిల్లా ఎస్పీ విక్రాంతపాటిల్ ఒక్కసారిగా తిరగేశారు. అసలు బస్సు బైకును ఢీకొట్టనే లేదన్నారు. బస్సు వెళ్లే సమయానికి రోడ్డుపై బైక్ పడి ఉందన్నారు. బస్సు రోడ్డుపై పడి ఉన్న బైకును మాత్రమే ఎక్కించిన.. వెంటనే ఆపిన బస్సు డ్రైవర్ కిందికి దిగి చూసి బస్సు కింద బైకు ఉన్నట్లు గుర్తించాడని సీన్ వివరించారు. ఇదంతా పోలీసులకు లొంగిపోయిన అసిస్టెంట్ డ్రైవర్ ఇచ్చిన వాంగ్మూలం అని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ హోమ్ మంత్రి అధ్వర్యంలో జరిగిన ప్రెస్‌మీట్‌లో వివరించారు. ఎస్పీ వివరణపై పలువురు అభ్యంతరాలు చెబుతున్నారు. రోడ్డుపై బైక్ పడి ఉంటే పక్క నుంచి వెళ్ళాలి గాని బైక్ పైకి ఎందుకు ఎక్కించారు.. సరే బైక్ పైకి బస్సు ఎక్కిన వెంటనే బస్సును ఆపారని చెబుతున్నారు... ఆ కొద్ది సమయంలోనే బైక్ నుంచి మంటలు పూర్తిగా విస్తరించాయా.. అని ప్రశ్నిస్తున్నారు. అన్నింటిని మించి బైక్ పై బస్సు ఎక్కిందని నింపాదిగా బస్సు ఆపి కిందకు దిగి పరిశీలించే సమయంలో ప్రయాణికులను కిందికి దింపలేకపోయారా అని నిలదీస్తున్నారు. ఇదంతా కేసును నీరుగార్చే వ్యవహారమని ప్రజాసంఘాలు విమర్శిస్తున్నాయి.

# నిబంధనలు ఉల్లంఘించిన వికె ట్రావెల్స్ బస్సు

### డామన్ అండ్ డయ్యూలో రిజిస్ట్రేషన్, ఒడిశాలో ఆల్టరేషన్, ఫిట్‌నెస్

### 43 సీట్ల సీటింగ్ పర్మిషన్ తీసుకుని స్లీపర్‌గా మార్చినట్లు వెల్లడి

**హైదరాబాద్, అక్టోబరు 22, ప్రభాతవార్త:** కర్నూలు జిల్లా టేకూరు వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఘోర బస్సు దుర్ఘటనకు కారణమైన వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు సీటింగ్ క్యారియర్‌గా అనుమతులు పొంది నిబంధనలకు విరుద్ధంగా స్లీపర్‌గా మార్చినట్లు వెలుగు చూసింది. ఇదే సమయంలో వేమూరి కావేరి ట్రావెల్స్ సంస్థ కేవలం బెంగళూరు, వైజాగ్, చెన్నై రూట్లలో టూరిస్ట్ పర్మిషన్‌తో పర్యాటక ప్రాంతాలకు బస్సులను తిప్పే సంస్థగా నమోదైనట్లు తేలింది. తెలుగు రాష్ట్రాలతో పాటు బెంగళూరు, చెన్నై నగరాలలో సర్వీసులు నడుపుతూ కేంద్ర పాలిత ప్రాంతమైన డామన్ డయ్యూలో రిజిస్ట్రేషన్ చేయించింది, ఒడిశాలో ఆల్టరేషన్ ఫిట్‌నెస్ చేయించినట్లు వెలుగులోకి వచ్చింది. ప్రమాదానికి గురైన ఈ బస్సును మొదట హైదరాబాద్‌లోని 'హెజాల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్' అనే సంస్థ 2018లో కొనుగోలు చేసి 2023 వరకు నిర్వహించింది. ఆ తరువాత వేమూరి వినోద్ కుమార్ అనే వ్యక్తి ఈ బస్సును కొనుగోలు చేసి ఎన్‌ఓసి తీసుకుని కేంద్ర పాలిత ప్రాంతమైన డయ్యూ డామన్‌లో తిరిగి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వేమూరి కావేరి ట్రావెల్స్ సంస్థ ప్రధాన కార్యాలయం ఒంగోలులో వుండగా ప్రమాదానికి గురైన బస్సును కేంద్ర పాలిత ప్రాంతమైన డయ్యూ డామన్‌లో ఎందుకు రిజిస్ట్రేషన్ చేయించాల్సి వచ్చిందనే దానిపై అధికారులు సమాధానం ఇవ్వడం లేదు. ఈ బస్సుకు డయ్యూ డామన్‌లో ఆల్ ఇండియా పర్మిట్ తీసుకున్న వేమూరి కావేరి ట్రావెల్స్ ఆల్టరేషన్, ఫిట్‌నెస్ మాత్రం ఒడిషాలోని రాయఘడ్‌లో చేయించింది. కేంద్ర పాలిత ప్రాంతంలో ఆల్ ఇండియా పర్మిట్ తీసుకుని మరో రాష్ట్రంలో ఆల్టరేషన్, ఫిట్‌నెస్ చేయించుకోవడం వెనక మతలబు కూడా ఎవరికి అంతు చిక్కడం లేదు. ఇక ప్రమాదానికి కారణమైన బస్సుకు 43 సీట్ల సీటింగ్ పర్మిషన్ మాత్రమే వుంది. కానీ వేమూరి కావేరి ట్రావెల్స్ సంస్థ మాత్రం స్లీపర్ క్యారియర్‌గా మార్చింది. ఇలా చేయడం బస్సు సామర్థ్యాన్ని అధిగమించడమే అయినా దీనిపైనా రవాణా శాఖ, పోలీసు శాఖ అధి కారులు ఎలాంటి సమాధానం ఇవ్వడం లేదు. నిబంధనల మేరకు డయ్యూ డామన్‌లో సీటింగ్ సామర్థ్యం వున్న బస్సు రవాణా పన్ను ఒక్కో సీటుకు 450 రూపాయలు మాత్రమే వుంటుంది. అదే స్లీపర్ అయితే 800 రూపాయలుగా వుంటుంది. అదే తెలుగు రాష్ట్రాల వరకు వస్తే సీటింగ్ సా మర్థ్యం వున్న బస్సు రవాణా పన్ను ఒక్కో సీటుకు 4500 రూపాయలు చెల్లించాల్సి వుంటుంది. అదే స్లీపర్ అయితే 12 వేల రూపాయలు చెల్లించాల్సి వుంటుంది. ఇ లా పన్నులను ఎగవేసేందుకే వేమూరి కావేరి ట్రావెల్స్ సంస్థ ఇతర రాష్ట్రాలలో రిజిస్ట్రేషన్, ఆల్టరేషన్, ఫిట్‌నెస్‌లు చేయించుకుందని రవాణా రంగ నిపుణులు చెబుతున్నారు.

**బస్సు ఫిట్‌నెస్ బాగానే ఉంది:**
**ఎపి రవాణా శాఖ అధికారుల వెల్లడి**

ఇదిలావుండగా ప్రమాదానికి గురైన వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు ఫిట్‌నెస్‌గా వుందని ఎపి రవా ణా శాఖ అధికారులు శుక్రవారం మధ్యాహ్నం కర్నూలులో తెలిపారు. అయితే ఈ బస్సును ద్విచక్ర వాహనం ఢీకొనడం వల్లే మంటలు చెలరేగాయని వారు తెలిపారు. ఈ బస్సును కావేరి ట్రావెల్స్ పేరిట రిజిస్ట్రేషన్ చేసినట్లు, డామన్, డయ్యూలో ఈ రిజిస్ట్రేషన్ జరిగిందని, 2030 ఏప్రిల్ 30వ తేదీ వరకు టూరిస్టు పర్మిట్ వుందని వా రు తెలిపారు. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ నుంచి ఆలిండియా టూరిస్టు పర్మిట్ 2025 ఆగస్టులో పొందినట్లు ఈ అను మతి 2026 జూలై నెలాఖరు వరకు చెల్లుబాటు అవుతుందని వారు తెలిపారు. ఈ బస్సు 43 సీట్ల సీటింగ్ పర్మిషన్ తీసుకుని స్లీపర్‌గా మార్చిన ట్లు వెల్లడయ్యిందని దీనిపై విచారిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ బస్సుకు న్యూ ఇండియా అష్యూరెన్స్ బీ మా సంస్థ జారీ చేసిన ఇన్సూరెన్స్ 2026 ఏప్రిల్ 20వ తేదీ వరకు చెల్లుబాటు అవుతుంది. రహదారి పన్ను కూడా 2026 మార్చి 31వ తేదీ వరకు చెల్లించబడిందని వారు తెలిపా రు. అయితే ఈ బస్సుపై తెలంగాణలో 16 చలాన్లు పెండింగ్‌లో వున్నాయి, ఈ చలాన్ల విలువ 23,120 రూపాయలుగా అధికా రులు తెలిపారు. 2014 జనవరి 27వ తేదీ నుంచి 2025 అక్టోబర్ తొమ్మిదవ తేదీ వరకు ఈ బస్సు 16 సార్లు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలింది. ఇందులో తొమ్మిదిసార్లు నోఎంట్రీ జోన్‌లో వెళ్లినట్లుగా ఉంది.

## పండగకు కూతురు ఇంటికివచ్చి తిరిగివెళుతూ అనంతలోకాలకు..

### బస్సుప్రమాదంలో తల్లి, కుమారుడు మృతి

**పటాన్‌చెరు అక్టోబరు 24, ప్రభాతవార్త:** దీపావళి పండగకు కూతురి ఇంటికి వచ్చి, పండగ అయిపోయిన తర్వాత తిరిగి ఊరు వెళుతుండగా బస్సు ప్రమాదంలో తల్లి, కుమారుడు ఇద్దరు అగ్నికి ఆహుతై, మృతి చెందారు. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న కావేరి ట్రావెల్ బస్సు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూ లు వద్ద అగ్నిప్రమాదం సంభ వించగా బస్సులో ప్రయాణిస్తున్న వారిలో బెంగళూరుకు చెందిన ఫిలోమినన్ బేబీ (64), కిషోర్ కుమార్ (41) హెచ్ఎఎల్ స్వచ్ఛంద పదవీవి రమణ చేసిన ఉద్యోగి ఉన్నారు. దీపావళి పండుగ సందర్భంగా బెంగళూరు నుండి పటాన్ చెరులోని కృషి డిఫెన్స్‌లో మృతుడి అక్క పద్మప్రియా, బావ రాము ఇంటికి రాత్రి వచ్చి పటాన్‌చెరు అంబేద్కర్ చౌరస్తా వద్ద కావేరి ట్రావెల్ బస్సు ఎక్కి బయలు దేరారు. కావేరి ట్రావెల్స్ బస్సు అగ్ని ప్రమాదంలో ఇరువురు మృతి చెందినట్లు పోలీసులు నిర్ధారించారు. కర్నూలు వద్ద బస్సు ప్రమాదం లో కుటుంబీకులు మరణించిన విషయం తెలియడంతో పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని కృషి డిఫెన్స్ కాలనీలో ఉంటున్న మృతుడి అక్కబావలు సంఘటన స్థలానికి వెళ్లారు.


తల్లి ఫిలోమినన్‌బేబి, కుమారుడు కిషోర్‌కుమార్ (ఫైల్)

## హైదరాబాద్‌లో వేమూరి ట్రావెల్స్‌కు మూత

### బస్సు దుర్ఘటన ఫలితం

**హైదరాబాద్, అక్టోబరు 24, ప్రభాతవార్త:** కర్నూలు జిల్లా చిన్న టేకూరు వద్ద శుక్రవారం తెల్లవారు జామున జరిగిన ఘోర బస్సు దుర్ఘటన దరిమి లా హైదరాబాద్‌లోని వేమూరి కావేరి ట్రావెల్స్ కార్యాలయాలు ఉదయం నుంచి మూతపడ్డాయి. నగరంలోని పలుచోట్ల ఆ సంస్థకు కార్యాలయాలు వున్నట్లు పోలీసులు, రవాణాశాఖ అధికారులు తెలిపారు. కర్నూలు ప్రమాదం దరిమి లా ఆ బస్సులో ప్రయాణించిన వారి వివరాలు తెలుసుకునేం దుకు వేమూరి కావేరి ట్రావెల్స్ నిర్వాహకులతో మాట్లాడేందుకు పోలీసులతో పాటు రవాణా శాఖ అధికారులు నానా ఇబ్బందులు పడ్డారు. ప్రమా దానికి గురైన బస్సులో ప్రయాణించిన వారి బంధువులు దాడిచేసే ప్రమాదం వుందని భావించిన నిర్వాహకులు కార్యాలయాలను మూసివేసినట్లు పోలీసులు చెబు తున్నారు. కాగా వేమూరి కావేరి ట్రావెల్స్ కార్యాలయాలు మూతపడ డంతో ప్రమాదా నికి గురైన బస్సులో ప్రయాణించిన వారి వివరా లు తెలుసు కునేందుకు వారి బంధువులు చివరకు పోలీసులపై ఆధారపడాల్సి వచ్చింది. దీంతో చివరకు పోలీసులు రంగంలో దిగి వేమూరి కావేరి ట్రావెల్స్ నిర్వాహ కులను పోలీసుస్టేషన్‌కు పిలిపించి సమాచారం సేకరించారు. ఈ దుర్ఘటన లో 19మంది మరణించగా 20మంది గాయపడడం తెలిసిందే. మృతుల్లో ఆరు గురు తెలంగాణకు చెందినవారు వుండగా మరో ఏడుగురు గాయపడ్డారు.

## బస్సు ఢీకొన్న బైకర్ మృతి

**కర్నూల్ హాస్పిటల్, అక్టోబరు 24, ప్రభాతవార్త:** కర్నూలు శివార్లలో19 మందిని సజీవ దహనం చేసిన బస్సు ప్రమాదం సంఘటనలో.. బస్సును ఢీకొన్న ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. కర్నూలు నగర శివారులలోని ప్రగతి నగర్ లో నివాసముంటున్న శివశంకర్ తాపీ మేస్త్రిగా పనిచేస్తున్నాడు. అతని తండ్రి చిన్నతనంలోనే చనిపోయాడు. తల్లి లక్ష్మమ్మ అతని సోదరునితో కలిసి నివాసం ఉంటున్నాడు. అతను తరచుగా డోన్ పట్టణంలో భవన నిర్మాణ పనులు చేసేవాడు. గురువారం సాయంత్రం ఇంటి నుండి బయటకు వెళ్లాడు. తర్వాత కుటుంబసభ్యులకు ఫోన్‌చేసి డోన్ పట్టణానికి వెళ్తున్నానని చెప్పాడు. తెల్లవారు జామున 5 గంటల సమయంలో పోలీసులు అతని తల్లికి ఫోన్ చేసి శివ శంకర్ మృతి చెందాడని తెలిపారు. అసలు ఆ సమయంలో అక్కడ ఎందుకు ఉన్నాడు.. అనే విషయంపై కుటుంబ సభ్యులు సైతం స్పష్టత ఇవ్వలేని పరిస్థితి. అయితే బస్సు డ్రైవర్ కారణంగా అమాయకులు మృతి చెందారని స్థానికులు అంటున్నారు.

# మరణయాత్రగా మారిన బెంగళూరు ప్రయాణం

### పండగ కోసం వచ్చిన సంధ్యారాణి, కూతురు చందన సజీవదహనం

**పాపన్నపేట, అక్టోబరు 24, ప్రభాతవార్త:** మెదక్ జిల్లా ప్రజల హృదయాలను కలచివేసిన కర్నూలులో జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో తల్లి-కూతుళ్ల దుర్మరణం చెందారు. దుబాయ్‌లో ఉద్యోగ రీత్యా స్థిరపడిన మంగ ఆనంద్ గౌడ్ భార్య సంధ్యారాణి (43), కుమార్తె మంగ చందన (24)లు శుక్రవారం తెల్లవారు జామున జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. వివరాల్లోకి వెళ్తే..సంధ్యారాణి పాపన్నపేట మండల కేంద్రానికి చెందినవారు. ఆమె భర్త ఆనంద్ గౌడ్ దుబాయ్‌లో ఉద్యోగం చేస్తున్నారు. వీరికి కుమా రుడు శ్రీవల్లభ్‌గౌడ్, కుమార్తె చందన ఉన్నారు. చందన బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండగా, కుమారుడు ప్రయాగ రాజ్‌లో ఉన్నత విద్యను అభ్యసి స్తున్నాడు. దసరా పండుగను పురస్కరించు కొని కుటుంబమంతా స్వగ్రామాలకు వచ్చి బంధువులను, తల్లి దండ్రు లను కలుసుకున్నారు. పండుగ అనంతరం గురువారం సాయంత్రం సంధ్యారాణి, చంద న బెంగళూరు వెళ్లేందుకు చింతల్ నుండి ఒక ప్రయివేటు బస్సులో బయలు దేరారు. కూతురిని బెంగ ళూరులో దింపి, అక్కడి నుంచే దుబాయ్‌కు వెళ్లేందుకు సంధ్యారాణి ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే తెల్లవారుజామున కర్నూలు సమీపంలో బస్సులో మంటలు చెలరేగడంతో ఇద్దరూ సజీవదహనం అయ్యారు. ఈ ప్రమాదం లో మొత్తం 20 మంది ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం.


తల్లీకూతుళ్లు సంధ్యారాణి, చందన (ఫైల్)

**కన్నీరు మున్నీరైన భర్త, కుమారుడు**

దుబాయ్‌లో ఉన్న ఆనంద్‌గౌడ్ ఈ దుర్వార్త విని మూర్ఛపోయినట్లు సన్నిహితులు చెబుతు న్నారు. కుమారుడు శ్రీవల్లభ్‌గౌడ్ కూడా ప్రయాగరాజ్ నుంచి స్వగ్రామానికి చేరుకుం టున్నారు.

# బస్సు దుర్ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు

### ఎపి హోం మంత్రి అనిత

**కర్నూలు, అక్టోబరు 24, ప్రభాతవార్త :** కర్నూలు బస్సు ప్రమాదం దురదృష్టకరం అని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఉన్న వ్యాస్ ఆడిటోరియంలో చిన్నటేకూరు వద్ద జరిగిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రమాద ఘటనపై హోం శాఖ మంత్రి వర్యులు వంగలపూడి అనిత, రవాణా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా హోం శాఖ మంత్రి మాట్లాడుతూ ప్రైవేట్ ట్రావెల్స్ కు చెందిన వేమూరి కావేరి ట్రావెల్స్ బస్ హైదరాబాద్ నుండి బెంగళూరు వెళ్తున్న సమయంలో తెల్లవారు జామున 3 గంటల నుండి 3.15 సమయంలో ప్రమాదానికి గురి అవడం చాలా బాధాకరమైన విషయం అన్నారు... ప్రాథమిక సమాచారం మేరకు ఎదురుగా వస్తున్న బైక్ ను ఢీకొని, 15 నుండి 20 మీటర్ల దూరం వరకు అలాగే తీసుకొని వెళ్లడం ద్వారా వచ్చిన స్పార్క్ వల్ల మంటలు చెలరేగి 19 మంది చనిపోవడం జరిగిందన్నారు.. అందులో 17 మంది పెద్దవాళ్లు 2 చిన్నపిల్లలు ఉన్నారని, వీరు చనిపోవడం చాలా దురదృష్టకర మైన విషయం అన్నారు.. ప్రమాద ఘటన తెల్లవారుజామున 3 గంటల నుండి 3.15 గంటల మధ్య జరిగిందన్నారు. 3.21 గంటలకు పోలీస్, అగ్నిమాపక శాఖ వారు వెంటనే ప్రమాద ఘటన స్థలం వద్దకు వచ్చి రెస్క్యూ ఆపరేషన్ మొదలు పెట్టారన్నారు.. ప్రమాదఘటన గురించి సమాచారం వచ్చిన వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు, డీజీపీ, స్థానిక ప్రజా ప్రతినిధులు, తదితరులకు సమాచారం చేరవేశారన్నారు. ఘటన గురించి ప్రజా ప్రతినిధులకు తెలిసిన వెంటనే ఉదయం 6.30 గంటలకు ఘటన స్థలం వద్దకు చేరుకొని రెస్క్యూ ఆపరేషన్‌కి సహాయ సహకారాలు అందించారన్నారు.. బస్సులో మొత్తం 39 మంది పెద్దవాళ్లు, 4 చిన్నపిల్లలు, ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఉన్నారన్నారు.. ఈ గుర్తు తెలియని వ్యక్తులు ఆరంగర్ చౌరస్తా దగ్గర ఎక్కడం జరిగిందని, అందులో ఒక్కరు దిగిపోయా రన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో డ్రైవర్ వెనుక భాగంలో ఉన్న ఎగ్జిట్‌డోర్‌ను పగలగొట్టడం ద్వారా ప్రయాణికులు వారికి వారే రెస్క్యూ ఆపరేషన్ చేసుకొని కొంతమంది ప్రయాణికులు బయటికి రావడం జరిగిందన్నారు.. 23 మంది పెద్దవాళ్లు, 2 పిల్లలు, 2 డ్రైవర్లు మొత్తం కలిపి 27 మంది ప్రయాణికులు ప్రమాదం నుండి తప్పించుకొని సురక్షితంగా బయటికి రావడం జరిగి దన్నారు. గాయాలైన వారికి ట్రీట్మెంట్ అందిస్తున్నా రన్నారు... అదే విధంగా 17 మంది పెద్దవాళ్లు, 2 చిన్నపిల్లలు మొత్తం కలిపి 19 మంది చనిపోయా రన్నారు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన వారు 6 మంది అని, వీరిలో బాపట్ల కి సంబం ధించిన ధాత్రి, నెల్లూరుకు సంబంధించిన ఒక కుటుం బంలో రమేష్, అనుజ మరియు వారి పిల్లలు శశాంక్, మోనత , కోనసీమ నుండి శ్రీనివా సరెడ్డి అన్నారు.. తెలం గాణ నుండి 6 మంది, ఒకరు ఒడిశా, ఒకరు బీహార్, ఇద్దరు తమిళ నాడు, ఇద్దరు కర్ణాటక రాష్ట్రాల నుండి, ఒకరి మృత దేహం ఇంకా గుర్తించలేదన్నారు. డ్రైవ ర్లను అదుపులోకి తీసు కొని వారు చెప్పిన ప్రాథ మిక సమాచారం మేరకు ఎంక్వైరీ చేయడం జరుగు తోందన్నారు.. అదే విధం గా ప్రమాద సమయం లో మరణించిన బైకర్ పేరు శివ శంకర్, 24 ఏళ్ళు, తాండ్రపాడు గ్రామం అన్నారు.. చనిపోయిన వారి మృతదేహాలను గుర్తించేందుకుగాను ఫోరెన్సిక్ కి సంబంధించి 16 టీమ్ లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు... అందులో కేవలం డిఎన్ఎ పరీక్షలు చేసేందుకు 10 టీంలు ఉన్నాయన్నారు.. 4 టీమ్ లు ఫిజికల్, బ్లాస్ట్ అనాలసిస్ చేసేందుకు ఉన్నాయన్నారు.. 2 టీం లు కెమికల్ అనాలసిస్ కొరకు ఏర్పాటుచేశామన్నారు.. ఇటువంటి ప్రమాద ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రమాదానికి కారణమైన వారి మీద తప్పకుండా చర్యలు తీసుకుంటామని కేసులు ఫైల్ కూడా చేయడం జరిగిందన్నారు.. ప్రమాదానికి గల కారణాలను అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామ న్నారు.. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ముఖ్యమంత్రితో మాట్లాడి ట్రాన్స్పోర్ట్, పోలీస్, రెవెన్యూ శాఖలతో కలిపి ఒక హైపవర్ కమిటీ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటా మన్నారు.. అదే విధంగా హైవే లో బస్సు లు ఎంత వేగంతో వెళ్లాలనే ఎస్ఒపి కూడా తయారు చేస్తామన్నారు..


బస్సు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని పరామర్శిస్తున్న ఎపి హోంమంత్రి అనిత

## సాహితీ ఇన్‌ఫ్రాకు చెందిన రూ.12.65 కోట్ల ఆస్తులు జప్తు చేసిన ఇడి

**హైదరాబాద్, అక్టోబరు 22, ప్రభాతవార్త:** రియల్ ఎస్టేట్ పేరుతో అమాయకులను నిండా ముంచి 842 కోట్ల రూపాయలను కొల్లగొట్టిన సాహితీ ఇన్‌ఫ్రా సంస్థకు చెందిన 12.65 కోట్ల రూపాయల ఆస్తులను కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) శుక్రవారం జప్తు చేసింది. ఈ సంస్థ డైరక్టర్ పూర్ణచంద్రరావుతో పాటు ఆయన కుటుంబీకులపై మనీలాండరింగ్ చట్టం కింద కేసులను నమోదు చేసింది. ఈ మేరకు ఈడీ ప్రకటన విడుదల చేసింది. సాహితీ ఇన్‌ఫ్రాపై ఇప్పటికే హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు కేసునమోదు చేయడం తెలిసిందే. ఇందులో భాగంగా ఈ సంస్థ నిర్వాహకులను అరెస్టుచేసి భారీగా ఆస్తులను జప్తు చేయడం విదితమే.

## వివేకా హత్యపై తదుపరి విచారణకు సునీతారెడ్డి పిటిషన్

### అవినాష్‌రెడ్డిసహా నిందితులకు సిబిఐ కోర్టు నోటీసులు

**హైదరాబాద్, అక్టోబరు 24, ప్రభాతవార్త:** మాజీమంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి మరో దఫా విచారణ చేయాలని వివేకా తనయ డాక్టర్ సునీతారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై నాంపల్లి కోర్టు తదుపరి చర్యలకు ఉపక్రమించింది . సునీతారెడ్డి పిటిషన్‌పై వెంటనే వివరణ ఇవ్వాలంటూ సిబిఐ కోర్టు ఈ కేసులో నింది తుడుగా వున్న కడప ఎంపి అవినాష్ రెడ్డితో పాటు ఆయన తండ్రి భాస్కర్ రెడ్డి ఇతర నిందితులకు నోటీసులు జారీ చేసింది. ఇదే విషయంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని సిబిఐని కూడా కోర్టు ఆదేశిం చింది. దీనిపై తదుపరి విచారణను ఈ నెల 27వ తేదీకి వాయిదా వేసింది. మరోవైపు వివేకా హత్యకు సంబంధించిన ప్రధాన కేసు విచారణ కూడా సిబిఐ కోర్టు చేబట్టింది. ఈ కేసు విచార ణకు గంగిరెడ్డి, ఉమాశంకర్ రెడ్డి, శివశంకర్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి హాజరయ్యారు. దీనిపై తదుపరి విచారణ నవంబర్ 10వ తేదీకి వాయిదా వేసింది.

CHURCH OF SOUTH INDIA - MEDAK DIOCESE
CSI INSTITUTE OF TECHNOLOGY
School of Architecture & Planning
(Approved by Council of Architecture, New Delhi.)
(Affiliated to Jawaharlal Nehru Architecture & Fine Arts University - Hyderabad)
145 Mcintyre Road, Sec'bad-03, TS - India
e-mail : csiit.ts02@gmail.com
Ph.:040-27817548
9849508489, 9440540988
M.Arch. (ID&CM)
Spot Admissions-
Under 'A' Category
on 27-10-2025 (at 11.00 am)
For Vacancy Position and Spot Admission Guidelines, visit https://pgecetadm.tgche.ac.in
or Contact: CSIIT
PRINCIPAL / MANAGER

తెలంగాణ ప్రభుత్వం
పురపాలక సంఘం కార్యాలయము, ఇస్నాపూర్, సంగారెడ్డి జిల్లా
నోటీసు నెం.ఇ1/80/2025-26, ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు తేదీ: 23.10.2025
ఇస్నాపూర్ మునిసిపాలిటీ, సంగారెడ్డి జిల్లా, ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా రూ.36.00 లక్షల పనుల (6 Nos) కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారమ్ క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతున్నవి. టెండర్ దారులు ఇ-మార్కెట్ ప్లేస్ అనగా www.tender.telangana.gov.in నుండి టెండర్ షెడ్యూల్ డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును మరియు తదుపరి వివరాలను పొందవచ్చును. టెండర్ల స్వీకరణకు చివరి తేది: 29.10.2025 మ.3.30 గం. వరకు. మొబైల్ నెం: 83338 88545 ను సంప్రదించగలరు.
సం/- మునిసిపల్ కమిషనర్, ఇస్నాపూర్ మునిసిపాలిటీ
DIPR.No.9647-PP/CL/Advt/1/2025-26, తేది: 24.10.2025

తెలంగాణ ప్రభుత్వం
సాగునీటి పారుదల వలయం, నిజామాబాద్ జిల్లా
టెండర్ ప్రకటన
టెండర్ నోటీసు నం.20/2025-26 తేది: 22.10.2025 పనులకు గాను రూ.37.15 లక్షలకు అలిసాగర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం యొక్క స్టేజ్-II లోని పంపు నెం.4 మరమ్మతులు, పంపు నెం.1 యొక్క బేరింగ్ హౌస్ మరియు స్టేజ్-III యొక్క స్పేర్ షాఫ్ట్ నెం.5 తేది: 23.10.2025 నుండి 30.10.2025 వరకు టెండర్ ఆహ్వానించడమైనది. మిగతా వివరాలకు https://tender.telangana.gov.inలో చూడగలరు.
సం/- పర్యవేక్షక అభియంత, సాగునీటి పారుదల వలయం, నిజామాబాద్ జిల్లా
DIPR.No.9667-PP/CL/Advt/1/2025-26, తేది: 24.10.2025

ఫారం నెం.14 (నిబంధన 33(2) చూడండి)
రికవరీ అధికారి కార్యాలయం-I/II
ఋణాల రికవరీ ట్రిబ్యునల్
హైదరాబాద్ (DRT 1)
3వ అంతస్తు, త్రివేణి కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్- 500 001
డిమాండ్ నోటీసు
1993 ఋణాలు & దివాళా చట్టంలోని సెక్షన్లు 25 నుండి 28 వరకు మరియు ఆదాయపు పన్ను చట్టం, 1961లోని రెండవ షెడ్యూల్‌లోని నియమం 2 క్రింద ప్రకటన.
ఆర్‌సి/73/2024 తేదీ: 14-10-2025
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
వర్సెస్
మెస్సర్స్ ఎ.పి. ట్రాన్స్‌మిషన్ అండ్ ఇండస్ట్రీస్
వీరికి:
(CD-1) M/s. A.P. ట్రాన్స్‌మిషన్ అండ్ ఇండస్ట్రీస్, V మల్యాద్రి, S/o V మాలకొండయ్య, షెడ్ నెం.5, ప్లాట్ నెం.47, కో-ఆపరేటివ్ ఇండస్ట్రియల్ ఏరియా, గాంధీ నగర్, బాలానగర్, హైదరాబాద్-500 037, తెలంగాణ.
(CD-2) శ్రీ V. మల్యాద్రి, S/o. శ్రీ మాలకొండయ్య, వయస్సు: మేజర్, Occ: వ్యాపారం, F-58, మధురా నగర్, హైదరాబాద్ - 500 038, తెలంగాణ.
(CD-3) శ్రీ G. శ్రీధర్, S/o శ్రీ G. సాంబయ్య, వయస్సు: మేజర్, Occ: వ్యాపారం, H.No: 58-16, శ్రీ రామ్ నగర్, చింతల్, కుతుబుల్లాపూర్, రంగారెడ్డి జిల్లా-500 037, తెలంగాణ.
(CD-4) శ్రీమతి కామాక్షి, W/o Late Ch. హరినాథ్, వయస్సు: మేజర్, Occ: వ్యాపారం, ఇ.నం. 5-71/15/1, ప్లాట్ నెం. 51 మరియు 52, సర్వే నెం. 15 & 16, వజ్రా ఎన్‌క్లేవ్, బొల్లారం, ఓల్డ్ అల్వాల్, అల్వాల్ మునిసిపాలిటీ, మల్కాజ్‌గిరి మండలం, రంగారెడ్డి జిల్లా-500 010, తెలంగాణ.
(CD-5) శ్రీ P. అమర్‌నాథ్, S/o. శ్రీ గగన్న వయస్సు: సుమారు 48 సంవత్సరాలు, Occ: వ్యాపారం, డోర్ నెం.11-1-482/29, సాయి రామ్ రెసిడెన్సీ, అనంతపురం-515001, ఆంధ్రప్రదేశ్.
1. హైదరాబాద్‌లోని డెట్ రికవరీ ట్రిబ్యునల్ (DRT 1) ప్రిసైడింగ్ ఆఫీసర్ జారీ చేసిన ఆదేశాల ప్రకారం జారీ చేయబడిన రికవరీ సర్టిఫికేట్ ప్రకారం, OA నెం.: 296/2020లో రూ. 3,43,36,840/- (రూపాయలు మూడు కోట్ల నలభై మూడు లక్షల ముప్పై ఆరు వేల ఎనిమిది వందల నలభై మాత్రమే) మొత్తం పెండెంట్‌లైట్ మరియు భవిష్యత్తు వడ్డీతో పాటు @ 11.40 % సాధారణ వడ్డీ వార్షికంగా 04-09-2020 నుండి అమలులోకి వచ్చే వరకు రూ.2,11,110/- (రూపాయలు రెండు లక్షల పదకొండు వేల నూట పది మాత్రమే) మీకు ఎదురుగా చెల్లించాల్సి ఉందని ఇది తెలియజేస్తోంది (ఉమ్మడి మరియు పాక్షికంగా/పూర్తిగా/పరిమితం).
2. నోటీసు అందిన 15 రోజులలోపు పైన పేర్కొన్న మొత్తాన్ని చెల్లించాలని ఇందుమూలంగా మీకు నిర్దేశించబడింది, విఫలమైన పక్షంలో బ్యాంకులు మరియు ఆర్థిక సంస్థల చట్టం, 1993 మరియు దాని కింద ఉన్న నియమాల ప్రకారం రికవరీ చేయబడుతుంది.
3. తదుపరి విచారణ తేదీన లేదా అంతకు ముందు మీ ఆస్తుల వివరాలను అఫిడవిట్‌లో ప్రకటించాలని మిమ్మల్ని ఇందుమూలంగా ఆదేశించడమైనది.
4. తదుపరి చర్యల కోసం మీరు 03-12-2025న ఉదయం 10.30 గంటలకు దిగువ సంతకందారు ముందు హాజరు కావాలని ఆదేశించడమైనది.
5. పైన పేర్కొన్న మొత్తానికి అదనంగా, మీరు ఈ క్రింది వాటిని కూడా చెల్లించాల్సి ఉంటుంది:
(ఎ) సర్టిఫికెట్/అమలు ప్రక్రియల ఈ నోటీసు తర్వాత వెంటనే ప్రారంభమయ్యే కాలానికి చెల్లించాల్సిన వడ్డీలు
(బి) ఈ నోటీసు మరియు వారెంట్ల సేవకు సంబంధించి అయ్యే అన్ని ఖర్చులు, ఛార్జీలు మరియు ఖర్చులు మరియు బకాయి ఉన్న మొత్తాన్ని తిరిగి పొందడానికి తీసుకున్న అన్ని ఇతర చర్యలు.
నా స్వహస్తాల మీదుగా మరియు ట్రిబ్యునల్ ముద్రతో, ఈ తేదీన ఇవ్వబడింది: 14-10-2025.
రికవరీ ఆఫీసర్,
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ హైదరాబాద్ (DRT 1)

# పాలెం దుర్ఘటన తరహాలో కర్నూలు బస్సు ప్రమాదం

### 12 యేళ్లనాటి ఘటనలో 45 మంది, తాజా ఘటనలో 19 మంది సజీవదహనం

### నేటికీ అమలుకు నోచుకోని నాటి సిఐడి చీఫ్ కృష్ణప్రసాద్ సిఫార్సులు



**హైదరాబాద్, అక్టోబరు 24, ప్రభాతవార్త:** కర్నూలు జిల్లా చిన్న టేకూరు వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఘోర బస్సు దుర్ఘటన 12 ఏళ్ల క్రితం మహబూబ్‌నగర్ జిల్లా పాలెంలో చోటుచేసుకున్న ప్రమాదాన్ని తలపించింది. నాటి ఘటనలో పూర్తిగా కాలిపోయింది ఓల్వో బస్సు కాగా తా జాగా కర్నూలులో ప్రమాదానికి గురైన బస్సు కూడా ఓల్వో బస్సే కావడం గమనార్హం. పాలెం దుర్ఘటనలో 45 మంది మరణించగా భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా దీనిపై విచారణ చేసిన నాటి ఉమ్మడి ఎపిలో సిఐడి బాస్‌గా పనిచేసిన తెన్నేటి కృష్ణ ప్రసాద్ (ప్రస్తుతం బాపట్ల ఎంపిగా వున్నారు) సర్కారుకు కొన్ని సిఫార్సులు చేశారు. రోడ్ ఇంజనీరింగ్‌ను పటిష్టం చేయడంతో పాటు ఓల్వో బస్సుల డిజైన్‌ను ప్రమాదాలు జరిగినపుడు మంటలు చెలరేగకుండా మార్చాలని ఆయన చేసిన సిఫార్సులు జాతీయ స్థాయిలో అప్పట్లో మీడియాలో వచ్చినా ఇప్పటివరకు ఇవి అమలుకాకపోవడం శోచనీయం. 2013 అక్టోబరు 30న జరిగిన పాలెం దుర్ఘటన దేశవ్యాప్తంగా జరిగిన ఘోర బస్సు ప్రమాదాలలో ఒకటిగా నిలిచింది. ఆ రోజున బెంగళూరుకు నుంచి హైదరాబాద్‌కు జబ్బార్ ట్రావెల్స్ ఓల్వో బస్సు 51 మందికి పైగా ప్రయాణికులతో బయలు దేరింది. ఈ బస్సు తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో మహబూబ్‌నగర్‌లోని పాలెం వద్ద ప్రమాదానికి లోనయ్యింది. ప్రమాదం జరిగిన ప్రాంతం లో రహదారి చిన్నదిగా వుండడం, ఇదేచోట కల్వర్టు వుండడంతో వేగంగా వస్తున్న బస్సు కారును ఓవర్ టేక్ చేయబోయిన డ్రైవర్ కల్వర్టును గమనించేలోపల దానిని ఢీకొట్టాడు. డ్రైవర్ సీటు కిందేద బ్యాటరీ కంపార్ట్‌మెంట్ వుండడం వల్ల కల్వర్టును ఢీకొన్న వెంటనే బ్యాటరీ నుంచి ఒక్కసారిగా స్పార్క్ వచ్చింది. ఈ సా ర్క్ పక్కనే గల డీజిల్ ట్యాంక్‌కు అంటుకోవడంతో నిమిషాల వ్యవధిలో మంటలు చెలరేగాయి. బస్సు ప్రమాదానికి గురైన సమయంలో అందులోని ప్రయాణీకులు గాడనిద్రలో వుండడంతో వారంతా ఏం జరిగిందో తెలుసుకునేలోపే మంటల్లో చిక్కుకుని పూర్తిగా కాలిపోయారు. ఈ దుర్ఘటనలో డ్రైవర్ సహా ఆరుగురు మాత్రమే బయటపడ్డారు. ఈ ఘటనపై నాటి ఎపి సర్కారు సిఐడి బాస్‌గా వున్న కృష్ణ ప్రసాద్‌ను విచారణాధికారిగా నియమించింది.

ఈ దుర్ఘటనకు గల కారణాలు, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఎలా వ్యవహరించాలనే దానిపై నివేదిక ఇవ్వాలని ఆదేశిం చింది. దీనిపై కృష్ణ ప్రసాద్ నేతృత్వంలోని సిఐడి అధికారుల బృందం పాలెం బస్సు దుర్ఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలించింది. ప్రమాదంలో పూర్తిగా కాలిపోయిన ఓల్వో బస్సును కూడా పరిశీలించింది. దీనిపై నాలుగు నెలల పాటు విచారించిన సిఐడి బృందం 400 పేజీలతో సర్కారుకు ఒక నివేదిక ఇచ్చింది. ఇందులో ప్రమాదానికి కారణమైన జబ్బార్ ట్రావెల్స్ నిర్వాహకులతో నాటు తెలుగుదేశం నేత జెసి ప్రభాకర్ రెడ్డి సతీమణి పేరును నిం దితులుగా చేర్చారు.

ఈ ఘటనకు బస్సులో జరిగిన మార్పులు ఒక కారణంగా సిఐడి విచారణలో తేలింది. బస్సు డిజైన్‌ను, సీట్లను ఇష్టాను సారం మార్చారని, దీనివల్ల ప్రమాదం జరిగినపుడు అందులో వున్న వారు తప్పించుకోలేక పోయారని, ఈ కారణంగానే మృతుల సంఖ్య భారీగా వుందని అధికారులు తేల్చారు. టైర్లకు సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా ఇంధన ట్యాంకులు వుండడం వల్ల నిమిషాల్లో మంటలు వ్యాపించాయ ని సిఐడి విచారణలో తేలింది. దీని తరువాత జాతీయ రహదారులపై రోడ్ ఇంజనీరింగ్‌లో వున్న లోపాలను సిఐడి బృందం ఎత్తి చూపింది. రోడ్ ఇంజనీరింగ్‌ను పటిష్టం చేయాలని అందులో సూచించారు. జాతీయ రహదారులపై కల్వర్టులు వున్న చోట రహదారులు వెడల్పుగా వుండాలని, రెండు వైపులా సిగ్నల్స్ వుండాలని అధికారులు సూచించారు. దీని తరువాత వేలాది కిలోమీటర్లు ప్రయాణాలు సాగించే ఓల్వో బస్సుల్లో డిజైన్ సవ్యం గా వుండడం లేదని, బస్సులను నిబంధనలకు విరుద్ధంగా మరింత వేగంగా వెళ్లేందుకోసం తక్కువ బరువుతో తయారు చేస్తున్నారని, దీనివల్ల బస్సు లో నాణ్యత లోపిస్తోందని, ఇవన్నీ ప్రమాదాలు జరిగినపుడు మంటలు వ్యాపించేందుకు కారణమ వుతున్నా యని సిఐడి తన నివేదికలో పేర్కొంది. అప్పట్లో కృష్ణ ప్రసాద్ ఇచ్చిన నివేదిక జాతీయ స్థాయిలో విస్తృతంగా చర్చకు వచ్చింది. అయినప్పటికీ ఆయన సిఫార్సులు ఎక్కడా అమలు కాలేదు. దీని పర్యవసానంగానే దేశ వ్యాప్తంగా అనేకచోట్ల ఓల్వో బస్సులు ప్రమాదాలకు లోనవుతూ మంటల్లో కాలిపోతు న్నాయి. ఈ ప్రమాదాల్లో పలువురు మరణిస్తున్నారు. తాజా ఘటనపై కృష్ణప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ నాటి ఘటనపై తాను నివేదిక ఇచ్చానని, దీనిపై ఒక ఎంపిగా తాను పా ర్లమెంట్‌లో మాట్లాడతానని తెలిపారు.

వార్త

కొద్దిపాటి నిర్లక్ష్యం కూడా ఒక్కోసారి పెద్ద పెద్ద సమస్యలను సృష్టిస్తుంది.

-ఫ్రాంక్లిన్

# రహదారిలో మరణ మృదంగం!


కర్నూలు శివార్లలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రమాదంలో 20 మంది ప్రాణాలు గాల్లో కలిసిపోయాన్న వార్తవింటేనే హృదయ విదారకమవుతుంది. జాతీయ రహదార్లలో అతివేగం ప్రమాదకరమన్న సంకేతాలు, హెచ్చరికలతో ఎన్ని బోర్డులు పెట్టినా వేగ నియంత్రణలో అటు డ్రైవర్లు కాని, వారిని అదుపు చేయడంలో ఆర్టీఏ అధికారులు కానీ ప్రత్యేక శ్రద్ధ పెట్టకపోవడంతో అన్యాయంగా ప్రాణాలు పోతున్నాయి. గమ్యానికి సజావుగా చేరుతామన్న నమ్మకంతోగురువారం రాత్రి హైదరాబాద్ నుంచి బెంగళూరుకు ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సెక్కిన 41 మంది ప్రయాణికుల్లో 19 మంది ఈ ప్రమాదంలో బుగ్గిపాలయ్యారు. వారు నిద్రిస్తున్నస్లీపర్ లోనే మాడి మసయిపోయారు. బతికి బయటపడిన వారిలో 21 మంది ప్రయాణికులు ఈ అతివేగాన్ని గమనించి బస్సులో ఆందోళన చెందినవారే. కీడు శంకించిన వారే. ముందు నుంచి బయటపడాలనుకున్న ప్రయాణికుల దురదృష్టమేమిటో కానీ హైడ్రాలిక్ డోర్ఓపెన్ కాలేదు. వెనుకనున్న అద్దాలు బద్దలు కొట్టి బయటకు వచ్చిన వారే సజీవులైనారు. మిగతా వారంతా విగత జీవులే. కనీసం వారి మృతదేహాలు గుర్తుపట్టేందుకు కూడాలేదు. వారి బంధువులతో పోల్చుకునే డిఎన్ఎ పరీక్షలు జరిగితే తప్ప ఎవరి వారెవరెవరో తెలుసుకోవడం కష్టం. సాధారణంగా రాత్రి ప్రయాణాలంటేనే భయంకర అనుభవాలు చూడాల్సి వస్తుంది. ప్రయాణంలో నిద్ర సమయం కలిసి వస్తుందనే ఆలోచనలతో టిక్కెట్ ధర ఎక్కువయినా రాత్రిపూట ప్రయాణమైనా చేయడానికిష్టపడ్తారు. కర్నూలు నుంచి డోన్‌కు వెళ్లేదారిలో కర్నూలు శివారు ఉల్లింద కొండ సమీపంలో చిన్నటేకూరు గ్రామంవద్ద తెల్లవారు జామున 3.30కి ఒక ప్రయివేటు ట్రావెల్‌బస్సు బైకును ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఢీకొట్టగానే బైకును 300 మీటర్ల దూరం ఈ బస్సు ఈడ్చుకెళ్లడంతో ద్విచక్ర వాహనం పెట్రోలు బంక్‌లో మంటలు చుట్టుముట్టాయి. ఈ ప్రమాదం జరిగినప్పుడు డ్రైవరు బస్సునుంచి దూకి పరారైపోయాడే తప్ప ప్రయాణికుల క్షేమం గురించి ఆలోచించినట్లు లేదు. ప్రత్యక్ష సాక్షులు చెప్పే కథనాలను బట్టి సహాయ డ్రైవరు బస్సు ఎమర్జెన్సీ డోర్ తెరవాలని చూసినా తలుపులు తెరుచుకోలేదు. బస్సులోకి పొగచూరి స్లీపర్‌లో పడుకున్న వారికి తప్పించుకునే అవకాశమే లేకపోయింది. కింది సీట్లలో ఉన్న 21 మంది మాత్రమే బస్సు అద్దాలు బద్దలు కొట్టుకుని ప్రాణాలతో బయటపడ్డారు. ప్రమాదాలు జరిగినప్పుడల్లా అటు అధికారులు కానీ బస్సు తాలూకు డ్రైవర్లు కానీ అసలు సమాచారాన్ని మించి ఏవేవో కథలు వినిపిస్తూనే ఉంటారు. కానీ ప్రయాణికుల్ని రక్షించే బాధ్యతను ఏ మేరకు చేపట్టారో చెప్పరు. చెప్పలేరు. ఈ ప్రమాదం విషయంలో ఉభయ తెలుగు రాష్ట్రాల అధికారులు, మంత్రులు చెప్తున్న సమాచారానికి పొంతనలేదు. అతివేగాన్ని గమనించి ఆందోళనతో ఆక్రందించిన వారు తెగించి బయటపడ్డారు. నిజానికి బస్సు ఇన్సూరెన్స్ రోడ్‌టాక్స్, బేస్ రిజిస్ట్రేషన్ వంటి అంశాలపై నిర్దిష్టంగా చెప్పగలిగినవారు లేరు. ప్రమాదం జరుగుతుందని ఊహించకపోయినా, ఒకవేళ ప్రమాదం జరిగితే ప్రయాణికులకు అందివ్వాల్సిన పరిహారానికి అర్హత లెక్కకట్టేందుకైనా బీమా సౌకర్యం ఉండాల్సిందే. వాహనానికి ఫిట్‌నెస్ ఎంత అవసరమో, ఇన్సూరెన్స్ తాజాగా ఉందోలేదో తనిఖీ చేయాల్సిన బాధ్యత రవాణా శాఖ అధికారులదే. ఈ బస్సుకు సంబంధించిన వివరాల్లోకి వెళ్తే డయ్యూడామన్ రిజిస్ట్రేషన్ జరిగింది. ఈ మధ్య కాలంలో బస్సుకు ఎక్కడ కొన్నా ఎక్కువ సీట్లు బాడీ బిల్డింగ్ కోసం వేరేరాష్ట్రాలకు వెళ్తుంటారని, బస్సు మాత్రం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల మధ్య తిరుగుతుంటాయి. ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు ఆర్టీఏ అధికారులు నానా హంగామాచేస్తుంటారు. కానీ విధి నిర్వహణలో బాధ్యతారాహిత్యం వహించిన అధికారులెవరో తేల్చివారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకునేందుకు ఏ ప్రభుత్వం వద్ద నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాలన్న చట్టపరమైన ఆదేశాలు ఏవీ అమల్లో ఉండవు. బస్సు మంటల్లో కాలిపోకముందే అదృష్టవశాత్తు వెనుక డోర్ బద్దలు కొట్టి కొందరు తమను రక్షించారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ముందుగానే డ్రైవరు హెచ్చరికగా ముందు తలుపు తీసివుంటే మరికొందరు బతికి ఉండేవారన్న అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేశారు. గాఢనిద్రలో ఉన్నవారు ఎవరూ బతికి బయటపడలేదు. లోపల చిక్కుకున్న వారి ఆర్తనాదాలు విని బయటవారే వారిని రక్షించేందుకు పూనుకున్నారు. వారు అభినందనీయులు. బైకిస్టు శివశంకర్ మృతి చెందినవారిలో ఉన్నారు. ఫోరెన్సిక్ బృందం ఆధ్వర్యంలో మృతదేహాలు ఉన్న చోటనే పోస్టుమార్టం నిర్వహిస్తున్నారు. ఇలాంటి అనుభవం తలచుకుంటేనే మనసు కలిచివేస్తుంది. ప్రయివేట్ ట్రావెల్ బస్సులు నడిపే తీరులోనే ఎన్నో లోపాలున్నట్లు గతంలో నుంచే ఆరోపణలున్నాయి. అధికారులు తరచు తనిఖీలు చేస్తుంటే ఇలాంటి ప్రమాదాలు నివారించవచ్చు. అలాకాకుండా నిర్ణీత సమయంలో ఆర్టీఏ అధికారులు తనిఖీలు చేపట్టడం, బస్సుల ఇన్సూరెన్స్ తాజాగా అమలులో ఉండే విధంగా యాజమాన్యాన్ని హెచ్చరించే విధి నిర్వహణచేసే విధంగా అధికారులను ఆదేశించాలి. ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు విషయమైడ్రైవర్లకు అవగాహన కల్పించే బాధ్యత ప్రభుత్వమే తీసుకోవడం వలన ప్రమాదాల్లో ప్రాణనష్టాన్ని నివారించేందుకు అవకాశం ఉంటుంది. అప్పుడే డ్రైవర్ల నిర్లక్ష్యం వలన ప్రమాదాలు పునరావృతం అవకుండా చూడొచ్చు.

సమర్థులైన వారే ఎప్పుడూ నాయకత్వం వహిస్తారు. అందరికీ మార్గదర్శకులవుతారు. తక్కినవారు వారిని అనుసరిస్తూ ఉంటారు.



సర్వేపల్లి రాధాకృష్ణన్

ఒక గొప్ప జాతిగా మారాలనుకున్న దేశ ప్రజలకు సామూహిక క్రమశిక్షణ అన్నది అత్యావశ్యకమైన నిబంధన.



మహాత్మా గాంధీ

# మాటల్లో ఆగ్రహం, చేతల్లో అనుగ్రహం!

**తెలుగు రాష్ట్రాల్లో కూడా ఎంతో మంది ఉన్నతాధికారులపై వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు చేసి చర్యలకు సిద్ధమైనా ప్రభుత్వం నుంచి అనుమతి లభించక ఆగిపోయిన సంఘటనలు కోకొల్లలు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విజిలెన్స్ కమిషనర్ రామచంద్రసమాల్ బయటపెట్టిన విషయాలు అందుకు అద్దం పట్టాయి. అప్పుడే కాదు నేటికీ కూడా కొందరు సీనియర్ రాజకీయ నాయకులు ఈ అవినీతిలో మునిగి తేలుతున్నారు. కాంట్రాక్టుల కోసం ఏకంగా మంత్రులే బహిరంగంగా పోటీపడుతూ విమర్శనాస్త్రాలు కురిపించుకుంటుంటే ఏమనుకోవాలి? ఎవరికి చెప్పుకోవాలి? ముఖ్యంగా నిజాయితీ, సమర్థవంతంగా పనిచేసే అధికారులను ఎంపిక చేసి అక్కడ నియమించడంలో విఫలమవుతున్నారనే విమర్శలను కొట్టివేయలేం. ఒకవేళ అధికారులు ఎవరైనా చర్యలకు నడుం కట్టినా పగ్గాలు బిగపట్టిన పాలకుల చర్యలే అడ్డుకొంటున్నాయనే విమర్శలను కాదనలేం.**

దామెర్ల సాయిబాబ

'పరసరంబు పంజైనా బసులకాపరి తప్పు, ప్రజలు దుర్జనులైనా ప్రభువుని తప్పు, భార్య గయ్యాలి అయి నా ప్రాణనాధుని తప్పు, తనయుండు దుష్టుడైనా తండ్రితప్పు, కూతురు చెడిన మాత తప్పు, సైన్యంబు చెదరినా సైన్యనాధుని తప్పు... అంటూ ఎవరు తప్పుచేస్తే ఎవరు బాధ్యులో ఏనాడో ధర్మపురి లక్ష్మీనరస్సింహా స్వామి శతకంలో శేషప్ప కవి చెప్పారు. దేశంలో అవినీతి, అక్రమాలు, ఆశ్రితపక్షపాతాలు పెరిగిపోతున్నాయని అందరూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవస్థ ఇలా దిగజారిపోవడానికి ఎవరు బాధ్యులో తెలియనివారు లేరు. ఈ పార్టీ, ఆపార్టీ అనికాదు. తర తమ బేధాలు లేకుండా ఎవరు అధికారంలో ఉన్నా 'తిలాపాపం తలా పిడికెడు' అన్నట్లు మానవతా విలువలను మంట కలుపుతున్నారు. తెలుగు రాష్ట్రాలతోసహా దేశంలో అవినీతి అంతకంతకు పెరిగిపోతున్నది. పాలకులు అభివృద్ధి పేరుతోఎన్ని లక్షల కోట్లు అప్పులు తెస్తు న్నారో అదే స్థాయిలో అవినీతి కూడా విజృంభిస్తున్నది. ప్రపంచ బ్యాంకు, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు ఒక్కటేమిటి ఎక్కడ అప్పు దొరుకుతుందో శోధించి అక్కడికి వెళ్లి రకరకాల విన్యాసాలుచేసి ఒప్పించి, మెప్పించి అప్పులు తెచ్చుకుంటున్నారు. అప్పులు తేవడమే గొప్పగా చెప్పుకునే పరిస్థితులు దాపురించాయి. ఇప్పటికిప్పుడు ఈ సంప్రదా యం ఆరంభం కాకపోయినా గత రెండు, మూడు దశాబ్దాల నుంచి కొనసాగుతున్నా రానురాను పెరిగిపోతున్నది. మరొకపక్క అప్పులతోపాటు పన్నుల రూపంలో ఆదాయాన్ని పెం చుకుంటున్నారు. ఇంకొక పక్క దిగజారిపోతున్న మానవతా విలువలపట్ల నిజాయితీ అధికారుల ఆవేదన మౌనరోదనగా మిగిలిపోతున్నది. అంతో, ఇంతో నిజాయితీతో జీవనం సాగిస్తున్న అధికారులను అసమర్థులుగా పరిగణించే దురదృష్ట పరిస్థితులుదాపురించాయి. ఎలుకలను చూసి పిల్లి తప్పు కున్నట్లుగా అవినీతిపరుల ముందు నీతివంతులు తలవంచు కునే నికృష్టపు రోజులు వచ్చాయి. రాష్ట్రాల పరిధిలో ఎసిబి కానీ కేంద్రస్థాయి సిబిఐ కానీ రాజకీయ ఒత్తిడిల నుంచి బయటపడలేకపోతున్నాయి. రాజకీయ అవినీతి శృతి మించి పోతున్నది. అధికారుల్లో ఉన్న అవినీతి ఒక ఎత్తైతే, కీలక పదవులు నిర్వహిస్తున్న కొందరు పెద్దలు, ప్రజాసేవ ముసుగులో చెలామణి అవుతున్న మరికొందరు రాజకీయ నాయకులు దళారుల వల్లనే పరిస్థితి అదుపు తప్పిపోతున్నదేమో ననిపిస్తున్నది. వారి రాజకీయ అధికారం ధాటికి నిజాయితీ, సమర్థులైన అధికారులు సైతం నిస్సహాయంగా ఉండిపోతున్నారు. అవినీతి మూలంగా స్వాతంత్య్రం వచ్చినప్పటినుంచి ఇప్పటివరకు ఎన్ని లక్షలకోట్లు భారత్ కోల్పోయిందో అంచనాలకే అందదు. అవినీతిని అంతం చేయాల్సిన కీలక పదవుల్లో ఉన్న కొందరు రాజకీయ నాయకులే చట్టానికి చుట్టాలై చక్రం తిప్పుతున్న సంఘటనలు గతంలో ఎన్నో బయటపడ్డాయి. పశ్చిమబెంగాల్ మాజీ మంత్రిఒకరు ఉపాధ్యాయ నియామకాల కుంభకోణంలో కోట్లాది రూపాయలు దిగమింగి తన ఆత్మమిత్రురాలు ఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా దాచిపెట్టిన వైనాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రట్టు చేసింది. ఆ మధ్య కర్ణాటకలో బాధ్యత కలిగిన మంత్రే తనచావుకు కారణమని ఒక యువ గుత్తేదారు ఆత్మహత్య చేసుకున్నారు. దాంతో తప్పనిపరిస్థితుల్లో ఆ మంత్రి రాజీనామా చేయాల్సివచ్చింది. సబ్బుల తయారీకి అవసరమైన ముడిసరుకుల టెండర్ ఆమోదముద్ర పొందడానికి లంచం ముట్టచెప్పాల్సిందేనని గుత్తేదారుకు ఆ ప్రాంత శాసనసభ్యు డు తన కుమారుడికి అప్పగించడంతో ఏకంగా నలభై లక్షలరూపాయలు తీసుకుంటూ లోకాయుక్త పోలీసుల ఉచ్చులో చిక్కుకున్నాడు. ఇక

ఒక్క మాట

సాక్షాత్తు హైకోర్టు న్యాయమూర్తి ఇంట్లో జరిగిన అగ్నిప్రమాదంలో లక్షలాది రూపాయలు నోట్లకట్టలు బయటపడ్డాయి. రాజ్యాంగంకల్పించిన రక్షణవల్ల ఆయనపై కనీసం ఎఫ్ఐఆర్ కూడా వెంటనే చేయలేని నిస్సహాయ పరిస్థితి. దీంతో ఆ డబ్బు ఎక్కడినుంచి వచ్చింది? ఎవరు ఎందుకోసం ఇచ్చారు? తదితర ప్రశ్నలకు జవాబు దొరకదు. మొన్న ఒడిశాలో ఒక సబ్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఒక ఐఎఎస్ అధికారి పది లక్షల లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. ఆయన ఇంటో సోదా చేసి నలభైలక్షలకుపైగా నగదును అధికారులు కనుగొన్నారు. తెలుగు రాష్ట్రాల్లో కూడా ఎంతో మంది ఉన్నతాధికారులపై వచ్చిన ఆరోపణలపై దర్యాప్తుచేసి చర్యలకు సిద్ధమైనా ప్రభుత్వం నుంచి అనుమతి లభించక ఆగిపోయిన సంఘటనలు కోకొల్లలు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విజిలెన్స్ కమిషనర్ రామచంద్రసమాల్ బయట పెట్టిన విషయాలు అందుకు అద్దంపట్టాయి. అప్పుడేకాదు నేటికీ కూడా కొందరు సీనియర్ రాజకీయ నాయకులు ఈ అవినీతిలో మునిగి తేలుతున్నారు. కాంట్రాక్టుల కోసం ఏకంగా మంత్రులే బహిరంగంగా పోటీపడుతూ విమర్శనాస్త్రాలు కురిపించుకుంటుంటే ఏమనుకోవాలి? ఎవరికి చెప్పుకోవాలి? ముఖ్యంగా నిజాయితీ, సమర్థవంతంగా పనిచేసే అధికారులను ఎంపిక చేసి అక్కడ నియమించడంలో విఫలమవుతున్నారనే విమర్శలను కొట్టివేయలేం. ఒకవేళ అధికా రులు ఎవరైనా చర్యలకు నడుం కట్టినా పగ్గాలు బిగపట్టిన పాలకుల చర్యలే అడ్డుకొంటున్నాయనే విమర్శలను కాదనలేం. ఏళ్లతరబడి కష్టపడి అక్రమార్జనను వెలికితీసి కేసులుపెట్టిన తర్వాత కూడా మూడోకంటికి తెలియకుండా కేవలం రాజకీయఒత్తిడిల మేరకు ఉపసంహరించిన సందర్భాలు గతంలో ఎన్నో ఉన్నాయి. ఫలితంగా అవినీతి అదుపు లేకుండాపోతున్నది. అవినీతి రకరకాలుగా ఉంటుంది. అందులో ఒకరకం మనిషికి కనపడదు. ఇచ్చిపుచ్చుకునే చేతులు రెండూ అదృశ్యంగానేఉంటాయి. మూడో నేత్రానికి దృశ్యగోచరమయ్యే అవకాశం ఉండదు. సమయం, సందర్భాన్ని బట్టివదంతులు, ఆరోపణలు, నిజానిజాలు, వ్యక్తిగత గుణగణాలు, గత, ప్రస్తుత పరిస్థితులను బట్టివనరులు, తాహతులు అంచనా వేసుకొని ఎవరికివారే ఊహాజనితమైన నిర్ణయానికి రావాల్సిందే తప్ప ప్రత్యక్ష సాక్షులతో రుజువు చేయడం అసాధ్యం. ఇది పైస్థాయిలో అయితే మరింతకష్టం. ముడుపులు ఇచ్చినవారు ఇచ్చినట్లు కానీ, తీసుకున్నవారు తీసుకున్నట్లు కానీ ఏపరిస్థితుల్లోనూ చెప్పరు. ఎవరైనా ఆరోపణలుచేసినా ఇద్దరుకలిసి ఖండించడమేకాదు తమ పరువుకు భంగం కలిగించారంటూ న్యాయస్థానం మెట్లెక్కడానికి కూడా వెనుకాడరు. ఇక ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఆ సమాచారం మేరకు వలపన్ని పట్టుకున్న కేసుల్లో కూడా ఏళ్లతరబడి జాప్యం జరిగి కోర్టుల్లో వీగిపోతున్నాయి. ప్రజల అందరి ముందు వికృతరూపం ధరించి నాట్యం చేసేది మరోరకం అవినీతి. అది ప్రజలకే కాదు పాలకులకు కూడా స్పష్టంగా తెలుసు. ప్రభుత్వం అప్రతిష్టపాలయ్యేది కూడా ఇక్కడే. ఇప్పుడు తాజాగా తెలంగాణలో చెక్‌పోస్టులను రద్దుచేస్తూ నిర్ణయం తీసుకున్నారు. చెక్‌పోస్టుల్లో భారీఎత్తున అవినీతి జరుగుతున్నదని, ప్రైవేట్ దళారులను పెట్టుకొని వేలాది రూపాయలు వసూలు చేస్తున్న విషయం బహిరంగ రహస్యమే. నిన్న, మొన్న జరిగిన ఎసిబి దాడుల్లో ఇది బయట పడింది. ఇప్పుడే కాదు అంతకుముందు కూడా ఎన్నోసార్లు ఈ చెక్‌పోస్టులపై ఆకస్మిక తనిఖీలు చేసిలక్షలాది రూపాయలుపట్టుకున్న ఉదంతాలు ఎన్నోఉన్నాయి. ఇన్ని దశాబ్దాలుగాఅక్కడ జరుగుతున్న అవినీతి స్పష్టంగా తెలిసినా దాన్ని నిరోధించలేకపోయారు. ఇప్పుడు తాజాగా ఆ రవాణా చెక్ పోస్టులను ఏకంగా ఎత్తివేస్తూ ప్రభుత్వం ఆదేశాలుఇచ్చింది. వాస్తవంగా ఇతర రాష్ట్రాలనుంచి తెలంగాణలోకి వచ్చే వాహనాల నుంచి పన్నువసూలు తాత్కాలిక పర్మిట్లజారీ పేరుతోపాటు మోటారు వాహనాల చట్టం ఉల్లంఘనలను అరికట్టేందుకు ఈ చెక్‌పోస్టులను ఏర్పాటుచేశారు. కానీ జిఎస్టీ అమలులోకి వచ్చిన తర్వాత చెక్‌పోస్టుల అవసరం లేదని కేంద్రం స్పష్టం చేసినా అనేక రాష్ట్రాలు చాలాకాలం క్రితమే వీటిని తొలగించినా తెలంగాణలో మాత్రం ఇవి మొన్నటి వరకు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ చెక్‌పోస్టుల తొలగింపుపై ఈ యేడాది జులై ఆఖరివారంలోనే మంత్రివర్గం కూడా నిర్ణయం తీసుకున్నది. అయినా అవి తొలగిపోలేదు. మోకాలొడ్డిందెవరు? ఈజాప్యానికి కారణాలు ఏమిటో పెద్దగా ఆలోచించాల్సిన పనిలేదు. అయితే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మొన్న ఈవిషయంలో ఆగ్రహం వ్యక్తంచేయడంతో హుటాహుటిన అమలుకు శ్రీకారం చుట్టారు. జిఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత చెక్‌పోస్టులు అవసరంలేదనే కారణం చూపిఎత్తివేసిన మాట నిజమే అయినా అక్కడ జరుగుతున్న అవినీతిని నియంత్రించలేకపోయారనేది వాస్తవం. అందరూ అవినీతికి పాల్పడుతున్నారని చెప్పడం లేదు. కానీ అధికశాతం ఆ బాటవైపే నడుస్తున్నారు. ఏదిఏమైనా అవినీతి శృతిమించిపోతున్నది. ఉన్నత స్థాయిలో ప్రధానంగా రాజకీయ అవినీతి అరికట్ట కుండా దేశం నుండి దాన్ని పారద్రోలడం అంత సులభం కాదు. ●

# మూడు పువ్వులు ఆరుకాయలుగా చీప్ లిక్కర్ వ్యాపారం


బుగ్గన మధుసూదనరెడ్డి

రాష్ట్ర వ్యాప్తంగా ఎక్సైజ్ శాఖ వారు ఇబ్బడి ముబ్బడిగా చీప్ లిక్కర్ షాపుల ఏర్పాటుకు లాటరీ రూపేణ ఎన్నిక అయిన వారికి గ్రామ, గ్రామాన, ఆయా నగరాలలో అనుమతులు మంజూరు చేసిన విషయం మనందరికీ విదితమే. అయితే ఒకవైపు ఈ చీప్ లిక్కర్ షాపుల ద్వారా వాటి యజమానులకు లక్షల్లో ఆదాయం సమకురుతూ ఉంటే, మరోవైపు దీనికి బానిసలు అయిన నేటి యువత జీవితాలు మాత్రం అధోగతి, గుగ్గిపాలు అవుతున్నాయి అనే మాట సత్యదూరం కాదు. ఇక రోడ్డు మీద మనం ఏదేని పని మీద నడిచి వెళ్తుంటే ఏదైనా హీరో సినిమా రిలీజ్ అయితే ఏ విధంగా టికెట్ల కోసం క్యూలో నిలబడతారో ఆ విధంగా మందుబాబులు, మద్యం ప్రియులు చీప్ లిక్కర్ కోసం ప్రతిరోజు ఉదయం నుంచే షాపుల దగ్గర బారులు తీరి ఉండటాన్ని చూస్తే మన దేశం ఎటుపోతుందో, ఎలాంటి వినాశక పంథాలో పయనిస్తుందో ఒక్కసారి తలచుకుంటేనే ప్రతి మానవతావాది గుండె కూడా కాస్తంత బాధతో బరువెక్కిపోతుంది అనే మాట అక్షర సత్యం. ఎందుకంటే నేటి యువత ఈ చీప్ లిక్కర్‌కు ఎక్కువగా బానిసలై దాసోహమై అటు తమ ఆరోగ్యాన్ని గుల్ల చేసుకోవడంతో పాటు, ఇటు ఆర్థికంగా కూడా చితికిపోతుండటం ఈ ప్రజాస్వామ్యానికి సంబంధించి ఎంతైనా ఆందోళనకరమైన విషయం. అదే విధంగా 'మందు వేయరా చిందులు తొక్కరా' అన్న తరహాలో ముఖ్యంగా సామాన్య, దిగువ తరగతి ప్రజానీకం ఈ చీప్ లిక్కర్ మత్తుకు ఎక్కువగా బలిఅవుతూ తమ కుటుంబ సభ్యులను సైతం ఆర్థికంగా దివాలాఎత్తి రోడ్డునపడే పరిస్థితిని కల్పిస్తుండటం అత్యంత శోచనీయమైన, హేయమైన విషయం. ఇక మన రాష్ట్రప్రభుత్వం వారు తమ ప్రభుత్వాన్ని నడపడానికి ఈ చీప్ లిక్కర్ షాపుల ఏర్పాటుకు ఎడాపేడా గ్రీన్ సిగ్నల్ ఇస్తుండటంతో ఇక చీప్ లిక్కర్ రాష్ట్ర వ్యాప్తంగా కూడా ఎక్కడ చూసిన ఏరులై పారుతుండటం, అందుకు మద్యం ప్రియులు సైతం తమ వంతుగా సహకరిస్తుండటంతో ఇక రాష్ట్ర ప్రభుత్వం వారికి ఎదురులేకుండా పోయింది. తద్వారా వారి పరిస్థితి ఆడింది ఆట పాడిందిగా మారిపోయింది. ఇంకా చెప్పుకుంటూపోతే తెలిసో తెలియకో లేదా చెడు స్నేహాల మూలనో నేటి యువత ఒక్కసారి ఈ చీప్ లిక్కర్‌కు పొరపాటున బానిసలు అయ్యారో ఇక వారి జీవితాలు కుక్కలు చింపిన విస్తరే. ఇక వీరి అగమ్యగోచర పరిస్థితి ఎలా ఉంటుంది అంటే చీప్ లిక్కర్‌కు బానిసలు అయిన పుణ్యమా అని వీరికి అటు బయటి సమాజంలోని ప్రజలతో, ఇటు తమ కుటుంబసభ్యులతో నిత్యం చివాట్లు, అవహేళనలు తప్పవు కాక తప్పవు. ఇక వీరిరువురి దృష్టిలో వీరు ముందుకు బానిసైన చవట దద్దమ్మలుగా మిగిలిపోవాల్సిందే. అంతేకాదు వీరు చీప్ లిక్కర్‌ను పీకలదాకా సేవించి ఇటు తమ ఇంటికుటుంబ సభ్యులతో వాగ్వివాదానికి దిగడం, అటు తమ ప్రాంతవాసులతో కూడా చీటికిమాటికీ అరుపులు, కేకలతో గొడవలకుదిగుతూ వారికి కంటిమీద కునుకు లేకుండా చేయడం ఈ మందు బాబులకు నిత్యకృత్యమైన వ్యవహారంగా జరుగుతూ ఉంటుంది. ఏదిఏమైనా ఈ చీప్ లిక్కర్‌వ్యసనం మూలాన ఇటు మందు బాబులు చాలాతీవ్ర స్థాయిలో ఆర్థికంగా నష్టపోవడం, అటు ఈ సమాజంలోతమ కుటుంబ సభ్యుల పరువు ప్రతిష్టలను బజారుకు ఈడ్చడం, ఒక సహజ ప్రక్రియ. నేటి యువత తల్లిదండ్రులు ఎల్లవేళలా నిత్యం అప్రమత్తంగా వ్యవహరిస్తూ ఎలాంటి పరిస్థితుల్లో ఈ చీప్ లిక్కర్ వ్యసనానికి బానిసలు కాకుండా చూడాల్సిన బాధ్యత వారి భుజస్కందాలపై ఉంది. ●

# రోడ్డు భద్రత దేశ అభివృద్ధికి పెను సవాలు

డి జె మోహన రావు

ఒక దేశ సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక అభివృద్ధిలో రవాణా వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుంది. సువిశాలమైన మనదేశంలో రవాణా జాతీయ, రాష్ట్ర, గ్రామీణ రహదారుల గుండా జరుగుతుంది. మన దేశంలో అన్ని రహదారులు కలిపి సుమారు 63.31 లక్షల కిలోమీటర్ల పొడవుతో ఉన్నాయి. ఇది ప్రపంచంలోనే రెండవ అతి పెద్ద రోడ్డు వ్యవస్థగా గుర్తింపు పొందింది. మొత్తం సరుకు రవాణాలో 71శాతం, ప్రయాణీకుల రవాణాలో 85శాతం రోడ్డుమార్గం ద్వారానే జరుగుతున్నాయి. జాతీయ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదిక ప్రకారం, 2023సంవత్సరంలో దేశంలో4,64,029 రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయి. 2022లో జరిగిన 4,61,312 ప్రమాదాలతో పోలిస్తే ఈ సంఖ్య పెరిగింది. ఈ ప్రమాదాలలో 1,73,826 మంది ప్రాణాలు కోల్పోగా, 4,47,969 మంది గాయాల పాలయ్యారు. మరణాల సంఖ్య కూడా 2022 (1,71,100) తో పోలిస్తే 1.6 శాతం పెరిగింది. రోడ్డు ప్రమాదాల్లో అత్యధిక మరణాలు జాతీయ రహదారుల్లో 34.6 శాతం(60,127) నమోదయ్యాయి. ఆ తర్వాత రాష్ట్రరహదారుల్లో 23.4 శాతం(40,611 మరణాలు) సంభవించాయి. ఎక్స్‌ప్రెస్‌వేలపై మొత్తం 3,630 రోడ్డు ప్రమాదాలు నమోదవ్వగా 2,762 మంది గాయపడ్డారు. 2,372 మంది మరణించారు. మొత్తం రోడ్డు ప్రమాద మరణాలలో ద్విచక్ర వాహనాల వల్ల అత్యధికంగా 79,533 (45.8 శాతం )మరణాలు సంభవించాయి. ఆ తర్వాత పాదచారుల మరణాలు 27,586 (15.9శాతం), ఇతర వాహనాల వలన 24,776 (14.3శాతం) మరణాలు నమోదయ్యాయి. అత్యధిక ప్రమాదాలు సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9గంటల మధ్య నమోదవుతున్నాయి. ఇది మొత్తం ప్రమాదాలలో 20.7శాతంగా ఉంది. 2023లో జాతీయ రహదారులపై జరిగిన రోడ్డు ప్రమాదాల్లో అత్యధిక మరణాలు ఉత్తరప్రదేశ్‌లో 11.7 శాతం(7,041), ఆ తర్వాత తమిళనాడులో 10.4 శాతం(6,258), మహారాష్ట్రలో 8.5 శాతం (5,104), కర్ణాటకలో 7శాతం (4,230), మధ్యప్రదేశ్‌లో 7 శాతం (4,184 మరణాలు) నమోదయ్యాయి. సాధారణంగా, రోడ్డు ప్రమాదాల వల్ల మరణించే వారి కంటే గాయపడే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. కానీ అండమాన్ నికోబార్ దీవులు, జార్ఖండ్, పంజాబ్, బీహార్, ఉత్తరప్రదేశ్‌లలో మాత్రం గాయపడిన వారి కంటే రోడ్డు ప్రమాదాలవల్లే ఎక్కువ మరణాలు సంభవిస్తాయి. దేశంలో వాహనాల సంఖ్య పెరిగిపోతుండటంతో ప్రమాదాలు, మరణాలు పెరుగుతున్నాయి. ప్రమాదాలకు కారణాలలో అతి వేగం మొదటిది. ఇది మొత్తం రోడ్డు ప్రమాద మరణాలలో 58.6 శాతం(1,01,841) ప్రాణాలను బలిగొంది. ప్రమా



దకరమైన లేదా అజాగ్రత్తతో కూడిన డ్రైవింగ్ లేదా ఓవర్ టేకింగ్ కారణంగా 23.6 శాతం(41,035) మరణాలు సంభవించాయి. ఇవి కాకుండా, మద్యం లేదా మాదకద్రవ్యాలు సేవించి వాహనం నడపడం, రాంగ్‌రూట్ డ్రైవింగ్, మొబైల్ ఫోన్ వాడకం, సిగ్నల్ జంపింగ్ వంటివి కూడా ప్రాణాంతక కారణాలుగా ఉన్నాయి. మరోవైపు, వ్యక్తిగత నిర్లక్ష్యం వల్ల సంభవించే ప్రమాదాలకు ప్రధాన కారణాలలో హెల్మెట్ ధరించకపోవడం, సీటు బెల్టు పెట్టుకోక పోవడం, మైనర్లు డ్రైవింగ్ చేయడం వంటివి ఉన్నాయి. మౌలిక సదుపాయాల లోపాలు కూడా ప్రమాదాలకు ప్రధాన కారణాలు. నాణ్యత లేని రహదారి నిర్మాణం లేదా గుంతలు, గతుకులతోకూడిన రోడ్లు వీటిలో ముఖ్యమైనవి. ఇవి కాకుండా పాదచారుల నిర్లక్ష్యం, వాహనాలలో పరి మితికి మించి ప్రయాణికులను ఎక్కించడం, రోడ్డు నిర్మాణంలో లోపాలు, నిద్ర లేకుండా సుదీర్ఘంగా వాహనాలను నడపడం, కాలం చెల్లిన భద్రతా ప్రమాణాలు లేని వాహనాల్లో ప్రయాణం చేయడం వంటివి ఇతర లోపాలు. అలాగే, ట్రాఫిక్ చిహ్నాలపై అవగాహన లేకపోవడం, వయ స్సు మళ్లిన డ్రైవర్లు, నో పార్కింగ్ జోన్లలో వాహనాలు నిలపడం, స్పీడ్‌బ్రేకర్లపై తెలుపుచారలు గుర్తించకపోవ డం, మలుపుల దగ్గర సైన్‌బోర్డులు ఏర్పాటు చేయకపోవ డం వంటి నిర్వహణ లోపాలు కూడా ప్రమాదాలకు కారణ మవుతున్నాయి. రోడ్డు ప్రమాదాలు కేవలం ప్రాణనష్టాన్ని మాత్రమేకాక, దేశ ఆర్థికవ్యవస్థపై కూడా తీవ్ర ప్రభావం చూపుతాయి. కుటుంబ యజమాని మృత్యువాత పడితే, ఆ కుటుంబాలు తీవ్ర ఆర్థికఇబ్బందులను ఎదుర్కొంటాయి. నైపుణ్యంగలవారు చనిపోతే, వారి సేవలు లభించక దేశ స్థూల జాతీయోత్పత్తిపై ప్రభావం పడుతుంది. సరుకులతో వెళ్తున్నవాహనాలు ప్రమాదానికి గురైతే, యాజమానులు ఆర్థికంగా నష్టపోతారు. వాహనాలు ధ్వంసమై ఉపయోగం కోల్పోతాయి. బీమా సంస్థలకు కూడా భారీగా నష్టం వాటిల్లుతుంది. ప్రమాదాలను నియంత్రించడానికి వ్యక్తులు, అధికారులు, ప్రభుత్వాలు సమన్వయంతో కృషిచేయాలి. వ్యక్తిగతంగా, వాహనదారులు అతివేగంగా వాహనాలునడపరాదు. బ్లూటూత్ మొబైల్ ఫోన్‌వాడుతూ డ్రైవింగ్ చేయరాదు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్టుధరించాలి. ఒకే విడతలో ఎక్కువ గంటలు ట్రక్కులు నడపకుండా, తగిన విశ్రాంతి తీసుకోవాలి. జన సమూహం ఎక్కువగా ఉన్నచోట, పాఠశాలల వద్ద నిదానంగా వెళ్లాలి. ఎన్‌ఫోర్స్‌మెంట్ పరంగా చూస్తే రహదారుల వెంబడి మరిన్ని స్పీడ్ గన్స్ ఏర్పాటు చేసి, డ్రంక్ అండ్‌డ్రైవ్ తనిఖీలను ముమ్మరం చేయాలి. మౌలిక సదుపాయాలలోభాగంగా స్పీడ్‌బ్రేకర్స్ మీద రేడియం రంగు (తెలుపు చారలు)వేయాలి. అలాగే మలుపుల దగ్గర, ప్రమాదాలు జరగడానికి అవకాశం ఉన్నప్రదేశాల్లో సైన్ బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటుచేయాలి. అంతేకాకుండా మైనర్లకువాహనాలు ఇవ్వరాదని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి. మైనర్లు పట్టుబడితే వారిపైనే కాకుండా, ఆ బండి యాజమానులపైనా జరిమానా, లైసెన్సు రద్దు వంటి కఠిన చర్యలు తీసుకోవాలి. లైసెన్స్ విధానాన్ని కఠినతరం చేయాలి. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపేవారిపై జరిమానాతో పాటుగా, 5 సంవత్సరాల వరకు కొత్తగా లైసెన్సులు జారీ చేయకూడదు. ఈ చర్యలు కేవలంఅధికారులు, ప్రభుత్వాలు మాత్రమేచేపట్టలేవు. రోడ్డు భద్రత అనేది ప్రతి పౌరుడి బాధ్యత. ●

# ప్రజావాక్కు



## ప్రమాదకర వ్యసనం మద్యం

**మద్యపానం** అనేది కేవలం వ్యక్తిగత అలవాటు కాదు కుటుంబాలను, సమాజాన్ని నాశనంచేసే ప్రమాదకర వ్యసనం. మద్యం వల్ల కలిగే అనర్థాలను దృష్టిలో ఉంచుకుని పలురాష్ట్రాలు నిషేధాన్నిఅమలు చేయడానికి ప్రయత్నించినప్పటికీ, ఆచరణలో సవాళ్లు ఎక్కువగా ఎదురవుతున్నాయి. మద్యం ఆరోగ్యాన్నీ, ఆర్థిక స్థితినీ, మానవ సంబంధాలనూ దెబ్బతీస్తుంది. మద్యానికి బానిసైన వ్యక్తి కుటుంబంలో గృహహింస, ఆర్థిక సంక్షోభం, పిల్లల విద్యా హాని వంటి సమస్యలకు కారణమవుతాడు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేప్రకారం, భారతదేశంలో 25శాతం మహిళలు భర్తల మద్యపాన హింసకు గురవుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ వివరాల ప్రకారం, ఆల్కహాల్ 200కుపైగా వ్యాధులకు కారణమవుతోంది.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

## కీర్తి కందూతి

**మణిపూర్‌లో** హింసచెలరేగి ఆ రాష్ట్రం అతలాకుతలమైంది. రెండుతెగల మధ్యజరిగిన గొడవల్లో ఆస్తులు దగ్ధమయ్యాయి. ఎన్నో అమాయక ప్రాణాలు అనంత వాయువుల్లో కలసిపోయాయి. గిరిజన మహిళలు అవమానపాలయ్యారు. కొన్ని నెలలపాటు ఇలాంటి దారుణ ఘటనలు ఆ రాష్ట్రంలో యధేచ్ఛగా జరిగాయి. అయినా మోడీమణిపూర్ వైపు కన్నెత్తి చూడలేదు. అక్కడ జరుగుతున్న హింసను ఖండించలేదు. బాధిత కుటుంబాలను పరామర్శించటం, ఓదార్పు వంటివి చేయలేదు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఆ రాష్ట్ర ప్రజలకు ఎలాంటి సహాయం అందించలేదు. అసలు మణిపూర్ అనే ఒక రాష్ట్రం దేశంలో లేనట్లు అక్కడంతా ప్రశాంత వాతావరణం ఉన్నట్టు ప్రవర్తించారు. మణిపూర్ ప్రజలు సర్వం కోల్పోయి వారు అనాథలుగా మారాక మణిపూర్ గుర్తొచ్చింది.

- మిథునం, హైదరాబాద్

## వైద్యసౌకర్యాలు కల్పించాలి

**మనరాష్ట్రంలో** ఇటీవలజరిగిన ప్రసూతిమరణంపై మంత్రివర్గం స్పందన, అధికారులను అప్రమతం చేసి ,ప్రసవ మరణాలు నివారణకు సత్వర వైద్యం అందించేందుకు కావాల్సిన కృషినిపెంచాలని ఆదేశించారు. ప్రసవం వరకు గర్భిణీ స్త్రీలకు నెలవారీ పరీక్షలు, మందులు ,పౌష్టికాహారంతప్పనిసరి. ఆక్రమంలో వారి ఆరోగ్యం బాగుంటుంది.

- బొల్లోజు మేఘానథం, విశాఖపట్నం

## గోతులమయంగా రహదారులు

**అధ్వానంగా** మారిన రహదారి హనుమకొండ జిల్లా గోపాల్పూర్ చౌరస్తా నుండి గోపాల్పూర్ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జంక్షన్ వరకు ఉన్న కిలోమీటన్నర ఉన్న రహదారి అద్వానంగా మారి వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు గోపాల్పూర్ ప్రాంతం దినదినంగా ఎంతో అభివృద్ధి చెందుతుంది గోపాల్పూర్ నుంచి జవహర్ కాలనీకి భీమారం కి కోమటిపల్లికి నిత్యం వేలాది వాహనాలు వెళుతుంటాయి వివిధ పనుల నిమిత్తం ఉద్యోగ ఉపాధ్యాయులు వ్యాపారులు జవహర్ కాలని గోపాల్పూర్ భీమారము ప్రాంతంలోని వివిధ కాలనీ లలో ఉంటారు వివిధ పనుల నిమిత్తం హనుమకొండ చౌరస్తాకు బస్టాండ్ కరీంనగర్ భూపాల్ పల్లి జనగాం వెళ్లే ఈ రహదారి గోతుల మయంగా మారింది.

-కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

## ఇంకెన్నాళ్లు ఈ ప్రచారం

**శారీరక** దృఢత్వం, ధైర్యం, శౌర్య ప్రతాపాలు, త్యాగగుణం గల వారు సైనికులు. వారు దేశానికి రక్షణగా నిలుస్తారు. దేశానికి సేవచేస్తారు. రాజులు, మహారాజులు చక్రవర్తులు పాలించే కాలంలోను సైనికులు ఇరుగు పొరుగు రాజ్యాలతో యుద్ధాలు చేయవలసి వస్తే ప్రాణాలు లెక్క చేయక శత్రు సైన్యాలతో పోరాడేవారు. తమ శౌర్య ప్రతాపాలతో రాజ్యాన్ని కాపాడేవారు. ఈ ప్రయత్నంలో కొందరు వీర మరణం చెందేవారు. నాటి రాజులు, మహారాజులు చక్రవర్తులు కాలంలోనైనా ప్రధాన మంత్రులు, మంత్రులు పాలనచేస్తున్న ఈ రోజుల్లోనైనా సైనికులు చేసే పనిఅదే. ఆపరేషన్ సింధూర్‌లో కూడా భారతదేశానికి చెందిన త్రివిధదళాలు ఏమిాఆశించకుండా తమడ్యూటీ తాము చేశాయి.

-ఎమ్.ఎస్.శర్మ, హైదరాబాద్

## తెలంగాణ రైజింగ్

**రైజింగ్** తెలంగాణలో ఏమి ఉండాలి అని సర్వే చేస్తున్నారు. మంచిదే చేయాల్సిందే. దానికి అనుగుణంగా పాలసీ రూపకల్పన జరుగవలసిందే. ఇందులో ఏమీ సమస్య లేదు. అయితే రైజింగ్ అంటే ఏమిటి వెలిగిపోతోంది అనే కదా అర్థం. వ్యవసాయ ఆధారితం అయిన రంగంలో వెలిగి పోవాలి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలంగా తయారు కావడానికి కావాల్సిన విధాన నిర్ణయాలుజరగాలి. వ్యవసాయ ఆర్థికనమూనా అమలు కావాలి. ప్రాథమిక రంగం బలంగా ఉంటేనే ఆ రాష్ట్రం ఆర్థిక వ్యవస్థ బలంగా ఉంటుంది. మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

-భారత అవినాష్, జనగాం

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

## రష్యాపై ఆంక్షల ఎఫెక్ట్..

# భారీగా పెరిగిన సూపర్ ట్యాంకర్ల ఛార్జీలు



**మాస్కో, అక్టోబరు 24:** రష్యా ప్రధాన చమురు సంస్థలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. దీంతో ముడిచమురు కొనుగోలుదారులు ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టారు. ఈ క్రమంలో చమురు రవాణా చేసే సూపర్ ట్యాంకర్ల ఛార్జీలు అమాంతం పెరగడం గమనార్హం. మధ్య ప్రాచ్యం-చైనా మార్గంలో ఈ ట్యాంకర్ల ఛార్జీలు ఒక్కరోజే 16 శాతం పెరిగినట్లు తెలుస్తోంది. పుతిన్ అనుచితంగా చేస్తున్న యుద్ధానికి ప్రతిగా రష్యాలోని అతిపెద్ద చమురు కంపెనీలు రాస్‌నెఫ్ట్, లుకాయిల్‌లపై ఆంక్షలను విధిస్తున్నట్లు అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ బుధవారం ప్రకటించారు. దీంతో ఈ సంస్థల నుంచి ప్రధానంగా చమురు కొనుగోళ్లు జరుపుతోన్న భారత, చైనీస్ రిఫైనరీలు అప్రమత్తమయ్యాయి. రష్యా చమురు కొనుగోళ్లు తగ్గించుకోవాలని ఈ కంపెనీలు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో డిమాండ్‌కు అనుగుణంగా చమురు దిగుమతి కోసం మధ్యప్రాచ్యం వైపు చూస్తున్నట్లు సమాచారం. ఈ పరిణామాలతో మధ్యప్రాచ్యం-చైనా మార్గంలో త్వరలో ముగియనున్న ఫ్రీట్ అగ్రిమెంట్లకు సంబంధించి సూపర్ ట్యాంకర్ల ఛార్జీలు గురువారం 16 శాతం పెరిగినట్లు బాల్టిక్ ఎక్స్ఛేంజీ డేటా వెల్లడించింది. ట్యాంకర్ల ఛార్జీలు ఈ స్థాయిలోకి రావడం 2023 తర్వాత మళ్లీ ఇప్పుడే కావడం గమనార్హం. డిసెంబరు కాంట్రాక్టులకు సంబంధించిన ఛార్జీలు కూడా దాదాపు 13 శాతం పెరిగినట్లు తెలుస్తోంది. రష్యా కంపెనీలు, వాటికి అనుబంధంగా పనిచేసే డజన్ల కొద్దీ కంపెనీలపైనా ఆంక్షలు అమలవుతాయని అమెరికా స్పష్టం చేసింది. అటు ఇయు కూడా ఆర్థిక ఆంక్షలు విధించింది. ఇవన్నీ నవంబరు 21వ తేదీ నుంచి అమలులోకి వచ్చే అవకాశముంది. అంతర్జాతీయ ఇంధన ఏజెన్సీ డేటా ప్రకారం.. రష్యా ఆగస్టులో ప్రతి రోజు 7.3 మిలియన్ బ్యారెళ్ల ఇంధనాన్ని ఎగుమతి చేసింది. ప్రపంచ ముడిచమురు, రిఫైన్డ్ ఇంధన వినియోగంలో ఇది దాదాపు 7 శాతానికి సమానం కావడం గమనార్హం.

# పాకిస్థాన్‌పై తాలిబన్ల వాటర్‌వార్!

## కాబూల్ నదిపై భారీ డ్యామ్ నిర్మాణానికి ప్రణాళికలు



**కాబూల్, అక్టోబరు 24:** భారత్‌తో జల వివాదాలతో ఇప్పటికే సతమతమవుతున్న పొరుగు దేశం పాకిస్థాన్‌కు తాలిబన్ల పాలనలోని ఆఫ్ఘనిస్థాన్ గట్టి షాక్ ఇచ్చింది. పాకిస్థాన్‌కు ప్రవహించే కీలకమైన కునార్ నదిపై భారీ డ్యామ్‌ను నిర్మించి, నీటి ప్రవాహాన్ని నియంత్రించాలని నిర్ణయించింది. ఈ మేరకు డ్యామ్ నిర్మాణ పనులను వీలైనంత వేగంగా ప్రారంభించాలని తాలిబన్ సుప్రీం లీడర్ మోల్వీ హిబతుల్లా అఖుంద్జాదా జల, ఇంధన మంత్రిత్వ శాఖను ఆదేశించారు. ఇరు దేశాల మధ్య ఇటీవలే జరిగిన భీకర సరిహద్దు ఘర్షణల్లో వందలాది మంది మరణించిన కొన్ని వారాలకే అ ఫ్గానిస్థాన్ ఈ సంచలన నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఆఫ్ఘన్ జల, ఇంధన మంత్రిత్వ శాఖ ఈ ప్రాజెక్టును ధ్రువీకరించింది. విదేశీ సంస్థల కోసం ఎదురుచూడకుండా, దేశీయ కంపెనీలతోనే ఒప్పందాలు కుదుర్చుకోవాలని సుప్రీం లీడర్ స్పష్టమైన ఆదేశాలిచ్చినట్లు సమాచార శాఖ ఉప మంత్రి ముహాజెర్ ఫరాహీ ఎక్స్ వేదికగా తెలిపారు. భారత్ తర్వాత, ఇప్పుడు పాకిస్థాన్‌కు నీటి సరఫరాను పరిమితం చేసే వంతు ఆఫ్ఘనిస్థాన్‌కు వచ్చినట్లుందని లండన్‌కు చెందిన ఆఫ్ఘన్ జర్నలిస్ట్ సామి యూసఫ్‌జాయ్ వ్యాఖ్యానించారు. ఆఫ్ఘనిస్థాన్‌లోని హిందూకుష్ పర్వతాల్లో పుట్టే 480 కిలోమీటర్ల పొడవైన కునార్ నది, పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోకి ప్రవేశించి కాబూల్ నదిలో కలుస్తుంది. పాకిస్థాన్‌లో దీనిని చిత్రాల్ నది అని పిలుస్తారు. కాబూల్ నది ఆఫ్ఘన్‌పాక్ మధ్య ప్రవహించే అతిపెద్ద నది. ఇది చివరకు అటోక్ వద్ద సింధు నదిలో కలుస్తుంది. కునార్ నదిపై డ్యామ్ నిర్మిస్తే, దాని ప్రభావం కాబూల్ నదిపై, ఆ తర్వాత సింధు నదిపై పడుతుంది. దీంతో పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వాతో పాటు పంజాబ్ ప్రావిన్స్‌లో కూడా సాగునీరు, తాగునీటి అవసరాలకు తీవ్ర సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉంది. భారత్‌తో స్నేహం.. పాక్‌తో కయ్యం2021లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తాలిబన్లు "జల సార్వభౌమత్వం"పై ప్రత్యేక దృష్టి సారించారు. ఇంధన ఉత్పత్తి, సాగునీటి కోసం పొరుగు దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడమే లక్ష్యంగా డ్యామ్‌ల నిర్మాణాన్ని వేగవంతం చేశారు. మరోవైపు, ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ మధ్య నీటి పంపకాలపై ఎలాంటి అధికారిక ఒప్పందం లేదు. ఆఫ్ఘన్ ఏకపక్ష నిర్ణయాలు ప్రాంతీయంగా తీవ్ర నీటి సంక్షోభానికి దారితీయవచ్చని పాకిస్థాన్ గతంలోనే ఆందోళన వ్యక్తం చేసింది. వారం రోజుల క్రితమే ఆఫ్ఘన్ విదేశాంగ మంత్రి మోల్వీ ఆమిర్ ఖాన్ ముత్తాఖీ భారత్‌లో పర్యటించి, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య జలవిద్యుత్ ప్రాజెక్టులు, డ్యామ్‌ల నిర్మాణంపై సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయించారు.

# మోహన్‌లాల్‌కు కేరళ హైకోర్టు షాక్!



**తిరువనంతపురం, అక్టోబరు 24:** మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్‌కు, కేరళ ప్రభుత్వానికి హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆయన వద్ద ఉన్న ఏనుగు దంతాల సేకరణను చట్టబద్ధం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను శుక్రవారం కేరళ హైకోర్టు కొట్టివేసింది. దీంతో పాటు మోహన్‌లాల్‌కు జారీ చేసిన లైసెన్స్‌ను కూడా న్యాయస్థానం రద్దు చేసింది. చట్టపరమైన నిబంధనలను అనుసరించి ఈ వ్యవహారంపై కొత్తగా నోటిఫికేషన్ జారీ చేయాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. 2015లో ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల్లో విధానపరమైన లోపాలు ఉన్నాయని, దానిని అధికారిక గెజిట్‌లో ప్రచురించలేదని, అందువల్ల అది చెల్లదని కోర్టు స్పష్టం చేసింది. వన్యప్రాణుల సంరక్షణ చట్టాలకు సంబంధించిన విషయాల్లో ప్రభుత్వాలు నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని వ్యాఖ్యానించింది. కాగా, ఈ తీర్పుపై మోహన్‌లాల్ తరఫు న్యాయవాది స్పందిస్తూ, ఇది కేవలం "సాంకేతిక సమస్య" మాత్రమేనని పేర్కొన్నారు. 2011 డిసెంబర్ 21న కొచ్చిలోని తేవరలో ఉన్న మోహన్‌లాల్ నివాసంలో ఆదాయపు పన్ను శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. ఆ సమయంలో ఆయన ఇంట్లో రెండు జతల ఏనుగు దంతాలను కనుగొన్నారు. దీంతో చట్టవిరుద్ధంగా ఏనుగు దంతాలను కలిగి ఉన్నారన్న ఆరోపణలపై అటవీ శాఖ ఆయనపై కేసు నమోదు చేసింది.

# 'మూన్‌లైటింగ్'తో భారత సంతతి వ్యక్తి అరెస్టు!

**న్యూయార్క్, అక్టోబరు 24:** అమెరికాలో భారత సంతతికి చెందిన ఓ వ్యక్తి భారీ మోసానికి పాల్పడ్డాడన్న ఆరోపణలపై అరెస్టయ్యాడు. ఒకే సమయంలో రెండు పూర్తిస్థాయి ఉద్యోగాలు చేస్తూ (మూన్ లైటింగ్) ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశాడన్న అభియోగాలపై పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ నేరం రుజువైతే అతనికి 15 ఏళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది. న్యూయార్క్‌లోని సరటోగా కౌంటీలో నివసిస్తున్న 39 ఏళ్ల మేహుల్ గోస్వామిని స్థానిక షెరీఫ్ కార్యాలయం అరెస్ట్ చేసింది. అతను న్యూయార్క్ స్టేట్ ఆఫీస్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సర్వీసెస్‌లో రిమోట్ ఉద్యోగిగా పనిచేస్తూనే, మాల్టాలోని మరో సంస్థలో కూడా పూర్తిస్థాయి ఉద్యోగం చేస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. ఈ విధంగా అతను ప్రభుత్వానికి 50,000 డాలర్లకు (సుమారు రూ. 44 లక్షలు) పైగా నష్టం కలిగించాడని అధికారులు ఆరోపిస్తున్నారు. అతనిపై సెకండ్ డిగ్రీ గ్రాండ్ లార్సెనీ కింద కేసు నమోదు చేశారు.



# ఎన్డీయే రికార్డు బ్రేక్ విజయం పక్కా

- ఆర్‌జెడి పాలనలో శాంతిభద్రతలు కరవు - ఆ కూటమి ముఖ్యనేతలంతా బెయిల్‌పై వచ్చిన వ్యక్తులే - త్వరలోనే మావోయిజం నుంచి భారత్‌కు విముక్తి - యువతకు కొత్త ఉపాధి అవకాశాలు సృష్టించాం - బీహార్ ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోడీ - సమస్తిపూర్‌లో కర్పూరీ ఠాకూర్‌కు ప్రధాని నివాళి

**పాట్నా, అక్టోబరు 24:** ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నాయకత్వంలో ఎన్‌డిఏ కూటమి విజయం బీహార్‌లో అన్ని ఎన్నికల రికార్డ్‌ను బ్రేక్ చేస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ధీమా వ్యక్తం చేశారు. అదే సమయంలో ప్రతిపక్ష ఇండియా కూటమికి బెయిల్ పై బయటకు వచ్చిన వ్యక్తులు నాయకత్వం వహిస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగ పుస్తకాన్ని చేతుల్లో పట్టుకొని తిరుగుతున్న నేతలే దేశ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. విపక్ష ఆర్‌జెడిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో ఆర్‌జెడి పాలనలో శాంతి భద్రతలు అదుపుతప్పాయని, దోపిడీ, కిడ్నాప్, హత్యలు వంటివి విపరీతంగా జరిగాయని విమర్శించారు. ఇది రాష్ట్రంలోని తరాలను నాశనం చేసిందని వ్యాఖ్యానించారు. ఆర్‌జెడి, కాంగ్రెస్ పార్టీలు తమ కుటుంబాల రాజకీయ భవిష్యత్తు గురించి మాత్రమే ఆలోచిస్తాయని అన్నారు. వేల కోట్ల స్కామ్‌లు చేసి బెయిల్‌పై బయట తిరుగుతున్న ఆర్‌జెడి, కాంగ్రెస్ నేతలు కూడా భారతరత్న కర్పూరీ ఠాకూర్ లాంటి మహనీయుడి బిరుదును పొందాలని తాపత్రయ పడుతున్నారని మోడీ విమర్శించారు. శుక్రవారం బీహార్‌లోని సమస్తీపూర్‌లోని జరిగిన ఎన్‌డీఏ కూటమి ప్రచార ర్యాలీలో ప్రధాని మోడీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా బహిరంగ సభకు హాజరైన ప్రజలను వారివారి ఫోన్లలోని టార్చ్ లైట్లను ఆన్ చేయమని ప్రధానమంత్రి కోరారు. దీంతో అందరూ ఫోన్లలోని టార్చ్ లైట్లను ఆన్ చేసి చూపించారు. ప్రజలందరి చేతుల్లోకి ఆధునిక గాడ్జెట్లు వచ్చినందున, ఇక లాంతర్లు అక్కర్లేదని మోడీ వ్యాఖ్యానించారు. తద్వారా ఆర్‌జెడి పార్టీ లాంతరు గుర్తుపై సెటైర్స్ వేశారు. '2005 అక్టోబరులో జంగిల్ రాజ్ నుంచి బీహార్‌కు విముక్తి లభించింది. నితీశ్ కుమార్ సారథ్యంలో రాష్ట్రంలో ఎన్‌డిఏ సర్కారు ఏర్పాటైంది. ఆ సమయానికి కేంద్రంలో కాంగ్రెస్- ఆర్‌జెడి కూటమి పాలన ఉండేది. నాటి కేంద్ర ప్రభుత్వం నితీశ్ కుమార్ మార్గంలో చాలా అడ్డంకులను క్రియేట్ చేసింది. అయినప్పటికీ బలమైన సంకల్పంతో నితీశ్ ముందుకు సాగారు. బీహారీలకు సుపరిపాలన అందించారు. నితీశ్ కుమార్‌కు అనుకూలంగా ఓట్లు వేశారనే అక్కసుతో, నాటి కేంద్ర సర్కారులో ఉన్న ఆర్‌జెడి పార్టీ బీహారీలపై ప్రతీకారాన్ని తీర్చుకుంది" అని ప్రధాని మోడీ మండిపడ్డారు. అలాగే వారి పాలనలో నక్సలిజం, ఉగ్రవాదం కూడా పెరిగిపోయిందని ఆరోపించారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత నక్సలిజాన్ని విచ్ఛిన్నం చేశామని, త్వరలో దేశం మొత్తం మవోయిస్టు, ఉగ్రవాదం నుంచి విముక్తి పొందుతుందని హామీ ఇచ్చారు. 2014లో తాము అధికారంలోకి వచ్చాక మావోయిజం వెన్ను విరిచాం. త్వరలోనే మావోయిజం నుంచి భారత్‌కు విముక్తి లభిస్తుంది. ఇది మోడీ ఇస్తున్న గ్యారంటీ అని ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. "పేదలు, దళితులు, మహా దళితులు, బిసిలు, ఇబిసిలకు మేం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం. జనరల్ కేటగిరీలోని పేదలకూ 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలనే కీలకమైన నిర్ణయాన్ని మా ప్రభుత్వమే తీసుకుంది. మరో పదేళ్ల పాటు ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్లను పొడిగించింది కూడా మా ప్రభుత్వమే. పేదల కోసం దేశంలో మేం కొత్త ఉపాధి అవకాశాలను క్రియేట్ చేశాం" అని ప్రధాని మోడీ వివరించారు. ఇండియా కూటమితో పొత్తు పెట్టుకోవడం తాను చేసిన అతి పెద్ద పొరపాటని, ఆలస్యంగా ఆ తప్పును గ్రహించానని బీహార్ సిఎం నితీశ్ కుమార్ అన్నారు. సమస్తిపూర్ ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోడీతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నితీశ్ ఆర్‌జెడిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆర్‌జెడి ప్రభుత్వం తమ హయాంలో ముఖ్యంగా లాలూ, రబ్రీదేవి పాలనలో బీహార్ ప్రజల అభివృద్ధి కోసం ఏమీ చేయలేదని విమర్శించారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అందిస్తున్న ఉదార సహాయంతో బీహార్ పురోగతి సాధిస్తోందని నితీశ్ ఉద్ఘాటించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఎన్‌డిఏకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.




# తమిళనాడులోనూ 'సర్' నిర్వహిస్తాం!

## వారంలో ప్రారంభిస్తామని హైకోర్టుకు నివేదన

**చెన్నై, అక్టోబరు 24:** బీహార్‌లో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ రాజకీయంగా తీవ్ర దుమారం రేగిన విషయం తెలిసిందే. దీనిపై ప్రతిపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. 'సర్'కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాయి. ఎస్ఐఆర్ పేరుతో బీహార్‌లో పెద్ద ఎత్తున ఎన్నికల రిగ్గింగ్ జరుగుతోందని ఆరోపించాయి. అయితే, ప్రతిపక్షాల ఆరోపణలను ఈసీ ఖండించింది. అక్రమ వలసదారులను తొల గించడంతో పాటు ఓటరు జాబితాల సమగ్రతను కాపాడడమే సర్ లక్ష్యమని ఈసీ పేర్కొంటున్నది.

# మైనార్టీ తీరిన తర్వాత ఆస్తి విక్రయాలు తిరస్కరించే హక్కులుంటాయ్!

## సుప్రీం కోర్టు సంచలన తీర్పు



**న్యూఢిల్లీ, అక్టోబరు 24:** భారత దేశంలో ఆస్తి హక్కులకు సంబంధించి సుప్రీంకోర్టు ఒక సంచలనాత్మక తీర్పును వెలువరించింది. మైనర్లుగా ఉన్నప్పుడు వారి పేరు మీద ఉన్న ఆస్తులను తల్లిదండ్రులు లేదా సంరక్షకులు అమ్మినా లేదా ఎవరి పేరుమీదకైనా బదిలీ చేసినా ఆ మైనర్లు తమకు 18 ఏళ్లు నిండిన తర్వాత ఆ లావాదేవీలను ఎటువంటి ముందస్తు దావా లేకుండానే కోర్టులో సవాలు చేయవచ్చని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. తమకు తెలియకుండా జరిగిన ఆస్తి లావాదేవీల విషయంలో మేజర్లుగా మారిన మైనర్లు ఆ ఆస్తులపై స్పష్టమైన చర్యలు తీసుకోవచ్చని సుప్రీం కోర్టు పేర్కొంది. వారు గతంలో జరిగిన లావాదేవీలను రద్దు కూడా చేయవచ్చని చెప్పింది. లేదా తిరిగి తమ పేరు మీదకు బదిలీ చేయించుకోవచ్చు అని తీర్పులో వివరించింది. ఈ మేరకు కర్ణాటకకు చెందిన కేఎస్ శివప్ప వర్సెస్ కే నీలమ్మ కేసులో విచారణ జరిపిన జస్టిస్ మిత్తల్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ కీలకమైన తీర్పును వెలువరించింది. కర్ణాటకలోని శామనూరు గ్రామానికి చెందిన రుద్రప్ప 1971లో తన ముగ్గురు మైనర్ కుమారులు అయిన మహా రుద్రప్ప, బసవరాజ్, మంగేశప్ప పేర్లమీద కొంత ఆస్తి (ప్లాట్‌లు) కొనుగోలు చేశారు. అయితే కోర్టు అనుమతి లేకుండానే రుద్రప్ప తన మైనర్ కుమారుల పేరు మీద ఉన్న ఆ ప్లాట్‌లను ఇతరులకు విక్రయించారు. అయితే రుద్రప్ప కుమారులు పెద్దవారైన తర్వాత (18 ఏళ్లు దాటాకా) వారు ఆ ప్లాట్‌లను శివప్పకు విక్ర యించారు. అంతకుముందే తండ్రి రుద్రప్ప వద్ద ఆ ప్లాట్‌లను కొనుగోలు చేసిన వ్యక్తులు ఆ ఆస్తి తమకే చెందుతుందని పేర్కొనడంతో వివాదం మొదలైంది. ఈ వివాదం కింది కోర్టుల్లో నడిచినప్పుడు తండ్రి జరిపిన పాత విక్రయాలను రద్దు చేయడానికి కుమారులు ముందుగా కోర్టులో దావా వేయాలని తీర్పు ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే ఈ కేసు సుప్రీం కోర్టు ముందుకు వచ్చింది. విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం క్రింది కోర్టుల తీర్పుకు విరుద్ధంగా తీర్పు ఇచ్చింది. ఈ కేసులో రుద్రప్ప కుమారులు ప్రత్యేకంగా దావా వేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. మైనర్లుగా ఉన్నప్పుడు వారి సంరక్షకులు జరిపిన అమ్మకాన్ని వారు మేజర్లుగా మారిన తరువాత నేరుగా తిరస్కరించవచ్చని పేర్కొంది.

# 112 ఔషధ నమూనాల్లో నాణ్యత లేమి

## సిడిఎస్‌సిఒ విశ్లేషణలో వెల్లడి




**న్యూఢిల్లీ, అక్టోబరు 24:** దేశంలో ఔషధాల నాణ్యత, భద్రతపై సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ( సీడీఎస్‌సీఓ ) చేపట్టిన నెలవారీ సమీక్షలో తీవ్రమైన లోపాలు బయటికి రావడం తీవ్ర ఆందోళనలు రేకెత్తించింది. సెప్టెంబర్ నెలకు సంబంధించిన నాణ్యతా సమీక్షలో దేశంలోని 112 ఔషధ నమూనాలు నాణ్యత ప్రమాణాలకు సరిపోవని తేలగా ఒక దగ్గు సిరప్ నమూనాను ఏకంగా నకిలీది అని గుర్తించడం కలకలం రేపుతోంది. ఇక ఈ జాబితాలో నిత్యం చిన్న చిన్న వాటికి మనం వేసుకునే సాధారణ మందులు కూడా ఉండటంతో జనం తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నోట్ ప్రకారం మొత్తం 112 నమూనాల్లో 52 నమూనాలను కేంద్ర ఔషధ ప్రయోగశాలలు.. మిగిలిన 60 నమూనాలను రాష్ట్ర ఔషధ పరీక్షా ప్రయోగశాలలు గుర్తించాయని తెలుస్తోంది. ఈ జాబితాలో పారాసిటమాల్, పెంటాప్రజోల్, మల్టీవిటమిన్ సప్లిమెంట్లు వంటి అనేక రకాల మందులు ఉండటం గమనార్హం. మరోవైపు ఇటీవల మధ్యప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో చిన్నారుల దగ్గు సిరప్‌ల కారణంగా చాలా మంది అమాయక చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన వేళ తాజాగా ఛత్తీసగఢ్‌లోని రాష్ట్ర ఔషధ పరీక్షా ప్రయోగశాల బెస్ట్ కాఫ్ అనే దగ్గు సిరప్ నమూనాను నకిలీగా సీడీఎస్‌సీఓ గుర్తించింది. ఈఫార్మసీ ప్లాట్‌ఫామ్‌లలో ఈ బెస్ట్ కాఫ్ సిరప్‌ను బెస్టోకెమ్ ఫార్ములేషన్స్ ఇండియా లిమిటెడ్ అనే కంపెనీ తయారు చేసిన ఫెనిలెఫ్రిన్, క్లోర్‌ఫెనిరమైన్ మాలియేట్, డెక్స్ట్రోమెథార్ఫాన్ హైడ్రోబ్రోమైడ్‌ల ఫార్ములేషన్‌గా పేర్కొన్నారు. లేబుల్‌పై ఉన్న దాని ప్రకారం ఈ సిరప్ అసలు తయారీదారు మాత్రం తాము ఆ బ్యాచ్‌ను తయారు చేయలేదని తేల్చి చెప్పడంతో అది నకిలీదని తేలింది. కల్తీ దగ్గుమందుతో ఇప్పటికే పిల్లల మృతి ప్రస్తుతం ఈ నకిలీ మెడిసిన్‌పై దర్యాప్తు జరుగుతున్నప్పటికీ డ్రగ్స్ అండ్ కాస్మొటిక్ చట్టం 1940 ప్రకారం ఒక ఔషధం మరొక ఔషధం పేరుతో తయారు చేయబడి ప్రజలను మోసగించే విధంగా ఉంటే అది నకిలీగా పరిగణిస్తారు. అయితే ఇటీవల మధ్యప్రదేశ్‌లో కోల్డ్‌రిఫ్ అనే దగ్గు సిరప్ కారణంగా 24 మంది పిల్లలు మరణించగా దానికి పక్కనే ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఈ నకిలీ సిరప్ వెలుగు చూడటం సంచలనంగా మారింది. ఇక ఈ కోల్డ్‌రిఫ్ సిరప్‌లో ఔషధ ప్రమాణాల ప్రకారం 0.1 శాతం మాత్రమే ఉండాల్సిన డైథైలీన్ గ్లైకాల్ అనే విషపూరిత ద్రావకం ఏకంగా 48.6 శాతం ఉన్నట్లు కనుగొన్నారు. ఇక ఈ నెలలోనే మరో రెండు దగ్గు సిరప్‌లైన రెస్పిఫ్రెష్ టీఆర్, రీలైఫ్‌లలో కూడా పరిమితికి మించి డైథైలీన్ గ్లైకాల్ ఉన్నట్లు గుర్తించారు. ఈ 3 బ్రాండ్‌ల విషయంలో సీడీఎస్‌సీఓ ఇచ్చిన అధికారిక సమాచారం మేరకు ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా గ్లోబల్ అలర్ట్ జారీ చేసింది.

## సంక్షిప్తంగా..

### భారత్ సరిహద్దు వద్ద చైనా వైమానిక రక్షణ స్థావరం!



**న్యూఢిల్లీ, అక్టోబర్ 24:** భారతదేశ సరిహద్దు దగ్గర కొత్త వైమానిక రక్షణ స్థావరాన్ని చైనా నిర్మిస్తున్నది. 2020లో ఇరుదేశాల సైనికుల మధ్య ఘర్షణ జరిగిన ప్రాంతానికి సుమారు 110 కిలోమీటర్ల దూరంలో ఈ నిర్మాణాలు ఉన్నాయి. శాటిలైట్ చిత్రాల ద్వారా ఈ విషయం నిర్ధారణ అయింది. టిబెట్‌లోని పాంగోంగ్ సరస్సు తూర్పు భాగం ఒడ్డున కొత్తగా వైమానిక రక్షణ స్థావరాన్ని చైనా నిర్మిస్తున్నది. కమాండ్ అండ్ కంట్రోల్ భవనాలు, బ్యారక్‌లు, రక్షణ వాహనాల కోసం షెడ్‌లు, మందుగుండు సామగ్రి నిల్వ ప్రాంతాలు, రాడార్ స్థావరాలతో ఇది కూడి ఉన్నది. కాగా, వైమానిక రక్షణలో భాగంగా ముడుచుకునే పై కప్పులతో బంకర్లను చైనా నిర్మిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చైనాకు చెందిన దీర్ఘశ్రేణి హెచ్‌క్యూ 9 సర్ఫేస్ టు ఎయిర్ క్షిపణి వంటి వ్యవస్థలను దాచడం, వాటికి రక్షణ కల్పించడం కోసం ఈ కాంక్రీట్ షెల్టర్లను చైనా నిర్మించినట్లు నిఘా అధికారులు భావిస్తున్నారు.

### 'ఉగ్రవాద నిరోధక చట్టాలను దుర్వినియోగం చేస్తున్న పాక్'



న్యూఢిల్లీ, అక్టోబర్ 24: ఉగ్రవాద నిరోధక చట్టాలను పాక్ దుర్వినియోగం చేస్తోందని మానవహక్కుల సంస్థ 'ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్' ఆందోళన వ్యక్తం చేసింది. ఈ చట్టాలను బలోచ్ ఉద్యమకారుల అణచివేతకు వాడుతోందని ఆరోపించింది. 1997 ఉగ్రవాద నిరోధక చట్టం కింద బలోచ్‌కు చెందిన 32 మందిని పాక్ తన వాచ్‌లిస్ట్‌లో చేర్చడాన్ని తప్పుబట్టింది. వారిలో ప్రత్యేక దేశం కోసం పోరాడే వారిని కూడా చేర్చిందని ఇది వారి హక్కులను పూర్తిగా కాలరాయడమే అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆమ్నెస్టీ దక్షిణాసియా రీజనల్ డైరెక్టర్ బాబూ రామ్ మాట్లాడుతూ ప్రత్యేక దేశం కోసం శాంతియుతంగా పోరాటం చేస్తున్న బలోచ్ ప్రజలను పాక్ ఉగ్రవాదులుగా చిత్రీకరిస్తోందన్నారు. దీనివల్ల వారి స్వేచ్ఛ, గోప్యత, ఉద్యమానికి సంబంధించిన ప్రాథమిక హక్కులు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు.

### భారత్‌పై స్విస్ వ్యాఖ్యలకు జైశంకర్ సీరియస్ కౌంటర్



**న్యూఢిల్లీ, అక్టోబరు 24:** మైనారిటీల రక్షణ, భావ ప్రకటన, మీడియా స్వేచ్ఛా హక్కులను కాపాడేందుకు భారత్ సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్‌గా ఉన్న స్విట్జర్లాండ్ వ్యాఖ్యానించింది. ఈ వ్యాఖ్యలపై భారత విదేశాంగ మంత్రి జైశంకర్ సీరియస్ కౌంటర్ ఇచ్చారు. ఐక్యరాజ్య సమితి నిర్ణయాలపై ఆయన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. సమితి నిర్ణయాలు ప్రపంచ ప్రాధాన్యతలను ప్రతిబింబించలేవని స్పష్టం చేశారు. ఐక్యరాజ్యసమితి 80వ వార్షికోత్సవం సందర్భంగా పోస్టల్ స్టాంపు విడుదల చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, వివాదాల యుగంలో శాంతి అవశ్యమని జైశంకర్ అన్నారు. ప్రస్తుతం ప్రపంచం క్లిష్ట పరిస్థితుల్లోకి వెళుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలో ఐక్యరాజ్య సమితిలో అంతా సరిగా లేదని అన్నారు.

### చెన్నైలో విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన ఏనుగు



**చెన్నై, అక్టోబర్ 24:** అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఏనుగు ఒకటి చెన్నైలోని కుప్పేయపాళయం సమీపంలోని రామన్ కుట్టైలో ఒక వ్యవసాయ భూమిలోకి ప్రవేశించింది. అక్కడ తోట వద్ద విద్యుత్ బోర్డు ఏర్పాటుచేసిన హై వోల్టేజ్ విద్యుత్ స్తంభాన్ని ఏనుగు ఢీకొట్టింది. అది కొందపడడంతో లైవ్ విద్యుత్ వైరు తెగి పడింది. వైరు తగలడంతో విద్యుదాఘాతంతో ఏనుగు మరణించింది. ఈ ఘటన తమిళనాడులోని కోయంబత్తూర్ జిల్లాలో జరిగింది. సమాచారం తెలుసుకున్న అటవీశాఖ సిబ్బంది, పశువైద్యులు అక్కడకు చేరుకుని చనిపోయిన ఏనుగుకు పోస్టుమార్టం నిర్వహించారు. విద్యుదాఘాతం వల్ల ఏనుగు చనిపోయినట్లు నిర్ధారించారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

# టారిఫ్ యాడ్స్ ప్రభావం.. కెనడాతో వాణిజ్య చర్చలకు ట్రంప్ బ్రేక్

**వాషింగ్టన్, అక్టోబరు 24:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కెనడాతో నడుస్తోన్న వాణిజ్య చర్చలను నిలిపివేశారు. యుఎస్ టారిఫ్‌లను వ్యతిరేకిస్తూ ఆ దేశం ఇచ్చిన ప్రకటనలే అగ్రరాజ్య అధ్యక్షుడి ఆగ్రహానికి కారణమైంది. ఇది దారుణమైన ప్రవర్తన అని సోషల్ మీడియాలో ట్రంప్ పోస్టు పెట్టారు. 'అమెరికా జాతీయ భద్రత, ఆర్థిక వ్యవస్థకు సుంకాలు చాలా ముఖ్యం. వారి దారుణమైన ప్రవర్తన కారణంగా కెనడాతో అన్ని వాణిజ్య చర్చలు రద్దు చేసుకుంటున్నాం' అని తన పోస్ట్‌లో పేర్కొన్నారు. కెనడాలోని ఒంటారియో ప్రావిన్స్ ప్రీమియర్ డగ్‌ఫోర్డ్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ..'ఒంటారియో కొత్త ప్రకటన ప్రచారం ప్రారంభించింది. మాపై అమెరికా సుంకాలకు వ్యతిరేకంగా మా ప్రచారాన్ని కొనసాగిస్తాం. అందుబాటులో ఉన్న ప్రతీ సాధనాన్ని ఉపయోగిస్తాం. కలిసి పనిచేయడమే ఇరు వర్గాల శ్రేయస్సుకు మంచి మార్గం' అని రాసుకొచ్చారు. మరోవైపు, అమెరికాలో సుంకాలతో ముప్పు పొంచి ఉన్నందున ఆ దేశాన్ని దాటి మిగతా దేశాలతో ఎగుమతులు పెంచుకోవాలనుకుంటున్నట్లు కెనడా ప్రధాని మార్క్ కార్నీ వ్యాఖ్యానించారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే ట్రంప్ మండిపడ్డారు. వాణిజ్య చర్చల నిలిపివేతపై ప్రకటన చేశారు. కెనడా నుంచి దిగుమతి చేసుకుంటున్న వస్తువులపై ట్రంప్ ప్రభుత్వం 35 శాతం టారిఫ్‌లు విధించిన సంగతి తెలిసిందే. అంతేగాకుండా రంగాలవారీగా సుంకాలను ప్రకటించారు. అమెరికా-మెక్సికో-కెనడా అగ్రిమెంట్ కింద కవర్ అయిన వస్తువులకు మాత్రం మినహాయింపు ఇచ్చారు. ఈ టారిఫ్‌ల ప్రకటన తర్వాత నుంచి అమెరికా-కెనడాల మధ్య మాటల యుద్ధం నడిచింది. రెండు దేశాల సంబంధాలు ఒత్తిడికి గురయ్యాయి. అయితే కొన్ని రోజుల క్రితం ట్రంప్‌తో కెనడా ప్రధాని మార్క్ కార్నీ భేటీ అయ్యారు.



# గుర్రపునాడ ఆకృతిలో ఎస్ఎల్‌బిసి సొరంగం తవ్వకం

## డక్టైల్ షీర్‌జోన్ ప్రాంతాన్ని తప్పించడానికి కసరత్తు

**హైదరాబాద్, అక్టోబరు 24, ప్రభాతవార్త:** ఎస్ఎల్‌బిసి ప్రమాద ఘటన ప్రాంతంలో సొరంగం నేరుగా తవ్వకుండా పక్కకు గుర్రపునాడ ఆకృతిలో తవ్వి పాత మార్గంలోకి తీసుకొని రావాలనే సాంకేతిక నిపుణుల అభిప్రాయానికి ప్రభుత్వం సమ్మతి తెలిపింది. సొరంగం పునరుద్ధరణకు ప్రభుత్వం జాతీయ స్థాయి నిపుణులతో ఏప్రిల్ కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ సిఫార్సుల మేరకు ప్రభుత్వం సొరంగం తవ్వకం చేసే మార్గంను బైపాస్ చేయడానికి పూనుకొంది. శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగం పనులను అత్యాధునికగా అభివృద్ధి చెందిన సొరంగం తవ్వకం పద్ధతి లో పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం పనులు చేస్తున్న కాంట్రాక్టర్ సంస్థ జైప్రకాశ్ అసోసియేట్‌కు మిగిలిన పనులు పూర్తిచేసే బాధ్యతలను అప్పగించింది. కాంట్రాక్టు సంస్థ ఆర్థిక పరిస్థితి సరిగాలేకపోవడంతో 2028వరకు ఎస్ఎల్‌బిసి నిర్మాణం పూర్తవుతుందా అనే అనుమానం కూడా తలెత్తుతోన్నది. గురువారం జరిగిన మంత్రి మండలి సమావేశంలో ఈ ప్రాజెక్టులో మిగిలిన రూ. 1,157.42 కోట్ల పనుల పూర్తికి ఆమోద ముద్ర వేసింది. సొరంగం పైకప్పు కూలిన తరువాత తిరిగి పనులు చేపట్టేందుకు డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ పద్ధతిని అనుసరించాలని తొలుత భావించారు. ఇప్పుడు అడ్వాన్స్డ్ టన్నెల్ మెథడ్ పద్ధతిలో చేయాలని కేబినెట్‌లో నిర్ణయించారు. ఎస్ఎల్‌బిసి సొరంగం ప్రస్తుతం ఎలాంటి మలుపులు లేకుండా చక్కగా తవ్వుతూ వెళ్లారు. శ్రీ శైలం ఎడమగట్టు దోమలపెంట ఇన్‌లెట్ సొరంగం తొలిచే పనులు షీర్ జోన్‌లో చేస్తుండగా 3 మీటర్ల మేరకు పైకప్పు కుప్పకూలి భారీప్రమాదం ఫిబ్రవరిలో సంభవించింది. సొరంగంలో 14 కి.మి వద్ద మొత్తం 18 మీటర్ల వరకు డక్టైల్ షీర్ జోన్ ఉండటంతో ప్రమాదం జరిగిన ప్రాంతంలో పనులు చేయడం సాధ్యం కాకపోవచ్చని భావిస్తున్నారు. ప్రమాద ఘటన స్థలానికి కొంతవెనుకకు వచ్చి కాలువను బైపాస్ చేయడానికి నిర్ణయం తీసు కొన్నారు. షియర్ జోన్స్ దాటిన తరువాత పాతమార్గా నికి కలుపాల్సి ఉంటుంది. ఎన్‌జిఆర్ఐ సహకారంతో హెలీబోర్న్ మాగ్నెటిక్ జియో ఫిజికల్ సర్వే చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. సొరంగం మొత్తాన్ని అయస్కాంత తరంగాలతో స్కానింగ్ చేసి భూమి పొర లను అధ్యయనం చేయనున్నారు. కేంద్ర విమానయాన శాఖ నుంచి ఈ సర్వేకు అనుమతి రావాల్సి ఉంది. వ్యాపార దివాలా పరిష్కార ప్రక్రియ నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్లో జై ప్రకాశ్ అసోసియేట్ కాంట్రా క్టు సంస్థ ఉన్నందున ఈ సంస్థకు ఎస్ఎల్‌బిసి తదుపరి పనుల అప్పగింతపై రాష్ట్రస్థాయి స్టాండింగ్ కమిటీ పలు అభ్యంతరాలు వ్యక్తం చేసింది.



జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరెడ్డికి ఫిర్యాదు అందిస్తున్న బిఆర్ఎస్ నేతలు.

# రోహిణ్‌రెడ్డి, సుమంత్‌పై చర్యలు తీసుకోవాలి

## పోలీసులకు బిఆర్ఎస్ నేతల ఫిర్యాదు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), అక్టోబరు 24, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి సమీప సహాయకుడైన డాక్టర్ సింగిరెడ్డి రోహిణ్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ తదితరులపై చర్యలు తీసుకోవాలంటూ బీఆర్ఎస్ నేతలు శుక్రవారం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్టోబరు 15న మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండ సుశ్మితపటేల్ చేసిన ఆరోపణలను, మీడియా ముందు చేసిన వ్యాఖ్యానాలను ఆధారంగా చేసుకొని కాంగ్రెస్ నేతలపై అవినీతి, దందా, ఆయుధాలతో బెదరింపుల ఆరోపణలు ఉన్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎస్ఎన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఫిర్యాదులో పేర్కొన్నారు. సుశ్మిత పటేల్ ఆరోపణల ప్రకారం డెక్కన్ సిమెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులను తుపాకీతో బెదిరించి డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నించారని, ఈ సంఘటనలో సింగిరెడ్డి రోహిణ్‌రెడ్డి, సుమంత్ పాత్ర ఉందని అన్నారు. అదే సమయంలో తుపాకీ సీఎం కార్యాలయం నుంచి సరఫరా అయిందనే అనుమానాలను సుశ్మిత వ్యక్తం చేసిందని, రోహిణ్‌రెడ్డి సీఎం నివాసానికి సమీపంలో ఉంటారని వారు ఫిర్యాదులో ఆరోపించారు. రోహిణ్‌రెడ్డి, సుమంత్‌లపై వెంటనే కేసులు నమోదు చేయాలని, సుశ్మితపటేల్, డెక్కన్ సిమెంట్స్ ప్రతినిధుల వాంగూల్మాలు సేకరించాలని, సంబంధిత అధికారుల కాల్‌డాటా, రికార్డులు పరిశీలించి దర్యాప్తు చేయాలని, నిందితులను అదుపులోకి తీసుకోవాలని వారు కోరారు. ఈ సందర్భంగా వారు పలు పత్రికలో, ఛానెళ్లలో ప్రచురితమైన, ప్రసారమైన కథనాలను సంబంధించిన ప్రతులను పోలీసులకు అందజేశారు. బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు స్వీకరించామని, జీడీ(జనరల్ డైరీ)లో నమోదు చేసి న్యాయసలహా అనంతరం కేసు నమోదు అంశాన్ని పరిశీలిస్తామని జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. ఫిర్యాదు అందించిన వారిలో పలువురు బీఆర్ఎస్ నేతలు ఉన్నారు.

# కోటి 54 లక్షల విలువైన ధాన్యం పక్కదారి

## విస్తృతంగా విజిలెన్స్ దాడులు

**హైదరాబాద్, అక్టోబరు 24, ప్రభాతవార్త:** విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం, శుక్రవారం మెరుపుదాడులు జరిపి అక్రమార్కులపై కేసులు నమోదు చేశారు. సిద్దిపేట మండలంలో ఎంఎం ఫుడ్ పారాబాయిల్డ్ రైస్‌పై ఆకస్మిక దాడులు జరిపి అందులో 6,674క్వింటాళ్ళ ధాన్యం గల్లంతైనట్లు గుర్తించారు. 2024-25రబి సీజన్ సిఎంఆర్ ధాన్యం సుమారు కోటి 54 విలువగలది యజమాని పక్కదారి పట్టించినట్లు గుర్తించి కేసు నమోదు చేయాలని స్థానిక అధికారికి సిఫార్సు చేశారు. పటాన్‌చెరు ముత్తంగిలో పది ఎంవిఐ యాక్టు ఉల్లంఘించిన కేసులు గుర్తించారు వారికి 5,18,509 ,జిఎస్‌టి ఉల్లంఘన సంబందించి రెండు కేసులు గుర్తించి 27198 రూపాయలు జరిమానా బ్రిక్ డస్ట్‌కు సంబందించిన 1,82,712 జరిమాన ఆ ఇసుకకు 7,28 510 రూపాలు జరిమాన విధించారు. కరీంనగర్ యూనిట్ 6,50,000 వివిధ కేసులపై జరిమానా విధించింది. అలాగే నల్లగొండ యూనిట్ 2,53,656 రూపాయలు జరిమానా విధించింది.

# కారుణ్య నియామకాలకు వయోపరిమితి 46 యేళ్లకు పెంచాలి

## ఎండికి ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ విజ్ఞప్తి

**హైదరాబాద్, అక్టోబరు 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఆర్‌టిసిలో కారుణ్య నియామకాలకు వయో పరిమితిని 46 సంవత్సరాలకు పెంచాలని టిజిఎస్ ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎంప్లాయీస్ యూనియన్ ఆర్‌టిసి ఎండీకి విజప్తి చేసింది. రాష్ట్ర ప్రభుత్వం గతంలో జీవో నంబర్ 42, జీవో నంబర్ 30 ద్వారా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు వయోపరిమితిని 2022లో 44 ఏండ్లకు పెంచారని, రెండోసారి 2024లో 46 ఏండ్లకు పెంచారాని, ఈ జీవోను అనుసరించి ఆర్‌టిసి నియామకాల్లో కూడా వయోపరిమితిని పెంచి నియామకాలు చేపట్టాలని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబందించి ఆర్‌టిసి యాజమాన్యానికి వినతిపత్రం సమర్పించామని తెలిపారు. ప్రస్తుతం ఆర్‌టిసిలో 40 సంవత్సరాలలోపు వయో పరిమితిపై నియామకాలు చేస్తున్నారని, సర్వీస్‌లో ఉండి చనిపోయిన వారి కుటుంబసభ్యులు కారుణ్య నియమాకాలకు ధరఖాస్తు చేసుకోగా 40 ఏండ్లు దాటిన వారి దరఖాస్తులను ఆర్‌టిసి యాజమాన్యం తిరస్కరించడం వలన వందలాది మంది కుటుంబాలు పోషించే దిక్కులేక రోడ్డున పడ్డాయని, ఆ కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం కారుణ్య నియామకాల అభ్యర్థులకు వయోపరిమితిని పెంచి గతంలో తిరస్కరించిన దరఖాస్తులను ఆమోదించి ఆయా కుటుంబాలకు జీవనోపాధి కల్పించాలని ఈదురు వెంకన్న ఆర్‌టిసి ఎండిని కోరారు.

# రేవంత్ ఇచ్చిన హామీలు అమలుచేస్తే బిఆర్ఎస్‌లో ఒక్కడు మిగలడు

## తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్

**హైదరాబాద్, అక్టోబరు 24, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామిలు అన్ని అమలు చేస్తే బిఆర్ఎస్‌లో ఒక్కడు కూడా మిగలడని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ హెచ్చరించారు. గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడతూ దళిత ఉప ముఖ్యమంత్రిని ఎందుకు తొలగించారో నువ్వు మీ అయ్య తెలుపాలని ఆయన డిమాండ్ చేశారు. నమ్ముకొన్నవాళ్లను నట్టేట ముంచే అలవాటు మీకుంది, మీది బుడబుక్కల పార్టీ, మాది 140 సంవత్సరా కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. జూబ్లీహిల్స్‌లో కంటోన్మెంట్ ఎన్నికల ఫలితాలు రిపీట్ కాబోతుందని ఆయన జోస్యం చెప్పారు. భవిష్యత్‌లో బిఆర్ఎస్ పార్టీ ఉండదని కెటిఆర్‌కు తెలంగాణకు ఏం సంబంధం అని ఆయన కెటిఆర్‌కు సవాల్ వేశారు. కాంగ్రెస్ మంత్రివర్గం దండుపాళ్యం అని కెటిఆర్ అంటుండు మీపార్టీ దొంగల పాళ్యం అని ఆయన ఆరోపించారు. 2023లో మళ్లీ అధికారంలోకి వచ్చి దోచుకోవాలని చూశా రని ప్రజలు ఓడగొట్టి ఇంట్లో కూర్చోబెట్టారని ఎద్దేవా చేశారు.



చిన్నారెడ్డి, దివ్యలను కలిసిన లబ్ధిదారులు

# సిఎం ప్రజావాణి చొరవతో 1,087 మందికి డబుల్‌బెడ్ ఇళ్ల కేటాయింపు

## చిన్నారెడ్డి, దివ్యను సన్మానించిన లబ్ధిదారులు

**హైదరాబాద్ (బేగంపేట), అక్టోబరు 24, ప్రభాతవార్త:** సిఎం ప్రజావాణీ చొరవతో 1087మందికి డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో లబ్దిదారులు సంతోషం వ్యక్తంచేస్తూ శుక్రవారం ప్రజాభవన్ లో జరిగిన సీఎం ప్రజావాణీకి తరలి వచ్చారు. సీఎం ప్రజావాణీ ఇంచార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ లను లబ్దిదారులు శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలియజేసారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు లబ్దిదారులకు డబుల్ బెడ్ రూంలు కేటాయింపు జరిగిందని చిన్నారెడ్డి, దివ్య తెలిపారు. ఈ ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదే అని వారు పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలో డబుల్‌బెడ్ ఇళ్లలను ప్రస్తుత లబ్దిదారులకు కేటాయించగా స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేయడం, కోర్టు ఆదేశాల మేరకు ప్రత్యామ్నాయంగా హైదరాబాద్ నగర శివారులో పలు ప్రాంతాల్లో కొత్తగా డబుల్ బెడ్ ఇళ్ల ను కేటాయిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

### సిఎం ప్రజావాణిలో 229 దరఖాస్తులు

ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన సిఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 229దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్ ,గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 64 దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 54దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం 46 దరఖాస్తులు, హోంశాఖకు 14 దరఖాస్తులు, ప్రవాసీ ప్రజావాణీకి 02దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబందించి 49 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సిఎం ప్రజావాణీ ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్యాదేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

# సమాజ మార్పునకు దిక్సూచిలా విద్యార్థులు

## విజ్ఞానాన్ని వినియోగించి పరిశోధనలను అభివృద్ధి చేయాలి: గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ



విద్యార్థులు ఏర్పాటుచేసిన స్టాళ్లను పరిశీలిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**వర్గల్, అక్టోబరు 24, ప్రభాతవార్త:** విద్యార్థులు సమాజ మార్పునకు దిక్సూచిలా ఉండాలని, విజ్ఞానాన్ని వినియోగించి వ్యవసాయ ఉత్పత్తిని, సాంకేతికతను, పరిశోధనలను అభివృద్ధి చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో అనేక మార్పులు తీసుకువస్తుందని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ తెలిపారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండల పరిధిలోని కావేరి విశ్వవిద్యాలయం, కావేరి సీడ్ కంపెనీని వారు సందర్శించగా జిల్లా కలెక్టర్ కె.హైమావతి, పోలీస్ కమిషనర్ విజయ్ కుమార్ పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం కావేరి యూనివర్సిటీని సందర్శించి యూని వర్సిటీ ప్రొఫైల్‌ను పరిశీలించారు. తదుపరి ఎంటమాలజీ, పాథాలజీ, సాయిల్ సైన్స్, బ్రీడింగ్, ఫిజి యోలజీ ల్యాబ్స్‌ను, విద్యార్థులు ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌లో వివిధ రకాల డ్రోన్ టెక్నాలజీ, రోబో టెక్నాలజీ, త్రీడీ ప్రింటింగ్ ఏఆర్ అండ్ విఆర్ మోడల్స్, అగ్రికల్చర్ ఇన్నోవే షన్స్‌ను, వర్మికంపోస్ట్ తయారీని పరిశీలించారు. అలాగే నూతనంగా ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ రీసెర్చ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ రీసెర్చ్ సెంటర్‌లో టిష్యూ కల్చర్, జినోమిక్స్, స్పీడ్ బ్రీడింగ్, ప్లాంట్ హెల్త్ ల్యాబ్స్, జీన్ బ్యాంక్‌లను సందర్శించి ఇవి చాలా అధునాతనంగా ఉన్నాయని అభినందించారు. ఈ రెండు సంస్థలు తమ తమ రంగాలలో సాధించిన అసాధారణ పురోగతి, విజయాలు, పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలను యూనివర్సిటీ ఛాన్సలర్ జివి. భాస్కరరావు, వైస్‌ఛాన్సలర్ డాక్టర్ వి.ప్రవీణ్‌రావు, యూనివర్సిటీ అధ్యాపకులు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు వివరించారు. కావేరి యూని వర్సి టీ ఛాన్సలర్, వైస్‌ఛాన్సలర్లు మాట్లా డుతూ గవర్నర్ సందర్శన విశ్వవిద్యాలయానికి గౌరవంగా భావిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల అభివృద్ధి కోసం విశ్వవిద్యాలయం తీసుకుంటున్న ప్రతిపాదనలు, పథకాలను వివరించారు.

కావేరి యూనివర్సిటీ పరిశోధనలో కొత్త దారిని చూపించడానికి కట్టుబడి ఉందని, కావేరి సీడ్స్ కంపెనీతో సంయుక్త పరిశోధన ప్రాజెక్టులు రాష్ట్ర వ్యవసాయ రంగానికి ఒక మనోబలం కలిగిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, వర్గల్ తహసీల్దార్ రఘువీరారెడ్డి, గజ్వేల్ ఎసిపి నర సింహులు, రూరల్ సిఐ మహేందర్‌రెడ్డి, కావేరి యూనివర్సిటీ రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ హర్ష పొలసాని, అగ్రి కల్చరల్ డీన్ ఏ.ప్రతాప్ కుమార్‌రెడ్డి, ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ కొండా శ్రీనివాస్, ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సృష్టి ఆసుపత్రి గోల్‌మాల్‌పై కొనసాగుతున్న ఇడి విచారణ

## మూడోరోజు డాక్టర్ నమ్రతను ఐదు గంటలు విచారించిన అధికారులు

**హైదరాబాద్, అక్టోబరు 24, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా సలచంనం రేపిన సృష్టి ఆసుపత్రి సరోగసి స్కాంలో కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ విచారణ మూడవ రోజుకు చేరింది. ఈ కేసులో అరెస్టయి చంచల్‌గూడ మహిళా జైల్లో వున్న నిందితుల విచారణను బుధవారం నుంచి ఇడి అధికారులు చేబడుతుండడం తెలిసిందే.

మొదటి రోజు బుధవారం నాడు సంతోషిని అనే నిందితురాలిని, రెండవ రోజు గురు వారం నాడు కల్యాణి అనే మరో నిందితురాలిని విచారించిన ఈడీ అధికారులు మూడవ రోజైన శుక్రవారం కీలక నిందితురాలు ఆసుపత్రి ని ర్వాహకురాలైన డాక్టర్ నమ్రతను ఐదు గంటల పాటు విచారించారు. గత జూలై నెలలో ఈ ఆసుపత్రిలో సరోగసి స్కాం జరుగుతున్నట్లు హైదరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి, ఇక్కడ జరుగుతున్న చైల్డ్ ట్రాఫికింగ్ అక్రమాలను రట్టు చేయడం తెలిసిందే. పిల్లలు కలగని దంపతులకు సరోగసి ద్వారా పిల్లలు కనేలా చేస్తామని లక్షలాది రూపాయలు దండుకుని, నవజాత శిశు విక్రయ ముఠాల నుంచి పిల్లలను కొనుగోలు చేసి ఈ పసికందుల ను దంపతులకు వారికి పుట్టిన వారిగా నమ్మించి అంటగడుతున్నట్లు పోలీసులు తేల్చడం విదితమే. ఈ కేసులో సృష్టి ఆసుపత్రి నిర్వాహకురాలు డాక్టర్ నమ్రతతో పాటు 30 మంది అరెస్టు చేయగా మరికొందరు ఇప్పటికీ పరారీలో వున్నారు. వీరి కోసం దేశ వ్యాప్తంగా గాలిస్తున్నారు.

కాగా ఈ ఘటనలో మనీలాండరింగ్ కోణంలో కేసులో నమోదుచేసిన ఇడి అధికారులు దీనిపై విచారిం చేందుకు ఆగస్టు నెల మొదటి వారంలో రంగంలో దిగారు. ఈ కేసులో అరెస్టయి చంచల్‌గూడ మహిళా జైలులో వున్న నలుగురు నిందితులను విచారించేందుకు నాంపల్లి కోర్టు నుంచి ప్రత్యేకంగా అను మతి పొంది బుధవారం నుంచి విచారణ చేబట్టారు. మొదటి రెండు రోజుల తరహాలోనే శుక్రవారం ఉదయం 11 గంటలకు జైలుకు వచ్చిన ఈడీ అధికారులు మధ్యాహ్నాం ఒంటి గంట వరకు ఒకసారి రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రెండవసారి డాక్టర్ నమ్రతను ఐదు గంటల పాటు విచారించారు. కాగా శనివారం నాడు ఇదే జైల్లో వున్న నందినిని విచారించనున్నారు. డాక్టర్ నమ్రతను విచారించిన తరువాత ఈడీ అధికారులు మీడియాతో మాట్లాడకుండా వెళ్లిపోయారు.

# అత్యధికంగా రంగారెడ్డిలో.. అత్యల్పం ఆదిలాబాద్‌లో

## మద్యం షాపులకు 95,137 దరఖాస్తులు.. 27న డ్రా


**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 24:** తెలంగాణలోని 2620 మద్యం షాపులకు 95,137 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తులు చివరి రోజు 23 గురువారం అర్ధరాత్రి వరకు 4822 దరఖాస్తులు వచ్చాయి. ఓబీసీ బంద్, పబ్లిక్ ట్రాన్స్పోర్టు బస్సులు నడువకపోవడం, కొన్నిచోట్ల బ్యాంకులు పనిచేయకపోవడం వంటి పరిస్థితులను దృష్టి ఉంచుకొని ఎక్సైజ్ శాఖ మద్యం షాపులకు దరఖాస్తుల గడువును ఈనెల 23 వరకు పొడగించిన విషయం తెలిసిందే. అత్యధికంగా రంగారెడ్డి డివిజన్లో 29,420 రాగా, అతి తక్కువగా 4154 ఆదిలాబాద్ డివిజన్‌లో దరఖాస్తులు వచ్చాయి. తెలంగాణాలో 2620 మద్యం షాపులకు 95,137 దరఖాస్తులను దాఖలు చేశారు. ఎక్సైజ్ సూపరిండెంట్ల, జిల్లా వారిగా మద్యం షాపుల దరఖాస్తుదారుల సమక్షంలో ఈనెల 27న ఉదయం 11 గంటలకు డ్రా తీయనున్నారు. ఎక్సైజ్ జిల్లాల వారీగా... ఆదిలాబాద్లో 771, కొమురం భీమ్ ఆసిఫాబాద్లో 680, మంచిర్యాలలో 1712, నిర్మల్లో 991, హైదరాబాద్లో 3201, సికింద్రాబాద్లో 3022, జగిత్యాలలో 1966, కరీంనగర్‌లో 2730, పెద్దపల్లిలో 1507, రాజన్న సిరిసిల్లలో 1381, ఖమ్మంలో 4430, కొత్తగూడెంలో 3922, జోగులాంబ గద్వాలలో 774, మహబూబ్‌నగర్‌లో 2487, నాగర్ కర్నూల్‌లో 1518, వనపర్తిలో 757, మెదక్‌లో1420, సంగారెడ్డిలో 4432, సిదిపేటలో 2782, నల్లగొండలో 4906, సూర్యపేటలో 2771, యాదాద్రి భువనగిరిలో 2776, కామారెడ్డిలో 1502, నిజామాబాద్‌లో 2786, మల్కాజిగిరిలో 5168, మేడ్చల్‌లో 6063, సరూర్‌నగర్‌లో 7845, శంషాబాద్‌లో 8536, వికారాబాద్‌లో 1808, జనగామాలో 1697, జయశంకర్ భూపాల్‌పల్లిలో1863, మహబూబాబాద్‌లో 1,800, వరంగల్ రూరల్‌లో 1,958, వరంగల్ అర్బన్‌లో 3,175, మొత్తంగా 95,137 దరఖాస్తులు వచ్చాయి.

# 42శాతం రిజర్వేషన్ల కోసం ఐక్యంగా పోరాడుదాం

## బిసి రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలి

### రిజర్వేషన్ల సాధన సమితి మహాధర్నాలో పలువురు నేతలు

**హైదరాబాద్ (ధర్నాచౌక్), అక్టోబరు 24, ప్రభాతవార్త:** 42 శాతం రిజర్వేషన్లు సాధించుకోవటానికై బీసీలంతా పార్టీలకు అతీతంగా, ఐక్యంగా పోరాడాలని పలువురు నేతలు పిలుపునిచ్చారు. శుక్రవారం 42శాతం బీసీ రిజర్వేషన్ల సాధన సమితి ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ఏఐబీసీఎఫ్ ఛైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య, బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం ఛైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ టి.చిరంజీవులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహారాజు, బీసీ పొలిటికల్ ఫ్రంట్ ఛైర్మన్ బాలగోని బాలరాజుగౌడ్, బీసీ లాయర్స్ అసోసియేషన్ నాయకులు పొన్నం దేవరాజ్ గౌడ్ సారధ్యం వహించగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు, మాజీ ఎంపీ బూరనర్సయ్యగౌడ్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ముఖ్య అతిధులుగా హాజరై ధర్నాకు మద్దతు తెలిపి ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య ఉద్యోగ, స్థానిక సంస్థలలో 42శాతం బీసీ రిజర్వేషన్లు తక్షణమే 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. బీసీలకు రాజ్యాధికారం ద్వారానే అన్ని రంగాల్లో సమస్యలు పరిష్కారం అవుతాయని అభిప్రాయ పడ్డారు. తమిళనాడులో బీసీలకు 69శాతం రిజర్వేషన్లు అమలు జరిగాయని, అదే తరహాలో పోరాటాలు, ఉద్యమాలు చేసి, రిజర్వేషన్లు సాధించుకోవాలని, బీసీలు చేసే పోరాటానికి ఎస్సీ ఎస్టీలు మద్దతు ఇవ్వాలని, అదే విధంగా భవిష్యత్తులో ఎస్సీ ఎస్టీలు చేసే పోరా టాలకు బీసీలు మద్దతు ఇవ్వాలని సూచించారు. అత్యంత వెనుకబడిన బీసీ కులాలకు స్థానిక సంస్థల్లో ఉప వర్గీకరణ చేసి, రిజర్వేషన్లు కల్పించాలని, బీసీలకు అన్యాయం జరుగుతున్న ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను రద్దు చేయాలని, లేనిపక్షం అందులో బీసీఎస్సీ ఎస్టీ నిరుపేద వర్గాలకు అవకాశం కల్పించాలని కోరారు. బీసీలకు రిజర్వేషన్లు రాజ్యాంగ ప్రకారం కేటాయించాలని, పార్టీల పరంగా అవసరం లేదని స్పష్టం చేశారు. బీసీలను పాలకవర్గాలు బిచ్చగాళ్లుగా చూస్తున్నారని, గత 76 సంవత్సరాలుగా బీసీలను ఓట్లు వేసే యంత్రాలుగానే చూస్తున్నారని మండిపడ్డారు. బీసీలకు ఎస్సీ ఎస్టీల వలె రక్షణ చట్టాలు కల్పించాలని, రాజ్యాంగ సవరణ చేసి, న్యాయస్థానాలు సృష్టించిన 50శాతం సీలింగ్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల ప్రమోషన్స్‌లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని, హైకోర్టు మరియు సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకాలలో బీసీ, ఎస్సీ, ఎస్టీ లకు రిజర్వేషన్లు కల్పించాలని విజ్ఞప్తి చేవారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల ద్వారానే న్యాయం జరుగుతుందని, రిజర్వేషన్లు 9వ షెడ్యూల్ ద్వారానే సాధ్యమవుతాయని స్పష్టం చేశారు. తక్షణమే 42శాతం బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చి, రిజర్వేషన్లు అమలయ్యేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో తెలంగాణ సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఒంటెద్దు నరేందర్, నేషనల్ ఓబీసీ మోర్చా అధ్యక్షులు దాస్‌రామ్‌నాయక్, మన ఆలోచన సాధన సమితి అధ్యక్షులు కటకం నర్సింగ్‌రావు, సినీ ప్రొడ్యూసర్ ఎన్.శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో అభివాదం చేస్తున్న బిసి నేతలు

# ఎస్ఎల్‌బిసి ఘటనలో సిఎస్‌పై జాతీయ మానవహక్కుల కమిషన్ సీరియస్

**హైదరాబాద్,అక్టోబరు 24, ప్రభాతవార్త:** శ్రీశైలం ఎడమగట్టు కాలువ కుప్పకూలి అందులో గల్లంతైన కార్మికులను వెతకడంలో తెలంగాణ ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యంపై జాతీయ మానవహక్కుల కమీషన్ సీరియస్ అయింది. ఎస్ఎల్‌బిసి ఘటన పై నాలుగు వారాల్లో నివేదిక ఇవ్వాలని చీఫ్ సెక్రటరీ రామకృష్ణరావును ఎన్‌హెచ్‌ఆర్‌సి ఆదేశించింది. ఈ ప్రమాదంలో ఉత్తర ప్రదేశ్‌కు చెందిన శ్రీనివాస్ జమ్మూకశ్మీర్‌కు చెందిన్న సన్నీసింగ్ జార్ఖండ్ కు చెందిన సందీప్‌సాహు, జగ్తా, సంతోష్‌సాహు అనుజ్‌సాహు అనే కార్మికులు గల్లంతై ఎనిమిది నెలలు అయినా వారి సంరక్షణకు ఏచర్యలు తీసుకోలేదని ఎన్‌హెచ్‌ఆర్‌సి వ్యాఖ్యానించింది. అసంఘటిత కార్మికుల చట్టం ఉల్లంఘటన చేశారని మృతదేహాల వెలికితీతలో పారదర్శకత లేకుండా గోప్యత పాటించారని అంతర్రాష్ట్ర వలస కార్మికుల నియంత్రణ, పనిపరిస్థితులపై ఎన్‌హెచ్‌ఆర్‌సి తీవ్రఆగ్రహం వ్యక్తంచేసింది. ప్రభుత్వం ఉదాసీనత వల్ల మిగితా వారి మృతదేహాలను వెలికితీయలేదని కేవలం ఇప్పటి వరకు మనోజ్‌కమార్ గురప్రీత్ మృతదేహాలు మాత్రమే వెలికితీశారని ప్రముఖ న్యాయవాది ఇమ్మనేని రామారావు అన్నారు

# వ్యవసాయ యూనివర్సిటీలో మరో 150 బిఎస్సీ అగ్రికల్చర్ సీట్లు

## ఉపకులపతి అల్దాస్ జానయ్య

**హైదరాబాద్ (అత్తాపూర్) అక్టోబరు 24, ప్రభాతవార్త :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో ఈ యేడాది నుంచి బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సులో మరో 150 సీట్లు అందుబాటులోకి రానున్నాయని ఉపకులపతి అల్దాస్ జానయ్య ప్రకటించారు. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం పిజెటిఎయూకి మూడు నూతన వ్యవసాయ కళాశాలలని మంజూరు చేసిందని ఆయన తెలిపారు. హుజూర్‌నగర్‌లో ఏర్పాటు కానున్న కళాశాలలో 30 సీట్లు, కొడంగల్ లో రానున్న కళాశాలలో 30 సీట్లు, నిజామాబాద్ లో ఏర్పాటు కానున్న కళాశాలలో 30 సీట్లు అందుబాటులోకి రానున్నాయని జానయ్య వివరించారు. ఇప్పటికే ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకి ఈ సీట్ల భర్తీ కి త్వరలో ప్రత్యేకంగా కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు జానయ్య వివరించారు. మరో వైపు మహాత్మా జ్యోతిబాఫూలే తెలంగాణా వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ విద్యా సంస్థల సొసైటీ ఆర్థిక సహకారం తో టిజి ఈఏపిసెట్-2025 లో అర్హత సాధించిన వెనుక బడిన తరగతుల విద్యార్థుల కి బిఎస్సీ అగ్రికల్చర్ లో మరో 60 సీట్ల ని ఈ విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి తీసుకుని రానున్నట్లు జానయ్య పేర్కొన్నారు. ఈ 60 సీట్లని రాజేంద్ర నగర్, వరంగల్, జగిత్యాల, పాలెం, సిరిసిల్ల, అశ్వారావుపేట కళాశాలలలో ఒక్కో కళాశాలలో 10 సీట్లు చొప్పున భర్తీ చేయనున్నట్లు ఆయన వివరించారు. ఈ సీట్ల లో ప్రవేశాల కోసం యూనివర్సిటీ వెబ్ సైట్లలో మరలా ఈ నెల 29వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.


# కుంభకర్ణుడి తరహాలో కెసిఆర్ రాజకీయం

## ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఎద్దేవా

**హైదరాబాద్, అక్టోబరు 24, ప్రభాతవార్త:** కుంభకర్ణుడు ఆరు నెలలు తిని ఆరు నెలలు నిద్రపోయినట్లుగా తెలంగాణ దొర కెసిఆర్ రాజకీయం ఉందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య విమర్శించారు. శుక్రవారం సిఎల్‌పిలో విలేఖరులతో మాట్లాడుతూ తెలంగాణ దొర కెసిఆర్ తెలంగాణ దళితులు, బడుగు బలహీర వర్గాలు ఓట్లు వేసి గెలిపిస్తే గతంలో ముఖ్యమంత్రై ఫామ్ హౌస్ లో చెట్టు కింద హాయిగా కూర్చొన్నడు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఎన్నికై రోజుకు 18గంటలకు పైగా పనిచేస్తూ ఉంటే ఆయన పైన పడి ఏడుస్తున్నడు అని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం పార్టీ ఆఫీసు కు కూడా రాకుండా నాయ కులనే ఫామ్‌హౌస్‌కు పిలిపించుకుంటున్నాడని ఆయన అన్నారు. జూబ్లీహిల్స్ లో బిఆర్ఎస్ ఘనవిజయం ఖాయమని కెసిఆర్ అంటున్నాడు కానీ ఎందుకు గెలిపిస్తారు...? అసలు మీకు డిపాజిట్ వస్తుందో రాదో చూసుకో ముందు అని హితవు చెప్పారు. బిఆర్ఎస్ ను గెలిపించడానికి కెసిఆర్ ఒక్క కారణం చెప్పాలని ఆయన కోరారు. తెలంగాణను నాశనం చేశావనే ఓడించి నిన్ను ఫామ్ హౌస్ లో కూర్చోబెట్టారని విమర్శించారు. అయినా అహంకారం తగ్గలేదు..ఇంకా ఏ మోహం పెట్టుకుని జూబ్లీహిల్స్ లో ఓట్లు అడుగుతున్నారని దుయ్యబట్టారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ను రౌడీ షీటర్ అని కెసిఆర్ అంటున్నాడు. ఒక బిసి యాదవ బిడ్డను రౌడీషీటర్ అని కెసిఆర్ అవమానించాడు. బిసిలను రౌడీలుగా చూపించడానికి కెసిఆర్, కెటిఆర్ కుట్రలు చేస్తున్నారు. బిసి అంటే అంత చులకనగా కెసిఆర్ కు కనిపిస్తున్నా రా..? బడుగు బలహీన వర్గాలను కించే పర్చేలా మాట్లాడుతున్న కెసిఆర్‌కెటిఆర్‌ల కు తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపు నిచ్చారు. లక్ష మెజార్టీతో నవీన్ యాదవ్ ను గెలిపించాలని ఆయన కోరారు. నవీన్ యాదవ్ పైన రౌడీ షీట్ ఉందా..? ఎన్ని కేసులు ఉన్నాయో కెసిఆర్ చూపించాలని కోరారు. అయ్య కెసిఆర్ ఏమో కాంగ్రెస్ అభ్యర్థి రౌడీ షీటర్ అంటాడు.. కొడుకేమో సల్మాన్ ఖాన్ అనే రౌడీ షీటర్ కు కండువా కప్పి పార్టీలో చేర్చుకుంటడని అన్నారు. .సల్మాన్ ఖాన్ అనే వాడిపైన 32 కేసులు ఉన్నాయని గుర్తుచేశారు. కెటిఆర్, కెసిఆర్‌లకు పిచ్చి మాటలు మాట్లాడు తుంటే బిఆర్ఎస్ లోని బిసి నాయకులు ఎందుకు నోరు తెరవడం లేదు..? అని ఆయన ప్రశ్నించారు.

## హెచ్1బి వీసాలపై వెనక్కి తగ్గే ప్రసక్తేలేదు!

వైట్‌హౌస్ ప్రెస్‌సెక్రటరీ కరోలిన్ లెవిట్



**వాషింగ్టన్, అక్టోబరు 24:** అమెరికాలో నైపుణ్యం కలిగిన విదేశీ ఉద్యోగులకు జారీ చేసే హెచ్1బి వీసాలపై కొత్తగా విధించిన లక్ష డాలర్ల భారీ ఫీజు విధానాన్ని కోర్టులో సమర్థించుకుంటామని ట్రంప్ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ పలు సంస్థలు దాఖలు చేసిన వ్యాజ్యాలపై వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. ఈ విధానం అమెరికన్ కార్మికుల ప్రయోజనాలను కాపాడటానికేనని వైట్ హౌస్ ఉద్ఘాటించింది. వైట్ హౌస్‌లో జరిగిన మీడియా సమావేశంలో ప్రెస్ సెక్రెటరీ కరోలిన్ లెవిట్ మాట్లాడుతూ, హెచ్1బి వీసా వ్యవస్థలో మోసాలు పెరిగిపోయాయని, దీనివల్ల అమెరికన్ల వేతనాలు పడిపోతున్నాయని ఆరోపించారు.

## విక్టోరియా పార్లమెంట్‌ను సందర్శించిన మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, అక్టోబరు 24:** ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శుక్రవారం విక్టోరియా పార్లమెంట్‌ను సందర్శించారు. లెజిస్లేటివ్ కౌన్సిల్ గవర్నమెంట్ విప్ లీ తార్లామిస్, పార్లమెంటరీ సెక్రటరీ షీనా వాట్ ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా లెజిస్లేటివ్ ప్రొసీజర్స్, పార్లమెంటరీ గవర్నెన్స్, పబ్లిక్ అకౌంటబిలిటీ తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. శాసనాల తయారీలో పౌరుల భాగస్వామ్యం పెరిగినప్పుడే పారదర్శకత, జవాబుదారీ తనం పెరుగుతుందని మంత్రి శ్రీధర్‌బాబు అభిప్రాయపడ్డారు. తెలంగాణలో అమలవుతున్న ప్రోగ్రెసివ్ లెజిస్లేటివ్ ప్రాక్టీసెస్, గవర్నెన్స్ రిఫార్మ్స్, డిజిటల్ ఇనిషియేటివ్స్‌ను వారికి వివరించారు. ట్రాన్స్‌పరెంట్, టెక్నాలజీ ఎనేబుల్డ్, సిటిజన్‌డ్రివెన్ గవర్నెన్స్ మోడల్స్ రూపకల్పనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆ దిశగా చిత్తశుద్ధితో కృషి చేస్తుందని చెప్పారు.

## అంగన్వాడీ సరకుల పట్ల అలసత్వంపై చర్యలు

పంచాయతీరాజ్, మహిళా సంక్షేమ మంత్రి సీతక్క

**హైదరాబాద్, అక్టోబరు 24, ప్రభాతవార్త :** అంగన్వాడీలకు సరుకుల సరఫరా లో అలసత్వం వహించే కాంట్రాక్టర్లపై చర్యలు తప్పవని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ మంత్రి సీతక్క హెచ్చరించారు. అలసత్వం ప్రదర్శిస్తున్న కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేసి బ్లాక్ లిస్టులో పెట్టాలన్నారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు పాలు, గుడ్లు, పప్పు, మంచి నూనె, బాలమృతం, మురుకులు, బియ్యం వంటి వస్తువుల సరఫరాలో లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు. కొన్ని జిల్లాల్లో వస్తువుల సరఫరా 50 శాతానికి కూడా చేరకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

## హెచ్‌వైసి వ్యవస్థాపకుడు సల్మాన్‌ఖాన్‌పై కేసు నమోదు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), అక్టోబరు 24, ప్రభాతవార్త:** హెచ్‌వైసీ వ్యవస్థాపకుడు, బీఆర్ఎస్ నేత సల్మాన్‌ఖాన్‌పై జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి. సాయిరాం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సల్మాన్ ఖాన్‌పై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. సల్మాన్‌ఖాన్ అతని అనుచరులు రిటర్నింగ్ అధికారి విధులను అడ్డగించడమే కాకుండా అసభ్య పదజాలం ఉపయోగించి తప్పుడు ఆరోపణలు చేశారు. దీనికితోడు మీడియా, సోషల్‌మీడియాలో తప్పుడు ఆరోపణలు చేసి ఎన్నికల కమిషన్ నిబంధనలను ఉల్లంఘించారు. ఈ మేరకు రిటర్నింగ్ అధికారి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు సల్మాన్‌ఖాన్ తదితరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తుది దశకు చేరుకున్న ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారం

వారి తరపున హాజరైన అడ్వొకేట్లు, విచారణ చేసిన స్పీకర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 24:** రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారిన ఫిరాయింపుల వ్యవహారం తుది దశకు చేరుతున్నది. పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అనర్హతపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్కుమార్ శుక్రవారం విచారణ చేపట్టారు. అయితే.. ఈ విచారణకు ఎమ్మెల్యేలు ఎవరూ హాజరు కాలేదు. వారి తరపున అడ్వకేట్లు మాత్రమే హాజరై తమ వాదనలు వినిపించారు. ఇప్పటికే నలుగురు ఎమ్మెల్యేల క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తయిన నేపథ్యంలో మిగిలిన కేసులు ఈ వారంలో ముగియనున్నాయి. ఫిరాయింపు నిరోధక చట్టం ప్రకారం స్పీకర్ విచారణలు చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ముందుగా కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ వర్సెస్ టి.ప్రకాశ్‌గౌడ్ కేసు విచారణ జరిగింది. ఇరుపక్షాల అడ్వకేట్లు ఓరల్ ఆర్గ్యుమెంట్స్ వినిపించారు. సంజయ్, ప్రకాశ్ గౌడ్ కేసు విచారణ ముగిసిన వెంటనే.. కాలే యాదయ్య వర్సెస్ చింతా ప్రభాకర్ కేసు విచారణ చేపట్టారు. అనంతరం గూడెం మహిపాల్ రెడ్డి వర్సెస్ చింతా ప్రభాకర్ కేసు విచారించారు. ఈ రెండింటిలోనూ ఇరుపక్షాల అడ్వకేట్లు వారి వారి వాదనలు వినిపించారు. అలాగే.. బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి వర్సెస్ పల్లా రాజేశ్వం రెడ్డి కేసును సైతం స్పీకర్ గడ్డం ప్రసాద్ విచారించారు. మరో నలుగురు ఫిరాయింపు ఎమ్మెల్యేలను త్వరలోనే స్పీకర్ విచారించనున్నారు. కాగా.. ఎమ్మెల్యేల విచారణ నేపథ్యంలో ఈనెల 31 వరకు అసెంబ్లీ పరిసరాల్లో ఆంక్షలు విధించారు.

## ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్ పరీక్షలు!

బోర్డు ప్రతిపాదనలకు సిఎం ఆమోదం

నేడు షెడ్యూల్‌ను విడుదల చేయనున్న బోర్డు కార్యదర్శి

**హైదరాబాద్, అక్టోబరు 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇంటర్ వార్షిక పరీక్షలను గత యేడాది కంటే ముందుగానే నిర్వహించాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రభుత్వ ఆమోదం కోసం పంపించగా.. ఇంటర్ బోర్డు ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదించినట్టు తెలిసింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 25న ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు మొదలు కానుండగా.. ఫిబ్రవరి 26 నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య నేడు(శనివారం) ప్రకటించనున్నారు.

## ఫిబ్రవరి 8న సీటెట్ పరీక్ష

త్వరలో పూర్తి షెడ్యూల్ జారీ.. డైరెక్టర్ సీటెట్

**హైదరాబాద్, అక్టోబరు 24, ప్రభాతవార్త:** సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ (సీటెట్) పరీక్షను వచ్చే ఏడాది ఫిబ్రవరి 8న నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సిబిఎస్‌ఈ) త్వరలోనే జారీ చేయనుంది. సీటెట్ 21వ ఎడిషన్ పరీక్షను ఫిబ్రవరి 08(ఆదివారం)న (పేపర్-1, పేపర్-2)ను నిర్వహిస్తుంది. ఈ పరీక్ష దేశవ్యాప్తంగా 132 నగరాల్లో 20 భాషల్లో నిర్వహించబడుతుందని సీటెట్ డైరెక్టర్ శుక్రవారం ప్రకటించారు. పరీక్ష, సిలబస్, భాషలు, అర్హత ప్రమాణాలు, పరీక్ష ఫీజు, పరీక్ష నగరాలు ఇతర ముఖ్యమైన తేదీల వివరాలను కలిగి ఉన్న వివరణాత్మక సమాచార బులెటిన్ త్వరలో సీటెట్ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుందని ప్రకటించారు.

## వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారుడిని సత్కరించిన డిజిపి

**హైదరాబాద్, అక్టోబరు 22, ప్రభాతవార్త:** తెలంగాణ పోలీసు వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారుడు ఎండి షుజావుద్దీన్‌ను డిజిపి శివధర్ రెడ్డి సత్కరించారు. శుక్రవారం తన కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో పోలీసు వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారుడు ఎండి షుజావుద్దీన్‌ను డిజిపి సత్కరించారు. ఇటీవల ఎపి రాజధాని అమరావతిలో జరిగిన అఖిల భారత పోలీస్ వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్ 2025...2026 పోటీలలో తెలంగాణ పోలీసు శాఖ త రపున పాల్గొన్న ఎండి షుజావుద్దీన్ 153 కిలోల విభాగంలో కాంస్య పతకం సాధించాడు. సిటీ పోలీసు విభాగంలోని ఖైరతాబాద్ పోలీసు స్టేషన్‌లో ఇతను కానిస్టేబుల్‌గా వున్నాడు. ఈ సందర్భంగా కోచ్ రమణారావును, క్రీడల విభాగం ఐజి రమేష్ రెడ్డిని కూడా డిజిపి అభినందించారు.

# బీహార్‌లో మహాఘట్‌బంధన్ గెలుపు తథ్యం

ఎన్నికల ప్రచారంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 24:** ఎన్డీయె కూటమి పాలనలో విసిగిపోయిన బిహార్ ప్రజలు మార్పుకోరుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ బిహార్ ఎన్నికల పరిశీలకులు, తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆర్జేడి, వామపక్షాలతో సమన్వయం చేసుకొని సమిష్టిగా పనిచేసి మహాఘట్ బంధన్ గెలుపునకు బాటలు వేయాలని పిలుపునిచ్చారు.

బీహార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం పశ్చిమ చంపారాన్ జిల్లా, చనపటియా అసెంబ్లీ నియోజకవర్గం ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. బీహార్ రాష్ట్ర ఇంచార్జి కృష్ణా ఆళ్వార్, ఏఐసీసీ పరిశీలకులు బీవీ శ్రీనివాస్, చాణిల్పాటియా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ప్రమోద్ సింగ్ పటేల్‌తో కలిసి పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం అనుసరించాల్సిన వ్యూహాలు, ఎత్తుగడలు తదితర కార్యాచరణపై కార్యకర్తల సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. 20 ఏళ్ల నితీష్ పాలనలో బీహార్ దిగజారిన అభివృద్ధి, కేంద్ర రాష్ట్రాలలో నరేంద్రమోడీ, నితీష్ కుమార్ పాలనా వైఫల్యాలను ఇంటింటికి తిరిగి ప్రజలకు చేరవేయాలని సూచించారు. నవంబర్‌లో జరిగే పోలింగ్‌లో ఎన్డీయే కూటమికి ఊహించని షాక్ ఇవ్వాలని, 14న వెలువడే ఫలితాలతో సీఎం నితీష్ కుమార్ ప్రభుత్వాన్ని దించాలని మంత్రి పొంగులేటి కోరారు.

ఎన్డీఏ దుష్టపాలన పట్ల ఓటర్లలో మరింత అవగాహన కల్పించాలన్నారు. రెండు దశాబ్దాలుగా బీహార్ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, నిరుద్యోగం, రైతుల ఇబ్బందులు, మహిళల భద్రత, కార్మికుల స్థితిగతులు, మైలిక వసతుల లోపాలు వంటి వాటిని గుర్తించి వాటికి శాశ్వత పరిష్కారం చూపే దిశగా మహాఘట్ బంధన్ స్పష్టమైన ప్రణాళికలను రూపొందిం చిందన్నారు. బీహార్ అభివృద్ధి, ప్రజల సంక్షేమం లక్ష్యంగా మహాఘట్ బంధన్ పనిచేస్తుందని, యువత మహిళలు రైతులు, కార్మికులు అందరూ. కలిసి మహాఘట్ బంధన్‌కు చారిత్రాత్మక గెలుపును అందించాలని పిలుపునిచ్చారు.

ఇప్పటికే మహాఘట్ బంధన్ తరఫున సీఎం అభ్యర్థిగా తేజస్వి యాదవ్, డిప్యూటీ సీఎంగా సహానీ పేర్లను కాంగ్రెస్ నేత అశోక్ గెహ్లాట్ ప్రకటించారని తెలిపారు. కానీ ఎన్డీఏ కూటమి తరఫున సీఎం అభ్యర్థిగా ఎవరినీ ప్రకటించలేని దుస్థితిలో ఉన్నారని మంత్రి పొంగులేటి ఎద్దేవా చేశారు. ఇప్పటికే మహాఘట్ బంధన్ ఎన్నికల ప్రణాళిక, ప్రచారాన్ని చూస్తే ప్రజలు ఈ సారి కొత్తపాలనను కోరుకుంటున్నట్లు స్పష్టమైన సంకేతాలు కనిపిస్తు న్నాయని, బలమైన అభ్యర్థులు రంగంలో ఉన్నందున గెలుపు తథ్యమని మంత్రి పొంగులేటి జోస్యం చెప్పారు.



## గ్రామీణ రహదారుల అభివృద్ధికి రూ.74.43 కోట్లు మంజూరు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 24:** గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధే లక్ష్యంగా పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ శుక్రవారం రూ.74.43 కోట్ల నిధులతో 32 కొత్త రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. గ్రామీణ రహదారులు పల్లె ప్రజల జీవితాల్లో కీలకమైన పాత్ర పోషిస్తాయని, కొత్త రహదారుల నిర్మాణంతో రవాణా సౌకర్యం మెరుగుపడటమే కాకుండా స్థానిక ఆర్థిక వ్యవస్థ కూడా బలపడుతుందని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. పల్లెల మధ్య అనుసంధానం పెరిగి, రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను సులభంగా మార్కెట్లకు తరలించగలరని, విద్యార్థులు, వృద్ధులు, గర్భిణీలు వంటి వర్గాలకు ప్రయాణ సౌలభ్యం కలుగుతుందని ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంత అభివృద్ధి మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి పల్లె అభివృద్ధి చెందేలా మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. రహదారులు, తాగునీరు, విద్యుత్, గృహ నిర్మాణం, సంక్షేమ పథకాలు, ప్రతి రంగంలో ప్రభుత్వం ప్రజల అవసరాలకు తగ్గట్టుగా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ములుగు జిల్లాలోని గిరిజన ఆదివాసి ప్రాంతాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ, అక్కడి పల్లెలు కూడా అభివృద్ధి పథంలో దూసుకు పోవాలనే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. కొత్త రహదారుల నిర్మాణం ద్వారా పల్లెల మధ్య రవాణా సౌకర్యం మాత్రమే కాకుండా పర్యాటక అవకాశాలు కూడా పెరుగు తాయని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఈ రూ.74.43 కోట్ల నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కొత్త దశకు చేరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రహదా రులు మాత్రమే కాదు, గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలే మారిపోతాయని పేర్కొన్నారు. మరింత అభివృద్ధి పల్లెల తలుపుతడుతుందని సీతక్క స్పష్టం చేశారు.

## విద్య రాని వ్యక్తి విద్యా శాఖ మంత్రి

సిఎం రేవంత్‌రెడ్డిపై హరీశ్‌రావు విమర్శలు

కాంగ్రెస్ నిరుద్యోగ బాకీ కార్డు ఆవిష్కరణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 24:** విద్యా శాఖ మంత్రిగా, మున్సిపల్ మంత్రిగా, హోం మంత్రిగా, ముఖ్యమంత్రిగా సీఎం రేవంత్ రెడ్డి ఫెయిల్ అయ్యాడని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రంగా విమర్శించారు. కలెక్షన్ల మంత్రిగా, వసూళ్ల మంత్రిగా మాత్రం పాస్ అయిపోయిండు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. శుక్రవారం కాంగ్రెస్ నిరుద్యోగ బాకీ కార్డు ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడారు. జీవో 29, జీవో 55పై నేను ఆనాడు అసెంబ్లీలో గట్టిగా మాట్లాడాను. భట్టి దళిత మంత్రిగా ఉన్నారు మీరైనా పట్టించుకోండి అంటే పట్టించుకోలేదు. జాబులు నింపండి అంటే జేబులు నింపుకుంటున్నరు. గల్లా పెట్టెలు నింపుకుంటున్నరు. విద్య రాని వ్యక్తి విద్య శాఖ మంత్రి. అతి ఎక్కువ క్రిమినల్ కేసులు ఉన్న వ్యక్తి హోం మంత్రిగా ఉన్నారని హరీశ్‌రావు విమర్శించారు. మా ప్రభుత్వం టీఎస్ ఐపాస్ ద్వారా పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించింది. నేడు ఈ ప్రభుత్వం మంత్రులు, ముఖ్యమంత్రి గన్నులు పెట్టి బెదిరిస్తున్నరు. రేవంత్ రెడ్డి గన్ ఇచ్చి పంపించాడు అని మంత్రి కుమార్తె చెప్పింది. ఐఏఎస్ ఆఫీసర్ వీఆర్ఎస్‌తో మధ్యలోనే వెళ్లిపోతున్నడు. లక్షా 64వేల ప్రభుత్వ ఉద్యోగాలను బిఆర్ఎస్ ఇచ్చింది. గ్రూప్ 1, గ్రూప్ 2 ఆలస్యం అయ్యింది.95 శాతం లోకల్ రిజర్వేషన్ సాధించాం. నోటిఫికేషన్లు ఇచ్చింది బిఆర్ఎస్, పరీక్ష పెట్టింది బిఆర్ఎస్, ఫిజికల్ టెస్టు పెట్టింది బిఆర్ఎస్, ఎంపిక చేసింది బిఆర్ఎస్. నియామకపత్రాలు ఇచ్చింది రేవంత్. దీంతో 60వేల ఉద్యోగాలు ఇచ్చినా అని ప్రచారం చేసుకుంటున్నడు రేవంత్ రెడ్డి అని హరీశ్‌రావు మండిపడ్డారు.



## సిఎం రేవంత్‌రెడ్డితో నటుడు నారా రోహిత్ భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,అక్టోబరు 24:** ముఖ్యమంత్రి సిఎం రేవంత్ రెడ్డితో ప్రముఖ నటుడు, ఎపి సిఎం చంద్రబాబునాయుడి సోదరుడి కుమారుడు నారా రోహిత్ భేటీ అయ్యారు. ఈనెల 30న జరిగే తన వివాహానికి రావాలని నారా రోహిత్ సిఎం రేవంత్‌ను ఆహ్వానించారు. కాగా, నటి శిరీషను నారా రోహిత్ ఈనెల 30న పెళ్లి చేసుకోబుతున్న సంగతి తెలిసిందే. హల్దీ వేడుకలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. 26వ తేదీన పెళ్లికొడుకు వేడుక, 28వ తేదీన మెహంది వేడుక జరగనుండగా 30వ తేదీన రాత్రి 10.35 గంటలకు కుటుంబ సభ్యులు, సన్నిహితులు సమక్షంలో వారి వివాహం జరగనుంది. వివాహానికి అన్ని ఏర్పాట్లు పూర్తి కాగా, ఈ వేడుకలో ఎపి సిఎం చంద్రబాబు నాయుడుతో సహా, పలువురు మంత్రులు, అన్ని పార్టీల ముఖ్య నేతలు, పలువురు సినీ ప్రముఖులు హాజరు కానున్నారు. కాగా సిఎంను నారా రోహిత్ కలిసిన సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సిఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి వెంట ఉన్నారు.

# విద్యతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు

బిసి రిజర్వేషన్లకు రాజ్యాంగ సవరణ చేయాలి: ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), అక్టోబరు 24, ప్రభాతవార్త:** విద్య ద్వారానే ఏదైన సాధించవచ్చునని, ముఖ్యంగా ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశం ఉంటుందని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య చెప్పారు. ఈ విషయాన్ని గమనించిన తాను బిసిల కోసం తెలుగు రాష్ట్రాలలో హాస్టల్స్, గురుకుల పాఠశాలలు, స్కాలర్‌షిప్‌లు, ఫీజుల రీయంబర్స్ మెంట్ సాధించడం జరిగిందని, ఇందుకోసం ఎన్నో ఆందోళన కార్యక్రమాలతోపాటు మిలిటెంట్ ఉద్యమాలచేయడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. ప్రతి బిసి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన బిసి విద్యార్థుల రాష్ట్ర స్థాయి సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.

బిసిల జనాభా ప్రకారం రిజర్వేషన్‌లకు రాజ్యాంగ సవరణ చేయాలని, సమస్యకు ఇదే శాశ్వత పరిష్కారమన్నారు. తెలం గాణ బంద్‌కు మద్దతు ఇచ్చిన రాజకీయ పార్టీలు ఆదే విధంగా రాజ్యాంగ సవరణకు కూడా మద్దతు ఇవ్వాలని, రిజర్వేషన్ల సమస్యకు ప్రతిసారి వ్యతి రేక తీర్పులు వస్తున్నాయని దీనికి రాజ్యాంగ బద్దత కల్పించడమే శాశ్వత పరిష్కారమ న్నారు.

స్థానిక సంస్థల రిజర్వేషన్ల విషయంలో పలు రాష్ట్రాలలో బిసిలకు వ్యతిరేకంగా తీర్పులు వచ్చాయని కాని ఆ రాష్ట్రాల్లోని బిసిలు తిరుగుబాటు చేయలేదని, తెలంగాణ రాష్ట్రంలో బిసిలు రిజర్వేషన్‌ల రక్షణ కోసం రాష్ట్ర వ్యాప్త బంద్ జరపడం గర్వించదగ్గ విషయమని, ఇది బిసిల చైతన్యానికి ప్రతీకని చెప్పారు. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్‌ల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేయాలని ఆయన పిలుపుని చ్చారు. ఈ నెల 26న అన్ని జిల్లా, నియోజకవర్గ కేంద్రాలలో బిసి సంఘాలు, కుల సంఘాలు ప్రజా సంఘాలతో కలిసి కార్యాచరణను రూపొందిం చాలని, అన్ని పట్టణ, జిల్లా, మండల కేంద్రాలలో నిరాహారదీక్షలు చేపట్టాలని ఆర్. కృష్ణయ్య కోరారు.

## స్పీకర్‌ను కలిసిన హర్యానా విధాన సభాకమిటీ



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, అక్టోబరు 24:** హర్యానా విదాన సభా కమిటీ ఆన్ లోకల్ బాడీస్ అండ్ పంచాయతీ రాజ్ ఇన్స్టిట్యూషన్స్ శుక్రవారం సాయంత్రం తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌ను శాసనసభ భవనంలోని ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిసారు. తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థలు, పంచాయతీ రాజ్ వ్యవస్థపై అధ్యయనానికి హైదరాబాద్ విచ్చేసిన హర్యానా విధాన సభ శాసనసభ్యులు, అధికారులతో కూడిన చైర్మన్ వినోద్ భయాన్, ఘనశ్యామ్ షరాఫ్, కులదీప్ వత్స్, అధికారుల కమిటీ స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను కలిశారు. శాసన పరిషత్ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, లేజిస్లేటివ్ సెక్రటరీ డాక్టర్ వి. నరసింహాచార్యులు కూడా ఈ మర్యాదపూర్వక భేటీలో పాల్గొన్నారు.

## మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో ఏవియేషన్ జెఎండి భేటీ

**హైదరాబాద్, అక్టోబరు 24,ప్రభాతవార్త:** ఏవియేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గా ఇటీవల నూతనంగా నియా మకమైన రోహిత్ రెడ్డి శుక్రవారం నాడు రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డిని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రోహిత్ రెడ్డికి మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలో ఏవియేషన్ రంగం,ఇటీవలి పురోగతిపై ఇరువురు చర్చించుకున్నారు.

## ప్రజా అవగాహనతోనే మార్పు

హైడ్రాకు అన్ని వర్గాల సహకారం

15 నెలల్లో వెయ్యి ఎకరాల భూమి కాపాడాం

హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్

**హైదరాబాద్, అక్టోబరు 24,ప్రభాతవార్త:** ప్రజల్లో అవగాహన వచ్చినప్పుడే పరిస్థితుల్లో మార్పు వస్తుందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. హైడ్రాను ఎందుకు ఏర్పాటు చేశారు.. హైడ్రా ఏం చేస్తుందనే విషయమై ఇప్పుడు అందరిలో అవగాహన వచ్చిందని అన్నారు. ఇంటర్నేషనల్ కమిషన్ ఆఫ్ కల్చర్ అండ్ డిప్లమాటిక్ రిలేషన్స్( ఐసిసిడిఆర్) ఆధ్వర్యంలో యునైటెడ్ నేషన్స్‌డేను పురస్కరించుకుని "మారుతున్న ప్రపంచ పరిస్థితుల్లో యునైటెడ్ నేషన్స్ సెక్యూరిటీ కౌన్సిల్‌లో సంస్కరణల అవసరం" అనే అంశంపై గ్రీన్ పార్కు హోటల్‌లో శుక్రవారం సదస్సు నిర్వహించారు. దీనికి హైడ్రా కమిషనర్ రంగనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిం చారు. సాంస్కృతిక వారసత్వ పరిరక్షణతో పాటు.. పర్యావరణ పరిరక్షణకు ఐక్యరాజ్యసమితి పెద్ద పీట వేస్తుందని ఆ దిశగా నగరంలో మెరుగైన జీవన విధానాలు పెంపొందించేందుకు హైడ్రా పని చేస్తోందని చెప్పారు. ఆ క్రమంలోనే ఆక్రమణల తొలగింపు.. చెరువుల పునరుద్ధరణ కార్యక్రమాలను పెద్దయెత్తున చేపట్టామని అన్నారు.

ఇటీవల హైడ్రా వార్షికోత్స వాలు సందర్భంగా ఏర్పాటు చేసిన విజ్ఞాన ప్రదర్శనలో నాలుగైదు తరగతు విద్యార్థులు కూడా చెరువు ఎఫ్‌టీఎల్(ఫుల్ ట్యాంక్ లెవెల్), బఫర్ జోన్ల గురించి వివరించిన తీరే హైడ్రా పట్ల ప్రజల్లో అవగాహన వచ్చిందనడానికి నిదర్శనమన్నారు. అలాగే నగరంలో చెరువులను పునరుద్ధరిస్తు న్నామని.. ఆక్రమణలతో చెరువు ఆనవాళ్లు కోల్పోయిన బతుకమ్మ కుంటను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామని చెప్పారు. త్వరలోనే మరో 5 చెరువులు పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతాయన్నారు. అలాగే నాలాలను కూడా పరిరక్షి ంచే పనిని చేపట్టామని చెప్పారు. నాలాల్లో పెద్దమొత్తంలో పూడికను తొలగించి ఈ ఏడాది వరద ముప్పును తగ్గించామన్నారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ నివేదిక ప్రకారం నగరంలో 61 శాతం చెరువులు మాయం అయ్యాయని.. ఇప్పటికైనా అప్రమత్తం కాకపోతే మిగతా 39 శాతం కూడా కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు.

## రూ. 100 కోట్ల పెండింగ్ బిల్లుల చెల్లింపునకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కృషి

**హైదరాబాద్, అక్టోబరు 24,ప్రభాతవార్త:** ఆర్ అండ్ బి చిన్న కాంట్రాక్టర్లకు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తీపి కబురు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో మాట్లాడి రూ.100 కోట్ల పెండింగ్ బిల్లుల పేమెంట్ కు కృషి చేసినట్లు మంత్రి తెలిపారు. మిగతా రూ. 50 కోట్ల పెండింగ్ బిల్లులు కూడా త్వరలో చెల్లిస్తామని హామీ కూడా ముఖ్యమంత్రి నుంచి తీసుకొన్నానని తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాం నుండి పెండింగ్ లో ఉన్న బిల్లులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న చిన్న కాంట్రాక్టర్లకు భరోసా ఇచ్చామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 11వేల కోట్లతో హ్యామ్ రోడ్లు నిర్మించబోతున్నామని ఆయన తెలిపారు. మొత్తం 32 ప్యాకేజీల్లో 400 రోడ్లు నిర్మిస్తామని అన్నారు.


## రహదారులపై భద్రతా చర్యలను బలోపేతం చేయాలి: గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, అక్టోబరు 24:** కర్నూలు జిల్లా కల్లూరు మండలం చిన్నటేకూరు వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో 20 మంది ప్రాణాలు కోల్పోయిన దుర్ఘటనపై రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ తన ప్రగాఢ విచారం వ్యక్తం చేశారు. మరణించిన వారి కుటుంబ సభ్యులకు తన సంతాపాన్ని తెలియజేసారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ఈ దారుణ ఘటన మన రహదారులపై భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని, ఇటువంటి విషాద సంఘటనలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని తెలియచేస్తుందని అభిప్రాయపడ్డారు.

## శబరిమలై బంగారాన్ని బళ్లారి నగల వ్యాపారికి విక్రయం!

సిట్ విచారణలో అంగీకరించిన ప్రధాన నిందితుడు ఉన్నికృష్ణన్

**తిరువనంతపురి, అక్టోబరు 24:** శబరిమల అయ్యప్ప దేవాలయంలోని బంగారు తాపడం కేసు కొత్త మలుపులు తిరుగుతోంది. ప్రత్యేక దర్యాప్తు బృందంసిట్‌ముందు తాపడాలనుంచి వేరుచేసిన బంగారాన్ని బళ్లారిలోని నగలవ్యాపారి గోవర్ధన్‌కు విక్రయించినట్లు ప్రధాన నిందితుడు ఉన్నికృష్ణన్ పొట్టి తనపై జరిగిన విచారణలో వెల్లడించాడు. అయితే ఈ విషయంపై విచారణ కోసం నగల వ్యాపారి గోవర్ధన్‌ను సిట్ తిరువనంతపురంలోని క్రైమ్ బ్రాంచ్ కార్యాలయానికి పిలిపించింది. ఆ విచారణలో ఉన్నికృష్ణన్ పొట్టి దేవస్థానానికి చెందిన బంగారాన్ని తనకు విక్రయించాడని గోవర్ధన్ అంగీకరించాడు. దీంతో కనిపించకుండా పోయిన దాదాపు 476 గ్రాముల బంగారాన్ని తిరిగి రికవరీ చేయాలని దర్యాప్తు బృందం నిర్ణయించింది. అమ్మిన బంగారాన్ని తిరిగి పొందడానికి సిట్ బృందం, ఉన్నికృష్ణన్ పొట్టిని బెంగళూరుకు తీసుకెళ్లింది. ఈ కేసులో సహ నిందితుడిగా ఉన్న దేవస్వం మాజీ పరిపాలన అధికారి బి.మురారి బాబు, 2019లో దేవస్థానం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా ఉన్న సమయంలో బంగారానికి బదులు రాగి అని నమోదు చేసినట్లు సిట్ గుర్తించింది. తిరువనంతపురంలోని క్రైమ్ బ్రాంచ్ కార్యాలయంలో సిట్ బృందం ఆయన్ను విచారించగా, ఉద్దేశపూర్వకంగా తాను అలా చేసినట్లు మురారి బాబు అంగీకరించాడు. దీంతో ఆయన్ను రన్నీ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ముందు హాజరుపరిచారు. 1998లో విగ్రహాలకు బంగారు పూత పూసినట్లు మురారి బాబుకు ముందే తెలుసునని దర్యాప్తు బృందం తమ నివేదికలో పేర్కొంది.




పిఎన్ఎం రాష్ట్ర 3వ మహాసభల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రమణాచారి, మారన్న, ఆనంద్, కళ్యాణ్ తదితరులు

## సమాజమార్పునకు నిస్వార్థంగా ప్రజానాట్యమండలి అంకితం

ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి

**హైదరాబాద్ (నాంపల్లి), అక్టోబరు 24, ప్రభాతవార్త :** సమాజమార్పుకు అహర్నిశలు పాటుపడుతూ తమ కోసం కాకుండా కేవలం సమాజం కోసమే అంకితమై పనిచేసే అసామాన్యులున్న సంస్థ ప్రజా నాట్యమండలి పిఎన్ఎం అని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అన్నారు. 2026 జనవరి 5 నుండి 7వ తేదీవరకు మూడురోజులపాటు రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ప్రజా నాట్యమండలి రాష్ట్ర 3వ మహాసభలు, జనం కోసం-జానపదం నినాదంతో జానపద ఉత్సవాలు నిర్వహించనుంది. ఈమేరకు సంబంధిత బ్రోచర్‌ను రెడ్‌హిల్స్‌లోని డా. కె.వి.రమణాచారి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరణ, ఆహ్వానసంఘ సన్నాహక సమావేశం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. కె.వి.రమణాచారి ఆహ్వాన సంఘంతో కలిసి బ్రోచర్‌ను ఆవిష్కరించి ప్రసంగించారు. సభకు స్వాగతం పలికిన పిఎన్ఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగటి మారన్న తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభలు-జానపద ఉత్సవాల ఆహ్వానసంఘాన్ని పరిచయం చేస్తూ ఛైర్మన్‌గా డా. కె.వి. రమణాచారి, అధ్యక్షుడుగా సినీహీరో డా. మాదాల రవి, ప్రధాన కార్యదర్శిగా ఎన్.మారన్న, కోశాధికారిగా పి.కళ్యాణ్, చీఫ్ ప్యాట్రన్స్‌గా డా. గోరటి వెం కన్న, దేశపతి శ్రీనివాస్, డా. వెన్నెల గద్దర్, ఆర్.నారాయణమూర్తి, తమ్మారెడ్డి భరద్వాజ్, కాసర్లశ్యామ్, ఆర్.రమేష్ తదితరులతోపాటు ప్యాట్ర న్స్, కార్యదర్శులు, గౌరవ సలహాదారుల పేర్లు, వివరాలు వెల్లడిం చారు. ప్రజానాట్యమండలి 2014లో తొలి మహాసభలు డా. కె.వి.రమణాచారి ఛైర్మన్‌గా విజయవంతంగా నిర్వహిం చామని, 3వ మహాసభలకు ఆయన ఛైర్మన్‌గా సహకారం అందిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వం
సాగునీటి పారుదల వలయం, నిజామాబాద్ జిల్లా
టెండర్ ప్రకటన
టెండర్ నోటీసు నం.20/2025-26 తేది: 22.10.2025 పనులకు గాను రూ.37.15 లక్షలకు అలిసాగర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం యొక్క స్టేజ్-II లోని పంపు నెం.4 మరమ్మతులు, పంపు నెం.1 యొక్క బేరింగ్ హౌస్ మరియు స్టేజ్-III యొక్క స్పేర్ షాఫ్ట్ నెం.5 తేది: 23.10.2025 నుండి 30.10.2025 వరకు టెండర్ ఆహ్వానించబడినది. మిగతా వివరాలకు https://tender.telangana.gov.in లో చూడగలరు.
సం/- పర్యవేక్షక అభియంత, సాగునీటి పారుదల వలయం, నిజామాబాద్ జిల్లా
DIPR.No.9667-PP/CL/Advt/1/2025-26, తేది: 24.10.2025

# 'మోగ్లీ' మంచి విజయాన్ని అందుకోవాలని కోరుకుంటున్నా సాంగ్ ఈవెంట్‌లో కీరవాణి

రోషన్ కనకాల, సాక్షి మడోల్కర్, సందీప్ రాజ్, టిజి విశ్వ ప్రసాద్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, మోగ్లీ 2025 ఫస్ట్ సింగిల్ సయ్యారే రిలీజ్‌బబుల్గమ్ తో సక్సెస్ ఫుల్ డెబ్యు చేసిన యంగ్ హీరో రోషన్ కనకాల తన సెకండ్ మూవీ 'మోగ్లీ 2025' తో వస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత, కలర్ ఫోటో ఫేమ్ సందీప్ రాజ్ దర్శకత్వంలో, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించిన మోగ్లీ 2025 అడవి నేపథ్యంలో యూనిక్ రొమాంటిక్ యాక్షన్ డ్రామా. ఈ సినిమా గ్లింప్స్ కు అద్భుతమైన స్పందన వచ్చింది. మేకర్స్ ఫస్ట్ సింగిల్ సయ్యారేను విడుదల చేసి మ్యూజిక్ జర్నీ ప్రారంభించారు. కాల భైరవ అందమైన ఆర్కెస్ట్రేషన్‌తో అద్భుతమైన ట్యూన్ ను కంపోజ్ చేశారు. ఆస్కార్ విన్నర్ చంద్ర బోస్ హార్ట్ టచ్చింగ్ లిరిక్స్ అందించారు. ఈ పాట చెవిటి, మూగ అమ్మాయి, సౌండ్ నిరోధించే డివైజ్ ని ధరించి తన వినికిడి సామర్థ్యాన్ని త్యాగం చేయడానికి నిర్ణయించుకున్న అబ్బాయి చుట్టూ తిరుగుతుంది. ఎమోషనల్ అతను ఆమెకు ఒక లేఖ రాస్తాడు, ఆమెను ప్రేమిస్తానని ప్రామిస్ చేస్తాడు. ఐశ్వర్య దారురితో కలసి కాల భైరవ స్వయంగా ఈ పాటకు సోల్ ఫుల్ వోకల్స్ అందించాడు. రోషన్ కనకాల మెచ్యూర్ పెర్ఫార్మెన్స్‌తో ఆకట్టుకున్నాడు. సాక్షి మడోల్కర్‌తో అతని ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీ ఎట్రాక్టివ్‌గా వుంది. అద్భుతమైన కంపోజిషన్,




అర్థవంతమైన సాహిత్యం, సోల్‌ఫుల్ వోకల్స్‌తో సయ్యారే సాంగ్ సినిమా మ్యూజిక్ జర్నీకి పర్ఫెక్ట్ బిగినింగ్. ఈ సినిమాలో బండి సరోజ్ కుమార్ విలన్ పాత్రలో నటించగా, హర్ష చెముడు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రానికి రామ మారుతి ఎం సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. స్క్రీన్ ప్లేను రామమారుతి ఎం, రాధాకృష్ణ రెడ్డి రాశారు. కోదాటి పవన్ కళ్యాణ్ ఎడిటర్‌గా, కిరణ్ మామిడి ఆర్ట్ డైరెక్టర్‌గా, నటరాజ్ మాదిగొండ యాక్షన్ సన్నివేశాలకు కొరియోగ్రఫీ అందిస్తున్నారు. మోగ్లీ 2025 డిసెంబర్ 12న థియేటర్లలో విడుదల కానుంది. సాంగ్‌లాంచ్ ఈవెంట్‌లో ఆస్కార్ విజేత ఎంఎం కీరవాణి మాట్లాడుతూ, కలర్ ఫోటో తర్వాత వచ్చిన అతి పెద్ద నిశ్శబ్దాన్ని శబ్దంగా మార్చబోతున్న సందీప్‌కి శుభాకాంక్షలు. విశ్వప్రసాద్ నాకు చిరకాల మిత్రులు. కాలభైరవ మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చుకోవాలని నాకు ఎప్పుడూ ఉంటుంది. కానీ ఈ వేడుకకి సుమతో ఉన్న ఆత్మీయ అనుబంధంతో రోషన్‌ని ఆశీర్వదించ డానికి వచ్చాను. సయ్యారే పాట చాలా బాగుంది. టీమ్ అందరికీ ఆల్ ది వెరీ బెస్ట్. నిర్మాత టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ, . రోషన్ తొలి సినిమా బబుల్ గమ్ మేం ప్రజెంట్ చేశాము. ఆ సమయంలోనే రోషన్ తో కలిసి మరో ప్రాజెక్ట్ చేయాలని అనుకున్నాము. ఈ సినిమా చాలా పెద్ద స్పాన్‌వుంటుంది. కంట్రోల్ బడ్జెట్లో క్వాలిటీ ఏమాత్రం మిస్ అవకుండా పెద్ద స్పాన్‌లో తీసిన సినిమా ఇది. ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్ లో ఉండే లవ్ స్టోరీ ఇది. తప్పకుండా మీ అందరికీ నచ్చుతుంది. హీరో రోషన్ కనకాల మాట్లాడుతూ, మీడియా మిత్రులకు నమస్కారం. మా ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా విచ్చేసిన కీరవాణికి ధన్యవాదాలు. ఆయన మా సాంగ్‌ని లంచ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. విశ్వ ప్రసాద్‌ఈ సినిమాని ఎక్కడ తగ్గకుండా చాలా ఘనంగా నిర్మించారు. మాకు సపోర్ట్ చేసిన ఆయనకి కృతజ్ఞతలు. కాలభైరవ ఈ పాటని చాలా ప్రేమతో కసితో చేశాడు. సందీప్ కాలభైరవ కాంబినేషన్ ఐదేళ్ల తర్వాత వస్తుంది. .చంద్రబోస్ తన లిరిక్స్ తో సినిమాకి పాటకి ప్రాణం పోశారు. సందీప్ అద్భుతంగా తీశారు. సాక్షి చాలా నేచురల్‌గా పెర్ఫామ్ చేసింది. హర్ష నేను మా ఇద్దరి కెమిస్ట్రీ అద్భుతంగా ఉండబోతుంది. ఈ సినిమాలో చాలా ఇంపార్టెంట్ రోల్ ప్లే చేసిన బండి సరోజ్‌కి ధన్యవాదాలు. డిసెంబర్ 12న సినిమా రిలీజ్ అవుతుంది. మీరు అంతా సినిమాని ప్రేమిస్తారని కోరుకుంటున్నాను. హీరోయిన్ సాక్షి మాట్లాడుతూ, మీ అందరిని కలుసుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఇది నా ఫస్ట్ సినిమా. నా లైఫ్ లో మెమొరబుల్ డే. ఇది నా డ్రీమ్ ప్రాజెక్ట్. సయ్యారే పాట నా మనసుకు చాలా దగ్గర అయింది. మా డైరెక్టర్‌కి, నిర్మాత విశ్వప్రసాద్‌కి హీరో రోషన్‌కి థాంక్యూ సో మచ్.


ప్రీతి ముకుందన్

# 'అఖండ2' బ్లాస్టింగ్ రోర్.. మరో గ్లింప్స్ రిలీజ్

గాడ్ ఆఫ్ ది మాసెస్ నందమూరి బాలకృష్ణ, బ్లాక్ బస్టర్ దర్శకుడు బోయపాటి శ్రీను పవర్ ఫుల్ కొలాబరేషన్ లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ డివైన్ యాక్షన్ ఎక్స్‌ట్రావగాంజా 'అఖండ 2: తాండవం'. ఇది వారి సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్ అఖండకు సీక్వెల్. రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఎం తేజస్విని నందమూరి సగర్వంగా చిత్రాన్ని సమర్పిస్తున్నారు.



ఇంటెన్స్ యాక్షన్ సీక్వెన్స్ ద్వారా లెజెండ్ అఖండ పాత్రను పరిచయం చేసిన ఫస్ట్ టీజర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. ఇప్పుడు బాలకృష్ణ మరో పాత్రను పరిచయం చేయడానికి మేకర్స్ అఖండ 2: బ్లాస్టింగ్ రోర్ టైటిల్ తో మరో ఎలక్ట్రిఫైయింగ్ గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఈ వీడియోలో బాలకృష్ణ పూర్తి స్థాయి మాస్ అవతార్‌లో హైవోల్టేజ్ యాక్షన్‌తో అదరగొట్టారు .బోయపాటి శ్రీను తన సిగ్నేచర్ స్టైల్‌లో బాలయ్యని లార్జర్ దెన్ లైఫ్ మూమెంట్స్‌తో అద్భుతంగా ప్రజెంట్ చేశారు. బాలయ్య గర్జన సింహంలా వినిపించగా, ఆయన డైలాగ్ డెలివరీ, యాక్షన్ బ్లాక్స్ అదిరిపోయాయి. చివర్లో ఆయనకాలు మోపగానే గుర్రాలు భయంతో దూకడం పక్కా మాస్ ఎలివేషన్. "సౌండ్ కంట్రోల్‌లో పెట్టుకో. ఏ సౌండ్‌కి నవ్వుతానో, ఏ సౌండ్‌కి నరుకుతానో నాకే తెలియదు. ఊహకి కూడా అందదు అని బాలకృష్ణ చెప్పిన డైలాగు గూజ్ బంప్స్ తెప్పించింది. రామ్‌లక్ష్మణ్ మాస్టర్‌ల యాక్షన్ కొరియోగ్రఫీ అద్భుతంగా ఉండగా, ఎస్. థమన్ అందించిన బిజిఎమ్ పవర్‌ఫుల్‌గా ఉంది. విజువల్స్, ప్రొడక్షన్ వాల్యూస్ అత్యున్నత స్థాయిలో వున్నాయి. ఈ కొత్త టీజర్‌తో, అఖండ 2: తాండవం కోసం అంచనాలు మరింత పెరిగాయి. ఈ చిత్రంలో సంయుక్త ముఖ్యపాత్రలో నటిస్తున్నారు. ఆది పినిశెట్టి ఓ పవర్ ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. హర్షాలి మల్హోత్రా కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి సి. రాంప్రసాద్, సంతోష్‌సినిమాటోగ్రఫీని నిర్వహిస్తుండగా, తమ్మిరాజు ఎడిటర్. ఎఎస్ ప్రకాష్ ఆర్ట్ డైరెక్టర్. పవర్ ఫుల్ టీం, భారీ అంచనాలతో రూపొందుతున్న 'అఖండ 2:తాండవం' డివైన్ యాక్షన్ ఎక్స్‌ట్రావగాంజాగా అలరించబోతోంది. అఖండ 2: తాండవం డిసెంబర్ 5, 2025న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. నటీనటులు: గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, సంయుక్త, ఆది పినిశెట్టి, హర్షాలి మల్హోత్రాసాంకేతిక సిబ్బంది:రచన, దర్శకత్వం: బోయపాటి శ్రీను, నిర్మాతలు: రామ్ ఆచంట, గోపి ఆచంటబ్యానర్: 14 రీల్స్ ప్లస్, సమర్పణ: ఎం తేజస్విని నందమూరి, సంగీతం: థమన్ ఎస్, డిఓపి: ది రాంప్రసాద్, సంతోష్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కోటి పరుచూరి, ఆర్ట్: ఏఎస్ ప్రకాష్, ఎడిటర్: తమ్మిరాజు, ఫైట్స్: రామ్‌లక్షణ్, పిఆర్ఓ వంశీశేఖర్, మార్కెటింగ్: ఫస్ట్ షో .

## 'సంతాన ప్రాప్తిరస్తు' చాందినీ చౌదరి బర్త్‌డే పోస్టర్ రిలీజ్



యూత్ ఫుల్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ "సంతాన ప్రాప్తిరస్తు" మూవీ నుంచి యంగ్ టాలెంటెడ్ హీరోయిన్ చాందినీ చౌదరి బర్త్ డే పోస్టర్ రిలీజ్, నవంబర్ 14న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతున్న సినిమాకలర్ ఫోటో, గామి వంటి పలు హిట్ చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకుంది యంగ్ టాలెంటెడ్ హీరోయిన్ చాందినీ చౌదరి. ఆమె హీరోయిన్‌గా నటిస్తున్న కొత్త మూవీ "సంతాన ప్రాప్తిరస్తు" యూత్ ఫుల్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో కల్యాణి ఒరుగంటి అనే క్యారెక్టర్ లో చాందినీ ఆకట్టుకోనుంది. ఈరోజు చాందినీ చౌదరి పుట్టినరోజు సందర్భంగా బర్త్ డే విశెస్ చెబుతూ ఓ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. పెళ్లి కూతురిగా ముస్తాబైన చాందినీ స్టిల్ తో డిజైన్ చేసిన ఈ పోస్టర్ ఆకట్టుకుంటోంది. విక్రాంత్ హీరోగా నటిస్తున్న "సంతాన ప్రాప్తిరస్తు" సినిమాను మధుర ఎంటర్ టైన్ మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్స్ పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు సంజీవ్ రెడ్డి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. రచయిత షేక్ దావూద్ జి ఈ సినిమాకు స్క్రీన్ ప్లే అందించారు. "సంతాన ప్రాప్తిరస్తు" సినిమా నవంబర్ 14న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. నటీనటులు: విక్రాంత్, చాందినీ చౌదరి, వెన్నెలకిషోర్, తరుణ్ భాస్కర్, అభినవ్‌గోమటం, మురళీధర్‌గౌడ్, హర్షవర్థన్, బిందు చంద్రమోళి, జీవన్‌కుమార్, సత్యకృష్ణ, తాగుబోతు రమేష్, అభయ్ బేతిగంటి, కిరీటి, అనీల్‌గేల, సద్దాం తదితరులు. టెక్నికల్ టీమ్ డైరెక్టర్: సంజీవ్‌రెడ్డి ప్రొడ్యూసర్స్ మధుర శ్రీధర్ రెడ్డి, నిర్విహరిప్రసాద్ రెడ్డిస్టోరీ, స్క్రీన్ ప్లే సంజీవ్ రెడ్డి, షేక్ దావూద్, మ్యూజిక్ డైరెక్టర్ సునీల్ కశ్యప్, బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ అజయ్ అరసాడ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఎ మధుసూదన్ రెడ్డి, సినిమాటోగ్రఫీ, మహిరెడ్డి పండుగుల డైలాగ్స్ కల్యాణ్ రాఘవ్‌కొరియోగ్రాఫర్ లక్ష్మీ కాళహస్తి కాస్ట్యూమ్ డిజైనర్స్ అశ్వత్ భైరి, కె ప్రతిభ రెడ్డి, ప్రొడక్షన్ డిజైనర్ శివకుమార్ మచ్చడిజిటల్ హౌస్‌ఫుల్ డిజిటల్ మార్కెటింగ్, ప్రమోషన్స్ కన్సల్టెంట్, విష్ణు కోమల్ల, లిరికల్ కంపోజిషన్ రైట్ క్లిక్ స్టూడియో.

# శ్రీలంకలో 'పెద్ది' సాంగ్ షూటింగ్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, జాన్వీకపూర్ 'పెద్ది' శ్రీలంకలో సాంగ్ షూటింగ్
మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హైలీ యాంటిసిపేటెడ్ రూరల్ యాక్షన్ డ్రామా 'పెద్ది' చిత్రీకరణ శరవేగంగా కొనసాగుతోంది. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్‌ను మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ ప్రతిష్టాత్మకంగా సమర్పిస్తున్నాయి. తాజాగా రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సానా, యూనిట్ సభ్యులు నెక్స్ షెడ్యూల్ కోసం శ్రీలంకకు బయలుదేరారు. రేపటి నుంచి ప్రారంభమయ్యే ఈ షెడ్యూల్‌లో అందమైన ప్రదేశాల్లో రామ్ చరణ్ – జాన్వీ కపూర్‌లపై ఒక అద్భుతమైన పాటను చిత్రీకరించనున్నారు. ఆస్కార్ అవార్డు విజేత ఏ.ఆర్. రహమాన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. బుచ్చిబాబు సానా అత్యంత ప్రెస్టీజియస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో రామ్ చరణ్‌ను పూర్తిగా కొత్త లుక్‌లో, ఇప్పటివరకూ ఎన్నడూ చూడని గెటప్‌లతో ప్రజెంట్ చేస్తున్నారు. రామ్‌చరణ్ ఈ పాత్ర కోసం కంప్లీట్ మేకోవర్స్ అవుతూ హై ఆక్టేన్ స్టంట్స్ చేయబోతున్నారు. కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ కీలక పాత్రలో నటిస్తుండగా, జగపతిబాబు, దివ్యేందు శర్మా ముఖ్యపాత్రల్లో కనిపించనున్నారు. టాప్ టెక్నీషియన్లు ఈ ప్రాజెక్ట్ కోసం పనిచేస్తున్నారు. సినిమాటోగ్రఫీ ఆర్. రత్నవేలు, నేషనల్ అవార్డు విన్నర్ నవీన్ నూలి ఎడిటర్, పెద్ది చిత్రం 2026 మార్చి 27న పాన్ ఇండియా స్థాయిలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కి సిద్ధమవుతోంది.
తారాగణం: గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్, జాన్వీకపూర్, శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందుశర్మ
సాంకేతిక సిబ్బంది:రచన, దర్శకత్వం: బుచ్చిబాబు సాన
సమర్పణ: మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్: వృద్ధి సినిమాస్
నిర్మాత: వెంకట సతీష్ కిలారు, సహ నిర్మాత ఇషాన్ సక్సేనా, సంగీతం: ఏఆర్ రెహమాన్ డిఓపి: ఆర్ రత్నవేలు, ప్రొడక్షన్ డిజైన్: అవినాష్ కొల్లా, ఎడిటర్: నవీన్ నూలి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వి.వై. ప్రవీణ్ కుమార్‌మార్కెటింగ్: ఫస్ట్ షో, పిఆర్ఓ: వంశీశేఖర్ .



# 'స్కై' సినిమా నుండి లిరికల్ సాంగ్ రిలీజ్



ఫీల్ గుడ్ రొమాంటిక్ ఎంటర్ టైనర్ 'స్కై'సినిమా నుంచి 'పోయేకాలం నీకు' లిరికల్ సాంగ్ రిలీజ్, త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతున్న మూవీ మురళీ కృష్ణంరాజు, శృతి శెట్టి, ఆనంద్ ప్రధాన పాత్రల్లో వేలార్ ఎంటర్ టైన్ మెంట్ స్టూడియోస్ బ్యానర్ పై నాగిరెడ్డి గుంటక, శ్రీలక్ష్మి గుంటక, మురళీ కృష్ణంరాజు, పృథ్వీ పెరిచర్ల నిర్మిస్తున్న సినిమా "స్కై". పృథ్వీ పెరిచర్ల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంతో శివ ప్రసాద్ అనే కొత్త మ్యూజిక్ డైరెక్టర్ ఇండస్ట్రీకి పరిచయమవుతున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటున్న "స్కై" సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. తాజాగా ఈ చిత్రం నుంచి 'పోయేకాలం నీకు..' అనే లిరికల్ సాంగ్ ను రిలీజ్ చేశారు. ఈ పాటకు పృథ్వీ పెరిచెర్ల లిరిక్స్ రాయగా, యదు కృష్ణన్, వల్లవన్ పాడారు. శివప్రసాద్ క్యాచీ ట్యూన్ తో కంపోజ్ చేశారు. 'పోయేకాలం నీకు..' పాట ఎలా ఉందో చూస్తే 'పోయేకాలం నీకు ముందుందని చెబుతుంటే, సచ్చిపోతున్నారు వినవే వినను అంటుంటే, రాంగే రైటై పోదని చెబుతూ నేను ఉంటున్నా, రైటే రైటంటు వేగంగా నువ్వు పోతున్నావ్, నీకోసం పోరి వస్తుంటే పో పో పోమ్మని తరిమేశావ్, చాల్లే నీకు నా గొడవే, ఎందుకు లే నన్ను వదిలేసెయ్. అంటూ సాగుతుంది పాట. "స్కై" చిత్రం నుంచి ఇప్పటికే రిలీజ్ చేసిన 'తపనే తెలుపగ.' సాంగ్ ప్రేక్షకాదరణ పొంది మిలియన్ వ్యూస్ రీచ్ అయింది, ఇప్పుడు ఈ పోయేకాలం నీకు.. సాంగ్‌కు కూడా మంచి రెస్పాన్స్ వస్తుందని మేకర్స్ బావిస్తున్నారు. నటీనటులు మురళీ కృష్ణంరాజు, శృతి శెట్టి, ఆనంద్ భారతి, రాకేశ్ మాస్టర్, ఎంఎస్, కేవల్ కే మణి బమ్మ, తదితరులు. టెక్నికల్ టీమ్: బ్యానర్ వేలార్ ఎంటర్‌టైన్‌మెంట్ స్టూడియోస్ స్క్రీన్ ప్లే, డైరెక్షన్ పృథ్వీ పెరిచెర్ల డీవోపీ రసూల్ ఎల్లోర్ తదితరులు.



రామ్ చరణ్, ఉపాసన కామినేని కొణిదెల వారి జీవితంలో మరో అందమైన అధ్యాయాన్ని ఆరంభించారు. ఈ జంట రెండోసారి తల్లిదండ్రులు కానున్నారు. త్వరలో ట్విన్స్‌కు (కవలలు) జన్మనివ్వనున్నారు. ఒక క్యూట్ వీడియోను పోస్ట్ చేసిన ఉపాసన.. ఈ దీపావళి మా జీవితంలో డబుల్ సెలబ్రేషన్, డబుల్ లవ్, డబుల్ బ్లెసింగ్స్‌తో ఆనందాన్ని రెట్టింపు చేసిందని ఈ గుడ్‌న్యూస్‌ను షేర్ చేశారు. ఉపాసన బేబీషవర్ వేడుక అద్భుతంగా జరిగింది. ప్రేమ, ఆనందం, కుటుంబ స్నేహం నిండిన ఆ క్షణాలు మెమరబుల్‌గా నిలిచాయి. బేబీ షవర్ వేడుక కుటుంబం, స్నేహితులు, సన్నిహిత వాతావరణంలో కన్నుల పండగలా జరిగింది. మెగాస్టార్ చిరంజీవి, నాగార్జున, వరుణ్ తేజ్ వంటి ప్రముఖులు ఈ వేడుకకు హాజరై తమ ఆశీర్వాదాలను అందించారు. ఉపాసన, రామ్‌చరణ్ కూమార్తె క్లిన్ కారా కొణిదెల జూన్ 20, 2023న జన్మించింది. ఇది వారి జీవితాల్లో ఒక కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. ఆమె పుట్టినప్పటి నుండి ఈ జంట తల్లిదండ్రుల గురించి, అది వారి బంధాన్ని ఎలా మరింతగా పెంచిందో, వారి జీవితాలకు కొత్త అర్థాన్ని జోడించిందో చెప్పారు. ఇప్పుడు కవలలు రాబోతున్నందున ఈ జంట తమ కుటుంబంలోకి ఇద్దరు కొత్త సభ్యులను స్వాగతించడానికి ఉత్సాహంగా ఉన్నారు. అభిమానులు కూడా ఈ కొత్త సంతోషాన్ని ఎంతో ఉత్సాహంగా స్వాగతిస్తున్నారు.

# త్వరలో ట్విన్స్‌కు జన్మనివ్వనున్న రామ్‌చరణ్ దంపతులు..

# ప్రొడక్షన్ నం.3లో హీరోయిన్‌గా నయన సారిక

కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీ విష్ణు, యదునాథ్ మారుతీ రావు, సుమంత్ నాయుడు .
ప్రొడక్షన్ నంబర్ 3 లో హీరోయిన్‌గా నయన్ సారిక


నయన సారిక

కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీ విష్ణు యూనిక్ అండ్ ఎక్సయిటింగ్ సబ్జెక్ట్స్ చేస్తూ ప్రతి సినిమాతో ప్రేక్షలకు అద్భుతమైన ఎంటర్‌టైన్‌మెంట్ అందిస్తున్నారు. ప్రస్తుతం కొత్త దర్శకుడు యదునాథ్ మారుతీ రావు దర్శకత్వంలో క్రేజీ ఎంటర్టైనర్ చేస్తున్నారు.
ఈ చిత్రాన్ని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నంబర్3గా సుమంత్ నాయుడు జి నిర్మిస్తుండగా హేమ షాలిని ఈ చిత్రాన్ని సమర్పిస్తారు, సుబ్రహ్మణ్యం నాయుడు జి, రామాచారి ఎంసహ నిర్మాతలు.
ఈ చిత్రం సక్సెస్ ఫుల్ హీరో శ్రీవిష్ణు సరసన నయన్‌సారిక హీరోయిన్‌గా నటించనున్నారని మేకర్స్ అనౌన్స్ చేశారు. ఆమెకు బర్త్ డే విషెష్ అందిస్తూ ఒక స్పెషల్ వీడియోని రివిల్ చేశారు. ఈ వీడియో చాలా ఎంటర్టైనింగ్‌గా వుంది.
ఈ చిత్రం ఒంగోలు పట్టణం నేపథ్యంలో సాగనుంది. ఈ క్రేజీ ఎంటర్‌టైనర్‌లో శ్రీవిష్ణు హిలేరియస్ క్యారెక్టర్‌లో కనిపిస్తారు. తన సిగ్నేచర్ చార్మ్‌తో అలరించనున్నారు.
ఈ చిత్రంలో సత్య, బ్రహ్మాజీ, ప్రవీణ్, శ్రీకాంత్ అయ్యంగార్, గోపరాజు రమణ, ప్రమోదిని కీలక పాత్రల్లో నటించారు. స్టార్ టెక్నిషియన్స్ ఈసినిమాని పని చేస్తున్నారు. సాయి శ్రీరామ్, డీవోపీ కాగా రధన్ సంగీతం సమకూరుస్తారు. ఎ రామాంజనేయులు ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తారు.
తారాగణం: శ్రీవిష్ణు, నయన్ సారిక, సత్య, బ్రహ్మాజీ, ప్రవీణ్, శ్రీకాంత్ అయ్యంగార్, గోపరాజు రమణ, ప్రమోదిని, సాంకేతిక సిబ్బంది:
రచన, దర్శకత్వం: యదునాథ్, మారుతీరావు,
ప్రొడక్షన్ హౌస్: శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్, నిర్మాత: సుమంత్ నాయుడు
జి. సహనిర్మాతలు: సుబ్రమణ్యం నాయుడు. జి. రామాచారి ఎం
డీవోపీ: సాయి శ్రీరామ్,
సంగీతం: రధన్, ఆర్ట్ డైరెక్టర్: ఎ. రామాంజనేయులు, లిరిక్స్: రామజోగయ్య శాస్త్రి, కొరియోగ్రఫీ: భాను మాస్టర్
పీఆర్వో: వంశీశేఖర్.

# నాగుల చవితి

నాగుల చవితి ఆచా రించడానికి ఒక శుభదినం. కార్తీక మాసంలో దీపావళి అమావాస్య తర్వాత నాల్గవ రోజు (చతుర్థి) నాగుల చవితి జరుపుకుంటారు. నాగ చతుర్థి తర్వాత నాగ పంచమి మరియు నాగశష్ఠి జరుపుకుంటారు. కొన్ని ప్రాంతాలలో శ్రావణ మాసంలో కూడా జరుపు కుంటారు. నాగుల చవితి, నాగదేవతలను (సర్పదేవతలు) ఆరాధించే పండుగ, ప్రాధానంగా మహిళల పండుగ,నాగుల చవితిని వివాహితడ స్త్రీలు తమ పిల్లల క్షేమం కోసం జరుపుకుంటారు. చవితి పండుగ సందర్భంగా మహిళలు ఉపవాసం ఉండి నాగపూజను ఆచారిస్తారు. భక్తులు వల్మీకం లేదా పట్టు (పాముల గుంటలు) వద్ద సర్ప దేవతకు పాలు మరియు డ్రై ఫ్రూట్స్ సమర్పిసారు. నాగ చతుర్థి రోజున అష్టనాగ్ (ఎనిమిది హుడ్డ్ కోబ్రా) పూజిస్తారు. కొంతమంది ఇంట్లో నాగదేవత విగ్రహం పెట్టి పూజలు చేస్తారు. కానీ కొన్ని ప్రదేశాలలో భక్తులు పుట్ట వద్దకు వెళ్లి నైవేద్యమం సమర్పించి ఇతర పూజలు చేస్తారు. పాలు, కుంకుమ, పసుపు, విభూతి, బెల్లం మరియు నల్లనువ్వుల మిశ్రమంంతో చేసిన తీపి పదార్థాలతో మరియు బెల్లం మరియు తెల్ల నువ్వులు, ఉడకబెట్టిని మిశ్రమంతో తయారు చేసిన పుట్టలను లేదా చీమల కొండలకు ప్రజలు పూజ చేస్తారు. బియ్యం మరియు నల్ల నువ్వులు మరియు చివరకు గుడ్లు ప్రజలు ఈ వస్తువులను చీమల కొండలో వేస్తారు. నైవేద్యాలు ముగించిన తరవాత, ప్రజలు పుట్ట నుంచి కొంచెం మట్టిన తీసుకొని చెవుల వెనుక పెట్టుకుంటారు. నాగులు చవితి జరుపుకోవడం వల్ల వారి ఇంటి మరియు కుటుంబ జీవితంలో అన్ని ఒత్తిడులు తొలగిపోతాయని ప్రజలు నమ్ము తారు. ప్రజలు సాధారణంగా దేవాలయాలలో ఉన్న పుట్టకు లేదా వారి ప్రాంతంలో ఉననన పుట్టుకు మరే ఇతర ప్రదేశంలోనైనా ఈ ఆచారాలను చేస్తారు. □



# ఆత్మవిశ్వాసం నిండుగా..



**ఆకాశం అందరిదీ.. ప్రతి ఒక్కరూ దాన్ని అందుకోవచ్చు. ఇప్పుడంటే భారత రక్షణ రంగంలో చేరే అమ్మాయిల సంఖ్య పెరుగుతోంది.. కానీ రెండు దశాబ్దాలకు పూర్వం పరిస్థితులు లేవు ఉండేవి. ఈ రంగం అమ్మాయిలకు ఏమాత్రం సరిపడదన్న భావన చాలామందిలో ఉండేది. ఇలాంటి మూసధోరణులను బద్దలుకొట్టి సైన్యంలోకి అడుగుపెట్టింది సునీత పహాల్. ఎవరి మాటలు పట్టించుకోకుండా తన మనసు మాటే విన్న ఆమె.. భారత వాయుసేనలో సాధారణ ఉద్యోగి మొదలు వింగ్ కమాండర్ స్థాయికి ఎదిగింది. ఈ ప్రయాణంలో ఆమెకు ఎన్నో కష్టాలు, సవాళ్లు స్వాగతం పలికాయి. అయినా వెరవక, నిండైన ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగిన సునీత.. దాదాపు 14 ఏళ్ల పాటు రక్షణ రంగంలో సేవలందించింది. ఆకాశం అందరిదీ. దాన్ని అందుకొనే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందంటోన్న ఈ డేరింగ్ లేడీ గురించి తెలుసుకుందాం..!**

సునీతది హరియాణాలోని దతౌలీ అనే చిన్న గ్రామం. ఆమెకు నలుగురు అక్కచెల్లెళ్లు, ఒక సోదరుడు. ఆడపిల్లలపై ఆశలు ఎక్కువగా ఉండే ప్రాంతం కావడంతో అమ్మాయిల చదువు, ఉద్యోగాల దిశగా ప్రోత్సహించే వారు కాదు. అయినా సునీత తల్లిదండ్రులు తమ ఐదుగురు కూతుళ్లు, కొడుకుని సమానంగా పెంచారు. నచ్చిన రంగాల్లో వారిని ప్రోత్సహించారు. ఈ విషయంలో తానెంతో అదృష్టవంతురాలినంటోంది సునీత.

**రక్షణ రంగమా?** వద్దన్నారు! చదువుకోవాలి, అందరిలా ఏదో ఒక ఉద్యోగం చేయాలి. అన్న మనస్తత్వం కాదు సునీతది. తాను ఎంచుకొనే కెరీర్‌తో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించు కోవాలనుకునేది. అయితే తనకు 13 ఏళ్లున్నప్పుడు కార్గిల్ యుద్ధం జరిగింది. ఈ దృశ్యాలను టీవీలో చూసిన ఆమె.. తానూ అలాంటి ఓ సైనికురాలు కావాలనుకున్నట్లు చెబుతోంది. చేసు 1999లో కార్గిల్ యుద్ధం జరిగిన ఆ క్షణాలు, టీవీలో నేను చూసిన ఆ యుద్ధం తాలూకు కొన్ని ఘటనలు నాకు ఇప్పటికీ గుర్తు. వాటి స్ఫూర్తితోనే రక్షణ రంగంలో చేరాలనుకున్నా. ఇందుకు మా అమ్మానాన్నలూ సరేనన్నారు. కానీ ఇరుగుపొరుగు వారు, బంధువులు మాత్రం.. 'మిలిటరీ అమ్మాయిల కోసం= కాదు.. అబ్బాయిలకు మాత్రమే సొంతమైన రంగం. అమ్మాయిలు ఇందులో రాణించలేరు. ఈ రంగంలో చేరితే నిన్ను ఎవరూ పెళ్లి చేసుకోరు..' అంటూ తమ మాటలతో నిరుత్సాహపరిచేవారు. ఇక మా నాన్నతో కూడా అమ్మాయిల చదువు కోసం ఎందుకు డబ్బు వృథా చేస్తారు..? అనేవారు. అయినా ఇవేవీ పట్టించుకోకుండా నేను రక్షణ రంగంలోకి రావడానికే నిర్ణయించుకున్నా అమ్మా నాన్నలూ నన్ను ఈ దిశగా ప్రోత్సహించారు.. అంటోంది సునీత.

**రాత్రుల్లు ఏడ్చేదాన్ని!** .. కంప్యూటర్ ఇంజినీరింగ్ పూర్తిచేశాక ఎయిర్‌ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్ (ఎఎఫ్‌సిఎటి) పరీక్ష రాసిన సునీత.. 'సెలక్షన్ బోర్డ్ (ఎస్‌ఎస్‌బి)' ఇంటర్వ్యూలోనూ ప్రతిభ కనబరచింది. ఇలా కోచింగ్ లేకుండానే తొలి ప్రయత్నంలోనే పరీక్షలో ఉత్తీర్ణత సాధించి.. శిక్షణ కోసం హైదరాబాద్‌లోని ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో చేరింది. అంతకుముందు నేను అథ్లెట్ను కాదు. జిమ్‌లో చెమటోడ్చిన అనుభవమూ నాకు లేదు. ఎయిర్‌ఫోర్స్ శిక్షణ నాకు కత్తి మీద సాములా అనిపించేది. ట్రైనింగ్‌లో భాగంగా.. రోజూ 10 కిలోమీటర్లు పరిగెత్తడం, గంటల తరబడి డ్రిల్లింగ్ చేయడం, ఎర్రటి ఎండలో కసరత్తులు చేయడం.. ఇవన్నీ ఎంతో కష్టంగా అనిపించేవి. ఒక్కోసారి ఇక నా వల్ల కాదు.. అంటూ రాత్రులు ఏడ్చేదాన్ని. కానీ ఉదయం కల్లా నా మనసు మారిపోయేది. ఎంత కష్టమైనా శిక్షణ పూర్తిచేసే తీరతా అన్న సంకల్పంతో ముందుకు సాగేదాన్ని. ఈ పట్టుదలే విజయ వంతంగా శిక్షణ పూర్తి చేసుకొని విధుల్లో చేరేలా చేసిందం టోంది సునీత.

**300 మందిలో నేనే ఫస్ట్!....** శిక్షణ పూర్తిచేసుకొని 2008లో అసోం తేజ్ పూర్‌లోని ఫైటర్ బేస్‌లో తొలి పోస్టింగ్ అందుకున్న సునీత.. తన ప్రతిభతో తక్కువ సమయంలోనే పురుషుల బృందానికి నాయకత్వం వహించే స్థాయికి ఎదిగింది. చూడండి అటు విధులు నిర్వర్తిస్తూనే ఇటు నాయకత్వ లక్షణాలూ ఒంట బట్టించుకున్నా.. మరోవైపు యుద్ధ నిర్వహణ, విపత్తు సమయంలో చాకచక్యంగా వ్యవహరించడం.. వంటి నైపుణ్యాలు నేర్చుకున్నా. ఈ కావాలినే 'కమెండేషన్' అందుకుంది. బ్యాచ్ మొత్తం 300 మంది ఆఫీసర్లుంటే. వాళ్లలో ఈ పురస్కారం అందుకున్న తొలి వ్యక్తిని నేనే! ఇక్కడ స్త్రీపురుష భేదాలుండవు.. అడవులు, ఎడారులు అన్న తేడా లేకుండా పురుషులతో సమానంగా మేమూ విధులు నిర్వర్తించేవాళ్లం.. అంటారు సునీత.

**టెకీగామా..!** 2021లో వైమానిక దళ వింగ్ కమాండర్‌గా పదోన్నతి పొందిన సునీత.. 2022 డిసెంబర్ వరకు ఈ పదవిలో కొనసాగి ఆపై పదవీ విరమణ చేశారు. ఇలా సుమారు 14 ఏళ్ల పాటు దేశానికి సేవలందించారామె. ఆ తర్వాత మరో కెరీర్‌ను ఎంచుకొని ముందుకు సాగుతున్నారు. సునీత.

"రక్షణ రంగంలో పనిచేసి రిటైరయ్యాను కదా.. ఇక విశ్రాంతి తీసుకోవాలి అన్న ఆలోచన నాకు ఎప్పుడూ రాలేదు. కొత్త విషయాలు తెలుసుకోవాలన్న ఆసక్తి నాకు ఎక్కువ. మక్కువే నేను 2022లో ఓ ఐటీ సంస్థలో చేరేలా చేసింది. ఇక్కడా నాయకత్వ బాధ్యతలు నిర్వర్తిస్తూ నా సహోద్యోగులను ప్రోత్సహిస్తున్నాను. ఒకప్పుడు నీ కూతుళ్లకు చదువెందుకు అని మా నాన్నను ప్రశ్నించిన వారే ఇప్పుడు 'నీ కూతుళ్లు భేష్' అని ప్రశంసిస్తుంటే మా నాన్న ఎంతో హ్యాపీగా ఫీలవుతారు. అది చూసి నా మనసులోనూ ఆనందం ఉప్పొంగుతుంది. కాబట్టి అబ్బాయిలకే పరిమితమైన రంగమంటూ ఏది లేదు. మనసులో సంకల్పం ఉంటే చాలు.. ఏ రంగంలోనైనా రాణించచ్చు. ఆకాశం అందరిదీ. దాన్ని అందుకోవడానికి ప్రయత్నించే కూతుళ్లను నిరాశపరచకుండా.. ప్రోత్సహించే బాధ్యత తల్లిదండ్రులందరికీ ఉంది.. అంటూ తన మాటలతో నేటి యువతలో స్ఫూర్తి నింపుతున్నారు సునీత. □

# తళుకుల టిష్యూ చీరెలు

ఫ్యాషన్ ఫ్యాషన్









చీర కట్టమంటే ఓల్డ్ ఫ్యాషన్ అన్న నిన్నటి అమ్మాయిల తరం కాదు... దానితోనే ఫ్యాషన్ కల మీద కూడా తమ స్టైల్ స్టేట్మెంట్ని చూపించే జెంజల కాలమిది. అందుకే, ఆధునికంగా ఉండే ఆడపిల్లలు సైతం తమ అందాన్ని రెట్టింపు చేసేది చీరేనని అమ్ముతున్నారు. కట్టుకునేందుకు ప్రాధాన్యమిస్తున్నారు. వారిని మెరిపించేందుకు, మెప్పించేందుకూ బిందువులు ఎన్నెన్నో ప్రయోగాలు చేస్తున్నారు. వాటిలో ఇప్పుడు టిష్యూ చీర ట్రెండింగ్‌లోకి వచ్చాయి. బనారస్, ఆర్గాంజ, క్రేప్, సిల్క్.. ఇలా అన్నిరకాల వస్త్రాల్లోనూ ఇమిడిపోయిన టిష్యూ తళుకులు... కట్టుకున్న వారికి కొత్తదనాన్ని తెచ్చి పెడుతున్నారు. అందుకే, సినీతారల నుంచి సాధారణ యువతల వరకూ అందరూ వీటికి జైకొడుతున్నారు. అలాగని బంగారు, వెండి రంగులకే ఈ స్టైల్ పరిమితమవ్వలేదు. ఇవి వర్ణాల్లోనూ చేశారు. సందర్భం ఏదైనా అందరిలోనూ మిమ్మల్ని ప్రత్యేకంగా నిలబెడుతుంది.

# మీల్ మేకర్ వడలు



**కావలసిన పదార్థాలు:** సోయా గ్రాన్యూల్స్ (మీల్ మేకర్స్): ఒక కప్పు, ఉల్లిగడ్డ: ఒకటి, పచ్చిమిర్చి: నాలుగు, అల్లం: అంగుళం ముక్క, వెల్లుల్లి రెబ్బలు: ఐదు, కరివేపాకు: రెండు రెబ్బలు, నూనె: వేయించడానికి సరిపడా, ఉప్పు: తగినంత, కొత్తిమీర తురుము: కొద్దిగా, శనగపప్పు: పావు కప్పు, శనగపిండి: రెండు టేబుల్ స్పూన్లు, కార్న్‌ఫ్లోర్: ఒక టేబుల్ స్పూన్, ధనియాలు: ఒక టీ స్పూన్, జీలకర్ర: ఒక టీస్పూన్, దాల్చిన చెక్క: అంగుళం, లవంగాలు: ఆరు.

**తయారీ విధానం:** సోయా గ్రాన్యూల్స్‌లో కొద్దిగా ఉప్పువేసి, వేడినీళ్లు పోసి గంటపాటు నానబెట్టి గట్టిగా పిండుకోవాలి. ధనియాలు, దాల్చిన చెక్క, లవంగాలు బరకగా పొడి చేసుకోవాలి. ఒక గిన్నెలో సోయా గ్రాన్యూల్స్, తరిగిన ఉల్లి, పచ్చిమిర్చి, కరివేపాకు, నానబెట్టిన శనగపప్పు, తరిగిన అల్లం, వెల్లుల్లి, కొత్తిమీర, ఉప్పు, జీలకర్ర, మసాలా పొడి వేసి బాగా కలిపి ..శనగ పిండి, కార్న్‌ఫ్లోర్ వేసి కొద్దిగా నీళ్లు చల్లి గట్టి ముద్దలా కలుపుకోవాలి. స్టవ్‌మీద కడాయి పెట్టి వేయించడానికి సరిపడా నూనె పోసుకుని, బాగా వేడయ్యాక మిశ్రమాన్ని కొద్దికొద్దిగా తీసుకుని అరచేతిలో ఒత్తుకుని వడలు వేసుకుంటే కరకరలాడే మీల్‌మేకర్ మసాలా వడలు సిద్ధం. □

# అవిసె ఆకు ప్రయోజనం

ఆరోగ్య భాగ్యం



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

అవిసెఆకు ఒక ఆకుకూర. ఇది గ్రామాల్లో ఎక్కువగా పెరిగే పెరటి మొక్క. దీన్ని తమలపాకులు, మిరియాల తీగల్ని పైకి ప్రాకించడం కొరకు వాడుతారు. ఈ చిన్న వృక్షం ఏపుగా పెరుగుతుంది. దీనికి కొమ్మలుండవు. ఇది మునగచెట్టుని పోలి ఉంటుంది. ఆకులు చింతాకు కంటే పెదవిగా ఉంటాయి. ఆకులు చేదు, వగరుగా ఉండి వండిన తర్వాత మధురంగా ఉంటుంది. అగస్త్య నక్షత్రం ఎంత కాలం కనిపిస్తుంటుందో అంతకాలం పూతపూస్తూనే ఉంటుంది. పూత తెల్లగా ఉండి చిక్కుడు పూతని పోలి ఉంటుంది. దీని పువ్వులు అర్థచంద్రాకారంలో ఉండి ముద్దవలె ఉంటాయి. పువ్వులు తెలుపు, ఎరుపు, నలుపు పసుపు రంగులో ఉంటాయి. పువ్వుల రకాల్ని బట్టి నాల్గు రకాల చెట్టుంటాయి. వీటిలో ఎర్ర రంగు పువ్వులున్న చెట్టు శ్రేష్టమైనది. దీని కాయలు అలసందకాయల వలె పొడవుగ ఉంటాయి. అవిసె చెట్టు గింజలు చిక్కుడు గింజల ఆకారంలో ఉంటాయి.

అగస్త్య మహర్షి వివరించడం వల్ల దీన్ని అగస్తా, అగతి, అగసె, అగత్తి, అత్తి, అగిసెచెట్టు, ఉమా, అగధీకీర్తె, మసినా, అగస్తియా, అతసీ, అగస్త్య, హతియా, ఆగథియా, అగస్తా మునిపుష్ప, మునిదృమ అని వివిధపేర్లతో పిలుస్తారు. ఇది ఆస్ట్రేలియా, ఆగ్నేషియాకు చెందిన చిన్న పప్పుధాన్యం చెట్టు అదుకే దీన్ని ఆస్ట్రేలియన్ కార్క్‌ఉడ్ ట్రీ, వెస్ట్ ఇండియన్ బఠానీ వెజిటబుల్ హమ్మింగ్ బర్డ్‌గా సూచిస్తారు. ఇది వేడి తేమతో కూడిన వాతావరనం ఉన్నచోట పెరగడం వల్ల ఆగష్టు ఫవర్, సెస్‌బాన్ వైట్ డ్రాగన్ ట్రీ, స్కార్లెట్ లిస్టీరియా నట్రీ, కతురై, అగటి అని అంటారు. అవిసె గింజల్ని మదనగింజలు ఉలుసులు, అతశి అని అంటారు. అవిసె చెట్టు, శాస్త్రీయ నామం సెస్బానియా గ్రాండిఫ్లోరా ఇది లెగూమినేసియే (చిక్కుడు) కుటుంబానికి చెందినది. **పోషకవిలువలు:** 100 గ్రాముల అవిసె ఆకులో ఉన్న పోషకాలు: **కేలరీలు:** 321 కిలో కేలరీలు ప్రోటీన్స్:8.4గ్రా, కార్బొహైడ్రేట్స్:11.8గ్రా. క్రొవ్వు: 3.1 గ్రా, ఫైబర్: 2.2గ్రా. కాల్షియం: 1.130 ఎం.జి. ఫాస్పరస్: 80మిగ్రా. ఐరన్: 3.9 మిగ్రా. కెరొటిన్:5,400 గ్రా. మిటమిన్ సి: 169 మి.గ్రా నియాసిన్: 1.2 మి.నరగా. మినరల్స్: 3.1 గ్రా. **అవిసెపూలులోని పోషకాలు :** ప్రోటీన్స్: 1%, కార్బోహైడ్రేట్స్: 7% నీరు: 92%, కేలరీలు : 27 కిలోకేలరీలు, విటమిన్ సి: 88% ఫోలేట్స్: 26% **ఆరోగ్య ప్రయోజనాలు :** ఒక కప్పు అవిసాకులోని కాల్షియం 10 కప్పుల పాలు, అరకిలో మాంసంతో సమానం. దీనివల్ల నడుంనొప్పి, కీళ్లనొప్పులు, వాపులు, ఆస్టియోఫోరోసిస్, అర్థ్రయిటిస్, గౌట్ వ్యాధులు తగ్గుతాయి. ఎముకల పుష్టికి ఎముకలోని మినరల్స్ సాంద్రతకి మంచిది. పిల్లల్లో దంతక్షయం, పళ్ళుకొరికే అలవాటుని తగ్గిస్తుంది. **ఇమ్యూనిటీ :** రోగనిరోధక శక్తిని పెంపొదించి శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌ని తగ్గించి కీమోప్రొటెక్టివ్‌గా పనిచేస్తుంది ఇది. గవద బిళ్లలవాపుకి, మలేరియా వంటి ఇంటర్‌మిటెంట్ జ్వరాలకి స్మాల్‌పాక్స్, క్షయ, అంటువ్యాధులు రాకుండా బలమైన ఆంటిబాక్టీరియల్, ఆంటి మైనక్రోబియల్ లక్షణాల్ని కల్గి ఉంటుంది. తరుచుగా జలుబు, అసట, నీరసంతో బాధ పడేవారికిది మంచిది ఇది క్రానిక్ టాక్సిసిటీ, లివర్, స్లీన్‌డిస్ ఆర్డర్స్‌కి మంచిది. **కన్ను** అవిసాకులోని అధిక విటమిన్ 'ఎ' ఉండడం వల్ల రేచీకటి, కార్నియల్ అల్సర్స్, శుక్లాలు దృష్టిలోపాలు కళ్ళ మసకలు, కళ్ళు ఎర్రబడిన, కళ్ళు నీరుకారినా, వేడి చేసిన, ఐ స్ట్రెయిన్ ఉన్నప్పుడు అవిసాకు మంచిది. ఒక కప్పు అవిశాకులో 20 కప్పుల పాలు, 6 కిలోల మాంసంకు సరిపడే విటమిన్ 'ఎ' పుష్కలంగా ఉంది.

**జీర్ణశక్తి:** దీనివల్ల ఆహారం త్వరగా జీర్ణం అవుతుంది. కడుపునొప్పి, అల్సరేటివ్ కొలైటిస్ మలబద్ధకం, ఎసిడిటీ, జిగట విరేచనాలు, గ్యాస్ ట్రబుల్, కడుపులో గడ్డలు (ట్యూమర్స్), అతిసారం ఇన్‌ఫ్లమేటరీ డిసీజెస్, నులిపరుగులు వంటి జీర్ణకోశ సమస్యలు తగ్గిపోతాయి. ఇది విరేచనకారి ఇది విరేచనంలో స్రవించే రక్తరిజీరాల్ని తగ్గిస్తుంది. **డయాబెటీస్:** ఇది డయాబెటిక్ రోగుల్లో షుగర్‌స్థాయిల్ని నియంనరతిస్తుంది. ఇది పాంక్రియాజ్‌లోని డ్యామేజ్ అయిన కణాల్ని, హెచ్‌బి ఎ1సి లెవల్స్‌ని కంట్రోల్ చేస్తుంది. ఇది నీరసం, అలసటని తగ్గిస్తుంది. **కిడ్నీ :** దీనికి కిడ్నీ సమస్యల్ని తగ్గించే గుణం ఉంది. కిడ్నీలు పాడైనవారు తీసుకుంటే తిరిగి సాధారణ స్థితికి చేరుకుంటాయి. కిడ్నీస్టోన్స్ తగ్గుతాయి ఇది మూత్రం సాఫీగా జారీ అయ్యేలా

# చర్మం ప్రకాశవంతంగా..



ముఖం కడుక్కున్నా వాటి అవశేషాలు ఇంకా ఆ రంధ్రాల్లోనే ఉండి పోతాయి. అత్య వసర మెరవాలన్నా, నిర్జీవమైపోయిన చర్మాన్ని తిరిగి పునరుత్తేజితం చేయాలన్నా అది శరీరంలో రక్తప్రసరణ సరిగ్గా జరగడం వల్లనే సాధ్యమవుతుంది. అందుకు చాక్లెట్ మసాజ్ చక్కగా తోడ్పడుతుంది. స్పా ట్రీట్‌మెంట్లలో భాగంగా చేస్తే ఈ మసాజ్‌లో డార్క్ చాక్లెట్‌తో పాటు ఏదో ఒక అత్యవసర నూనె కూడా కలుపుతారు. ఈ మిశ్రమంతో శరీరమంతా మర్దన చేయడం ద్వారా శరీరంలోని అవయవాలన్నిటికీ రక్తప్రసరణ సరిగ్గా జరుగుతుంది. చర్మం ప్రకాశవంతంగా మారుతుంది. అంతేకాదు.. చాక్లెట్‌లోని కొకో శరీరంలో ఎండార్ఫిన్‌లను విడుదల చేస్తుంది. అవి చర్మం కింద దాగున్న కొవ్వుల్ని కరిగించడంలో సహకరిస్తాయి. ప్రత్యేకించి పొడిబారిపోయి నిర్జీవమైన శరీరాన్ని తిరిగి పునరుత్తేజితం చేయడానికి, కండరాల నొప్పులను తగ్గించడానికి కూడా ఈ మసాజ్ చక్కగా ఉపయోగపడుతుంది. అలాగే ఇలా మసాజ్ చేస్తే మానసిక ప్రశాంతత చేకూరడంతో పాటు శరీరానికి వెచ్చదనం కూడా లభిస్తుంది. మలినాల్ని తొలగించడానికి.. వాతావరణంలోని దుమ్ము, దూళి చర్మపు రంధ్రాలలో చేరిపోయి మొటిమలు, మచ్చలు ఏర్పడుతుంటాయి. మనం ఎంతగా రుద్ది నూనెలతో మసాజ్ చేయించుకోవడం వల్ల అవి తొలిగే అవ కాశం ఉంటుంది. ఇలా చేయడం వల్ల చర్మపు రంధ్రాల్లో ఇరుక్కుపోయిన దుమ్ము, ధూళి అవశేషాలు మెత్తబడి త్వరగా పోయే అవకాశం ఉంటుంది. అంతే కాదు.. ఇలా చేయడం వల్ల కీళ్ల నొప్పులు, కండరాల నొప్పుల నుంచి కూడా ఉపశమనం లభించే అవకాశం ఉంటుంది. మర్దన చేసే శరీరానికి వెచ్చ దనం కూడా లభిస్తుంది. మనసుకూ హాయిగా ఉంటుంది. □

# జాబ్ మారిపోతున్నారు !



ఒకప్పుడు ఒక సంస్థలో ఉద్యోగం వచ్చిందంటే చాలావరకూ జీవితాంతం కొనసాగేవారు. మరీ తప్పనిసరి అయితే తప్ప మారేవారు కాదు. కానీ ఇప్పుడలా కాదు. ముఖ్యంగా జెన్‌జీలు అయితే మంచి అవకాశం అనిపిస్తే నెలల వ్యవధిలోనే సంస్థను వీడుతున్నారు. వీళ్లలోనూ అమ్మాయిలే ఎక్కువ జీతం ఇస్తున్నా... ప్రస్తుతం ఉన్న సంస్థలో మెరుగైన అవకాశాలు దొరుకుతున్నా... వర్క్ లైఫ్ బ్యాలెన్స్ దొరుకుతుందన్నా మొహమాటం లేకుండా కొత్త సంస్థకు వెళ్లిపోతున్నారు. పైగా ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు అని సమాధానమిస్తున్నారు. కోరుకున్న సౌకర్యాలకు తగ్గట్టుగా సంపాదించు కోవాలి అనుకోవడం, ముందు నుంచే ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వడం, బాధ్యతలు పెరిగే సమయానికి సిద్ధంగా ఉండటం... ఇలా ఎన్నో ఆలోచనలతో ఇలా మారుతున్నారట. అంతేకాదు. వివక్ష, శృంగార వేధింపులు వంటివాటినీ పంటి బిగువన భరిస్తూ కొనసాగడం ఇష్టం లేక కూడా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం. ఇదీమధ్య ట్రెండ్ కూడా అవుతోంది. అన్నట్టు దీనికో పేరూ ఉంది. అదే ఆఫీస్ ప్రాగింగ్. అయితే ఎంతసేపూ జీతం ఎంత ఎక్కువ అనేదే చూడొద్దు అంటున్నారు నిపుణులు, కెరియర్లో ఎదిగే అవకాశముందా అంటే చూసు కోమంటు న్నారు. అలాగే వీడిన సంస్థ గురించి నెగెటివ్‌గా ఆలోచించడం, చెడుగా చెప్పడం వంటివీ చేయొద్దు అంటున్నారు. మరి... గమనించుకుంటారుగా! □

# నూనె మరకలు మాయం..



సెర్క్

తాలింపు వేసేటప్పుడు ఎంత జాగ్రత్తగా ఉన్నా చుట్టూ నూనె చిందుతుంది. గారెలు, బూరెల్లాంటి ఎండి వంటల సంగతి ప్రత్యేకంగా చెప్పాల్సిందే. ఇలా తరచూ చిందే నూనె మీద దుమ్ము చేరితే ఒకపట్టాన వదలదు. శుభ్రం చేయాలంటే మహా కష్టం. ఈ సమస్యకి పరిష్కారంగా వచ్చింది గ్రీజ్ సాటర్ గార్డ్ లేదా స్టవ్ షీల్డ్. ఇది నాణ్యమైన స్టెయిన్లెస్ స్టీల్తో తయారైనందున తుప్పుపట్టదు. మన్నిక ఎక్కువ. శుభ్రపరచడమూ తేలికే. ఇది అరలుగా ఉండి.. అవసరమైనట్లుఅమర్చడానికి వీలుగా ఉంటుంది. నాన్స్టిక్ కోటింగ్ వల్ల నూనె అతుక్కోదు కనుక తేలిగ్గా కడిగేయొచ్చు. గాలికి మంట ఆరిపోకుండానూ ఆపుతుందీ సాధనం. □

# ఓటమిపై అంతర్మథనం





## ఫీల్డింగ్‌తో భారత్ ఔట్

### రాహుల్, సిరాజ్, అక్షర్ భారీ తప్పిదాలు

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియాతో ఆడిలైడ్ ఓవల్‌లో జరిగిన రెండో వన్డేలో భారత బ్యాటర్లు పేలవ ప్రదర్శన చేసి నిరాశపరిచినా, ఫీల్డింగ్ వైఫల్యాలు టీమిండియా పరాజయానికి ప్రధాన కారణంగా నిలిచాయి. ఓటమిపై బిసిసిఐ అంతర్మథనం చేస్తోంది. ఈ మ్యాచ్‌లో కీలక ఆటగాళ్లైన కెఎల్ రాహుల్, మహ్మద్ సిరాజ్, అక్షర్ పటేల్ వంటి సీనియర్లు చేసిన ఘోర తప్పిదాలు ఆసిస్‌కు అనుకూలంగా మారాయి. ఈ ముగ్గురు ఆటగాళ్లు చేజార్చిన కీలకమైన క్యాచ్‌లు, రన్‌అవుట్ వల్ల ఆస్ట్రేలియా విజయం సులభమై భారత్ సిరీస్ కోల్పోవడానికి కారణమైంది. ఆసిస్ లక్ష్య ఛేదనలో ఆ జట్టు టాప్ ఆర్డర్ బ్యాటర్ మ్యాథ్యూ షార్ట్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించాడు. అయితే, అతనికి భారత ఫీల్డర్ల నుండి పదే పదే లైఫ్ లభించింది. ఆసిస్ ఇన్నింగ్స్ 16వ ఓవర్‌లో నితీశ్ వేసిన బంతికి, పాయింట్ ఏరియాలో ఉన్న అక్షర్ పటేల్ మ్యాథ్యూ షార్ట్ క్యాచ్‌ను నేలపాలు చేశాడు. ఆ సమయంలో షార్ట్ కేవలం 24 రన్స్‌కే ఆడుతున్నాడు. ఒకవేళ ఆ క్యాచ్ పట్టుకుని ఉంటే, మ్యాచ్ భారత్ వైపు మొగ్గు చూపడానికి వీలుండేది. అలాగే సీనియర్లు కెఎల్ రాహుల్, మహ్మద్ సిరాజ్ కూడా ఫీల్డింగ్‌లో నిరాశపరిచారు. 29వ ఓవర్‌లో వాషింగ్టన్ సుందర్ బౌలింగ్‌లో మరోసారి మ్యాథ్యూ షార్ట్ అవుట్ అయ్యే అవకాశం వచ్చింది. పాయింట్ వద్ద నిలబడి ఉన్న సిరాజ్ ఇది చాలా సులభమైన క్యాచ్ అయినప్పటికీ దానిని చేజార్చాడు. ఈతప్పిదమే టీమిండియాకు భారీ నష్టాన్ని కలిగించింది. ఒకానొకసమయంలో మ్యాథ్యూ షార్ట్‌ను రన్‌అవుట్ చేసే అవకాశం కూడా భారత్‌కు వచ్చింది. మ్యాట్ రెన్‌షా మొదటి పరుగు తీస్తున్నప్పుడు అతనికి, షార్ట్‌కుమధ్య పరుగుల విషయంలో గందరగోళం ఏర్పడింది. కానీ రాహుల్ స్ట్రైకర్‌ఎండ్‌లో బంతిని సేకరించడానికి కూడా రాలేదు. దీంతో షార్ట్‌కు మరోలైఫ్ వచ్చింది. మ్యాథ్యూ, షార్ట్ (74) చివర్లో బ్యాటింగ్ చేసిన కొనోలీ, ఓవెన్ ఈ అవకాశాలను పూర్తిగా సద్వినియోగం చేసుకున్నారు. ఫీల్డింగ్ మెరుగ్గా ఉండి ఉంటే, ఈ మ్యాచ్ ఫలితం భారత జట్టుకు అనుకూలంగా వచ్చే అవకాశం ఉండేది. ఇలా ఈ మ్యాచ్‌లో టీమ్ ఇండియా మొత్తం 3 క్యాచ్‌లు, ఒక రన్‌అవుట్‌ను చేజార్చింది.



## ఆసియా గేమ్స్‌లో.. కబడ్డీ డబుల్ గోల్డ్

### టైక్వాండో, అథ్లెటిక్స్‌లో డబుల్ కాంస్యం

**న్యూఢిల్లీ:** ఆసియా యూత్ గేమ్స్‌లో భారత కబడ్డీ జట్లు స్వర్ణం, ట్రాక్ అండ్ ఫీల్డ్ మెరుపులు మెరిపించాయి. భారత కబడ్డీ జట్లు డబుల్ స్వర్ణాలు సాధించగా, టైక్వాండో మరియు అథ్లెటిక్స్ చారిత్రాత్మక పతకాలను జోడించాయి. ఈ రోజుతో 10 పతకాలతో (2 స్వర్ణాలు, 3 రజతాలు, మరియు 5 కాంస్యాలు)లతో భారత్ ముగించింది. మొత్తం పతకాల పట్టికలో ఐదవ స్థానానికి చేరుకుంది. కబడ్డీలో మహిళల, పురుషుల జట్లు స్వర్ణాలు సాధించాయి. బాలుర జట్టు ఉత్కంఠభరితమైన ఫైనల్‌లో ఇరాన్‌ను 35-32 తేడాతో ఓడించి గేమ్స్‌లో రెండు మ్యాచ్‌ల్లో రెండు విజయాలు సాధించింది. అలాగే బాలికల జట్టు ఆధిపత్య ప్రదర్శన చేసి, ఫైనల్‌లో ఇరాన్‌ను 75-21 తేడాతో ఓడించి టాప్ పోడియం ఫినిషింగ్‌ను కైవసం చేసుకుంది. మరోపక్క టైక్వాండో, అథ్లెటిక్స్ చారిత్రాత్మక పతకాలు లభించాయి. దేబాసిష్ దాస్ టైక్వాండోలో దేశం తరపున తొలి పతకాన్ని గెలుచుకుంది. బాలుర వ్యక్తిగత గుర్తింపు పొందిన పూమ్సే విభాగంలో కాంస్యం. ఆ తర్వాత వెంటనే, యశ్విని సింగ్, శివాంషు పటేల్ మిక్స్‌డ్ జోడీ మరో కాంస్య పతకాన్ని సాధించింది. ఇది భారతదేశం రెండవ టైక్వాండో పతకాన్ని నమోదు చేసింది. ట్రాక్‌లో బాలికల 100 మీటర్ల హార్డిల్స్‌లో శౌర్య అంబురే రజతం గెలుచుకుంది, 13.73 సెకన్లలో కొత్త వ్యక్తిగత ఉత్తమ సమయాన్ని నమోదు చేసింది, ఈ ఈవెంట్‌లో భారతదేశం తరపున రెండవ ట్రాక్ పతక విజేతగా నిలిచింది. ఫీల్డ్ ఈవెంట్లలో, జాస్మిన్ కౌర్ షాట్ పుట్‌లో 14.86 మీటర్ల వ్యక్తిగత ఉత్తమ త్రోతో కాంస్యం గెలుచుకుంది, ఈ పోటీలో భారత్ యొక్క మొట్టమొదటి ఫీల్డ్ పతకాన్ని సాధించింది.

## ఫ్రెంచ్ ఓపెన్‌లో రోహాన్-శివాని ఓటమి



**న్యూఢిల్లీ:** ఫ్రెంచ్ ఓపెన్‌లో భారత జట్టు నిరాశతో ప్రచారాన్ని ముగించింది. సెస్సన్ సెవిగ్నేలో జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో, రోహన్ కపూర్-గద్దె రుత్విక శివాని కూడా స్థానిక ఫేవరెట్‌లు థామ్ గిక్వెల్ మరియుడెల్ఫిన్ డెల్రూతో మూడు గేమ్‌ల పోరాటం తర్వాత నిష్క్రమించారు. భారత జంట మొదటి గేమ్‌ను 23-21 తేడాతో గెలిచినా కానీ ఆ జోరును కొనసాగించలేకపోయింది. చివరికి 23-21, 8-21, 17-21 తేడాతో ఓడిపోయింది. టోర్నమెంట్‌లో ముందుగా ఓడిపోయిన భారత అగ్రశ్రేణి పురుషుల డబుల్స్ జోడీ చిరాగ్ శెట్టి-రాంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్ నిష్క్రమంచింది. అలాగే మహిళల సింగిల్స్ ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో ప్రపంచ 2వ ర్యాంక్ క్రీడాకారిణి చైనాకు చెందిన వాంగ్ జియా చేతిలో ఓడిపోయి భారత షట్లర్ ఉన్నతి హుడా ఫ్రెంచ్ ఓపెన్ సూపర్ 750 నుండి నిష్క్రమించింది. 39 నిమిషాల పాటు జరిగిన పోటీలో 14-21, 11-21 తేడాతో ఓడిపోయిన 18 ఏళ్ల భారత క్రీడాకారిణి రెండవ సీడ్ క్రీడాకారిణి వేగం మరియు ఖచ్చితత్వాన్ని సమం చేయడం కష్టమైంది. మునుపటి రౌండ్లలో ఆశావహుల మెరుపులను ప్రదర్శించిన హుడా, వాంగ్‌యొక్క స్థిరమైన షాట్‌మేకింగ్, కోర్టు నియంత్ర ణకు వ్యతిరేకంగా పోరాడటంలో వైఫల్యం చెందింది. ఈ సంవత్సరం ప్రారం భంలో సింగపూర్ ఓపెన్‌లో జరిగిన మ్యాచ్ తర్వాత, వాంగ్ చేతిలో హుడా వరుసగా ఇది రెండో ఓటమి. ఈ మ్యాచ్‌లో ఒక గేమ్ గెలిచి, తదుపరి ఆ మ్యాచ్‌లో పరాజయం చెందింది.

## భారత్‌లో జరిగే హాకీ వరల్డ్‌కప్ నుంచి పాక్ ఔట్



**న్యూఢిల్లీ:** భారత్‌లో జరగనున్న జూనియర్ హాకీ వరల్డ్ కప్ నుంచి పాకిస్థాన్ వైదొలగినట్లు అంతర్జాతీయ హాకీ ఫెడరేషన్ ధృవీకరించింది. నవంబరు 28 నుంచి డిసెంబర్ 28వ తేదీ వరకు జూనియర్ హాకీ వరల్డ్‌కప్ జరగాల్సి ఉన్నది. /0258దేశంలోని చెన్నై, మధురై వేదికల్లో ఈ మ్యాచ్‌లు జరగనున్నాయి. అయితే పాకిస్థాన్ తప్పుకున్న నేపథ్యంలో ఆ స్థానంలో మరో జట్టును ప్రకటించనున్నట్లు హాకీ ఫెడరేషన్ పేర్కొన్నది. వాస్తవానికి టోర్నీలోని గ్రూప్ బీలో పాకిస్థాన్ ఉన్నది. ఆ గ్రూపులోనే భారత్, చిలీ, స్విట్జర్లాండ్ దేశాలు ఉన్నాయి. కాగా భారత్‌లో జరుగుతున్న టోర్నీల నుంచి పాకిస్థాన్ వైదొలగడం ఇదే రెండో సారి. గతంలో బీహార్‌లోని రాజ్‌గిర్‌లో జరిగిన పురుషుల ఆసియా కప్ తర్వాత పాకిస్తాన్ భారతదేశంలో ఇప్పుడు మరోసారి టోర్నీ నుండి తప్పుకుంది. ఇటీవల మెన్స్ ఆసియాకప్ నుంచి కూడా పాక్ టీమ్ తప్పుకున్నది. బీహార్‌లోని రాజ్‌గిర్‌లో ఆ టోర్నమెంట్ ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ ఏడవ తేదీ వరకు జరిగింది. పెహల్గామ్ ఉగ్రదాది తర్వాత రెండు దేశాల మధ్య క్రీడా సంబంధాలు బలహీనపడిన విషయం తెలిసిందే. జూనియర్ హాకీ వరల్డ్‌కప్ నుంచి పాకిస్థాన్ తప్పుకున్న విషయంపై తమకు సమాచారం లేదని హాకీ ఇండియా పేర్కొన్నది. కాగా పాకిస్తాన్ హాకీ సమాఖ్య కార్యదర్శి రాణా ముజాహిద్ ఈ నిర్ణయాన్ని ధృవీకరించారు. ఇటీవల జరిగిన ఆసియా కప్ క్రికెట్ ఈవెంట్ భారతదేశం పాకిస్తాన్ పట్ల తీవ్ర భావోద్వేగాలను కలిగి ఉందని నిరూపించిందన్నారు. అలాగే ఇటీవల జరిగిన క్రికెట్ మ్యాచ్‌ల్లో భారత్ ఆటగాళ్ళు మా ఆటగాళ్లతో కరచాలనం చేయలేదని పేరొకన్నారు. అంతేకాకుండా మొహ్సిన్ నఖ్వీ నుండి ట్రోఫీని స్వీకరించడానికి భారత్ నిరాకరించిందని చెప్పారు.

## వరల్డ్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్.. ప్రియా మాలిక్‌కు కాంస్యం



**న్యూఢిల్లీ:** ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ అండర్-23 విభాగంలో ప్రియా మాలిక్ పతకాన్ని దక్కించుకుంది. సెర్బియాలో జరిగిన 76 కిలోల కాంస్యంతో మహిళల ఫ్రీస్టైల్‌లో భారత పతకాల జాబితాను ప్రారంభించింది. అమెరికాకు చెందిన ఛాంపియన్ కైలీ వెల్కర్ చేతిలో తన తొలి రౌండ్ బౌట్‌ను కోల్పోయిన తర్వాత, ఆమె అద్భుతంగా పుంజుకుని కెనడాకు చెందిన నైలా బర్గెస్‌పై 10-0 తేడాతో తన రిపీచేజ్ బౌట్‌ను గెలుచుకుంది. ఆ తర్వాత, ఆమె కాంస్య పతక పోరులో మెక్సికోకు చెందిన ఎడ్నా జిమెనెజ్ విల్లాల్బాను 8-1 తేడాతో ఓడించి, అండర్ 20 వరల్డ్స్‌లో రజతం తర్వాత ఈ సంవత్సరంలో తన రెండవవయస్సు గ్రూప్ పతకాన్ని గెలుచుకుంది. మొత్తం మీద, ఈ ప్రియాకు ఇది ఆరవ ప్రపంచ పతకం. ఇప్పటికే ఆమె రెండు అండర్ 17 ప్రపంచ టైటిళ్లు, మూడు అండర్ 20 పతకాలు సాధించకగా, తాజాగా ఇప్పుడు ఒక అండర్ 23 పతకాన్ని కూడా కైవసం చేసుకుంది. ప్రియా ఈ సంవత్సరం సీనియర్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో కూడా పోటీ పడింది. కానీ పతకానికి ఒక్కటి మాత్రమే దూరంలో ఉంది.

## ఇవి కార్ల మార్కెట్‌లో లీడర్ 'బివైడి'

### టెస్లాను వెనక్కినెట్టేసిన చైనా సంస్థ



**న్యూఢిల్లీ, అక్టోబరు 24:** ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) గ్లోబల్ మార్కెట్‌లో పెను మార్పు చోటు చేసుకుంది. ఏళ్లుగా అగ్రగామిగా కొనసాగుతున్న అమెరికా దిగ్గజం టెస్లా ఆధిపత్యానికి తెర దించుతూ, చైనాకు చెందిన ఆటోమొబైల్ తయార్ణీ సంస్థ బీవైడీ అమ్మకాల్లో నంబర్ 1 స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ ఏడాది తొలి తొమ్మిది నెలల గణాంకాలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. తాజాగా విడుదలైన వివరాల ప్రకారం, 2025 జనవరి నుంచి సెప్టెంబర్ వరకు బీవైడీ సుమారు 16.1 లక్షల ప్యూర్ ఎలక్ట్రిక్ వాహనాలను విక్రయించింది. ఇదే సమయంలో టెస్లా అమ్మకాలు 12.2 లక్షల యూనిట్లుగా నమోదయ్యాయి. దీంతో తన ప్రత్యర్థి కంటే బీవైడీ దాదాపు 3. 88లక్షల వాహనాల భారీ ఆధిక్యాన్ని ప్రదర్శించింది. ఈ గణాంకాలతో ఈవీ మార్కెట్‌లో బీవైడీ తిరుగులేని శక్తిగా అవతరించింది. గతేడాది వాహనాల ఉత్పత్తిలో బీవైడీ స్వల్పంగా టెస్లాను అధిగమించింది. ఆ ఏడాది బీవైడీ 17.77 లక్షల వాహనాలను ఉత్పత్తి చేయగా, టెస్లా కంటే ఇది 4,500 యూనిట్లు మాత్రమే ఎక్కువ. అయితే, అమ్మకాల విషయంలో మాత్రం టెస్లానే ఆధిక్యంలో నిలిచింది. 2024లో టెస్లా 17.9 లక్షల కార్లను అమ్మగా, బీవైడీ 17.6 లక్షల యూనిట్లతో రెండో స్థానంతో సరిపెట్టుకుంది. కానీ 2025లో మాత్రం పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రస్తుత అమ్మకాల సరళిని బట్టి చూస్తే, ఈ ఏడాది బీవైడీ 20 లక్షల యూనిట్ల విక్రయాల మైలురాయిని సులువుగా దాటుతుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మరోవైపు, టెస్లా ఈ మార్కును చేరాలంటే గత ఏడాది నాలుగో త్రైమాసికంతో పోలిస్తే ఈసారి తన అమ్మకాలను 50 శాతానికి పైగా పెంచుకోవాల్సి ఉంటుంది. ఇది టెస్లాకు పెద్ద సవాలుగా మారే అవకాశం ఉంది.

## ఆరురోజుల లాభాలకు బ్రేక్

### స్వల్ప నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ




**ముంబయి, అక్టోబరు 24:** ఆరురోజుల లాభాలకు ఈక్విటీమార్కెట్లలోబ్రేక్‌పడింది. సానుకూల దిశగానే మార్కెట్లుప్రారంభం అయినా చివరి వరకూ ఊగిసలాటనే కొనసాగింది. మెటల్, టెలికాం షేర్లు మినహా మిగిలిన అన్ని షేర్లు కూడా ఒత్తిడిలోనే ముగిసాయి. అంతర్జాతీయ పరిణామాలు, త్రైమాసిక ఫలితాలు, ఫెడ్‌రిజర్వు నిర్ణయాలు వంటివి భారీ ప్రభావంచూపించాయి. నిఫ్టీ 50సూచీ 96.25 పాయింట్లు నష్టంతో 25,795.15 పాయింట్లవద్దముగిసింది. బిఎస్‌ఇ సెన్సెక్స్ 344.52 పాయింట్లు క్షీణించి 84,211.88 వద్ద ముగిసింది. గడచిన ఆరు సెషన్లలోసెన్సెక్స్ 3.07శాతం, నిఫ్టీ 2.96శాతం లాభపడిన సంగతి తెలిసిందే. హిందూస్థాన్ యూనిలీవర్ 3.2, ఆదాని 1.65, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 1.41శాతం దిగజారాయి. మిడ్‌క్యాప్‌సూచీ 0.26శాతం, స్మాల్‌క్యాప్ సూచీలు 0.19శాతం క్షీణించాయి. మార్కెట్ల పరంగా బిఎస్‌ఇలో 1853 కంపెనీలు పెరిగితే 2323 కంపెనీల షేర్లుక్షీణించాయి. 169 కంపెనీలషేర్లు స్థిరంగా నిలిచాయి. ఇక మార్కెట్‌లో కాల్గేట్ పామోలివ్ 2.23శాతం, ఎల్ అండ్‌టి 0.28శాతం, సాగర్ సిమెంట్స్ 5.85 శాతం క్షీణించాయి. రెఫెక్స్ ఇండస్ట్రీస్ 2.59 శాతం పెరిగింది. పిటిసి ఇండియా ఫైనాన్షియల్ సర్వీసెస్ 13.48శాతంపెరిగింది. సౌత్ ఇండియా పేపర్‌మిల్స్ 16.14శాతం, క్రాంప్టన్ అండ్‌గ్రీవ్స్ కన్స్యూమర్ ఎలక్ట్రికల్స్ 0.95శాతం పెరిగాయి. ఆదిత్యబిర్లా సన్‌లైన్ ఎఎంసి 2.14శాతం పెరిగింది. టిటాన్ ఇన్‌టెక్ ఐదు శాతం ఎగువ సర్క్యూట్‌లో ముగిసింది. ఇక గ్లోబల్‌మార్కెట్లపరంగాయూరోపియన్ మార్కెట్లు దిగువన ముగిసాయి. ఆసియా మార్కెట్లు కొంతమేర గరిష్టంగా కొనసాగాయి. ఈవారంలోనే ట్రంప్, జిన్‌పింగ్‌ల భేటీ ఉంటుందన్న ప్రకటనలతో ఆసియా మార్కెట్లు ఊపందుకున్నాయి. ఎస్‌అండ్‌పి 500 0.58శాతంపెరిగితే డౌజోన్స్ పారిశ్రామిక సగటు 144.20 పాయింట్లు పెరిగింది. నాస్‌డాక్ కాంపోజిట్ 0.89శాతం పెరిగినట్లు గణాంకాలు చెపుతున్నాయి. ఎన్వీడియా, బ్రాడ్‌కామ్, అమెజాన్‌ల నుంచి వీటికి మద్దతు లభించింది.

## సెబీ నిబంధనల అతిక్రమణ

### 13 సంస్థలు, వ్యక్తులపై బహిష్కరణ వేటు

**న్యూఢిల్లీ, అక్టోబరు 24:** స్టాక్ ఎక్చేంజిల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా 13 సంస్థలు, వ్యక్తులను సెక్యూరిటీస్ ట్రేడింగ్‌ఖుంచి మూడేళ్లపాటు పాల్గొనకుండా ఆంక్షలు విధించింది. బహిరంగం చేయని సమాచారంతో ఫ్రంట్‌రన్నింగ్‌ట్రేడింగ్ నిర్వహించారన్న ఫిర్యాదుల ఆధారంగా ఉత్తర్వులు అమలు చేసారు. 2021 జనవరి నుంచి 2022 అక్టోబరువరకూ మూడు కుటుంబ ట్రస్టులు భారత్ కన్హైయలాల్ సేఠ్ కుటుంబట్రస్టు, రవి కనయ్యలాల్‌సేఠ్ కుటుంబట్రస్టు, అర్జున్ విచక్షణాత్మక ట్రస్టులు ఈ లావాదేవీలు నిర్వహించాయని బిగ్‌క్లైయింట్‌గా ఈమూడు సంస్థలు సమిష్టిట్రేడింగ్ నిర్వహించాయి. విచారణలో సెబీ ఈ సంస్థలు ట్రేడింగ్ బిగ్‌క్లయింట్‌ట్యాగ్‌ను బహిరంగంగా లేని సమాచారంతోనిర్వహించి ట్రేడింగ్ యాక్సెస్‌చేసినట్లు విచారణలో తేలింది. ఈ ట్రేడింగ్ విధానంవల్ల సెబీ మౌలికసూత్రాలను ఉల్లంఘించినట్లయిందని సెబీ పేర్కొంది. శంకర్ తుకారామ్ వడాత్కర్, సాక్షి శంకర్ వడాత్కర్, దీపేష్ మెహతా, పియూష్ మెహతా మరికొందరు వారు సొంతపేర్లతో కాని లేదా హిందూ అవిభాజ్య కుటుంబాలు, వారి భార్యల పేరిట కానీ ట్రేడింగ్ నిర్వహించారని తేలింది. సెబీ చట్టంలోని సెక్షన్ 12ఎ(ఎ)(బి),(సి), (ఇ)తోపాటు పిఎఫ్‌యుటిపి చట్టంపరిధిలోని 3,4 అధికారణాల ప్రకారం వారు శిక్షార్హులేనని తేల్చింది. ఒక మధ్యవర్తి ఉద్యోగిద్వారా నాన్ పబ్లిక్ సమాచారం సాధించి ఈ సంస్థలతో అనుసంధానించారని సెబీకి ఫిర్యాదులు వెళ్లాయి. సెబీ విచారణలో 424 సార్లు ఇలా అవకత వకలకు పాల్పడి రెండుకోట్లమేర అనుచిత లబ్ధిని పొందినట్లు గుర్తించింది. అంతకుముందు ఆరుగురు నిందితులు తమ కేసును 2024లో సెటిల్ చేసుకున్నాయి. అలాగే ఆరునెలలపాటు మార్కెట్ బ్యాన్‌కూడా వీరిపై విధించారు. ఏంజెల్‌వన్ లిమిటెడ్ స్టాక్‌బ్రోకర్ ఎక్కువ ట్రేడింగ్ నిర్వహించింది. 21,64,500 రూపాయలు చెల్లించడం ద్వారా కొంతమేర బయటపడింది. అయితే మరో 13 మంది నిందితులను కూడా కొనుగోళ్ల, అమ్మకాల లావాదేవీలనుంచి బహిష్క రించింది. ఏడాది నుంచి మూడేళ్లపాటు ఈ ఉత్తర్వులు అమలులో ఉంటాయి.

## డాక్టర్ రెడ్డీస్ నికరలాభం 1437.2 కోట్లు

Dr.Reddy's

**ముంబయి, అక్టోబరు 24:** హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న మేజర్ ఫార్మాసంస్థ డాక్టర్ రెడ్డిల్యాబ్స్ రెండోత్రైమాసికంలో నికరలాభం రూ.1437.2కోట్లుగా ఉందని ప్రకటించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన 1255.3 కోట్లకంటే 14శాతం నికరలాభాలుపెరిగినట్లు కంపెనీ ప్రకటించింది. కంపెనీ కార్యకలాపాల ద్వారా రాబడులు 8805.1కోట్లుగా ఉంది. గత ఏడాది 8016.2 కోట్లనుంచి చూస్తే 9.8శాతం పెరిగింది. క్రమానుగతంగాచూస్తే మూడుశాతం పెరిగింది. రెండోత్రైమాసికంలో ఎక్కువగా బ్రాండెడ్ మార్కెట్లనుంచే రాబ డులుపెరిగాయి. నికోటిన్ రీప్లేస్‌మెంట్ థెరపీ పోర్టుఫోలియో రాణించింది. అమెరికాలో లెనాలి డోమైడ్ సేల్స్ విక్రయాలను ఈ ఎన్నార్టీ కవర్ చేసిందని కంపెనీ చెపుతోంది. కంపెనీకి యూరోప్ దేశాలనుంచి 1376కోట్లు రాబడి వస్తే 138శాతం ఎరిగింది. భారత్‌లో బిజినెస్ 1578 కోట్లుగా ఉంది. అంటే 13శాతంపెరిగింది. వర్ధమాన మార్కెట్లనుంచి 1655 కోట్లుగా అంటే 14శాతం పెరిగింది. ఎబిటిడా ప్రకారంచూస్తే ఈ త్రైమాసికంలో 2351.1 కోట్లుగా ఉది. గత ఏడాది కంటే 3శాతం పెరిగింది. ఎబిటిడా మార్జిన్ కూడా 26.7జవాతంగా ఉంది. ఆపరేషన్స్ ద్వారా రాబడులు 8805.1 కోట్లురాగా నికర లాభం 1437.2 కోట్లు, ప్రతి వాటాకు రాబడులు 17.26 రూపాయలుగా ఉంది.


## వాణిజ్యప్రకటనల సృష్టికర్త కన్నుమూత

### పీయూష్ పాండే అంటేనే అడ్వర్టయిజ్‌మెంట్ దిగ్గజం అని పేరు



**న్యూఢిల్లీ, అక్టోబరు 24:** అడ్వర్టైజింగ్ దిగ్గజం పీయూష్ పాండే మృతిచెందారు. ఆయన వయసు 70 ఏళ్లు. ఫెవికాల్, క్యాడ్‌బరీ, ఏషియన్ పేయింట్స్ లాంటి ప్రఖ్యాత బ్రాండ్‌లకు ఆయన యాడ్స్ రూపొందించారు. గత కొన్నాళ్ల నుంచి ఆయన ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్నారు. శనివారం ఆయన భౌతిక కాయానికి అంత్యక్రియలు నిర్వహించనున్నారు. సుమారు నాలుగు దశాబ్దాల నుంచి ఆయన అడ్వర్టైజింగ్ పరిశ్రమలో ఉన్నారు. ఒగ్లివీ యాడ్ కంపెనీలో చీఫ్ క్రియేటివ్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ చైర్మెన్‌గా చేశారు. 1982లో ఒగ్లివీ కంపెనీలో పాండే చేరారు. సన్‌లైట్ డిటర్జెంట్ కోసం ఆయన తొలిసారి యాడ్ రాశారు. ఆరేళ్ల తర్వాత కంపెనీ క్రియేటివ్ శాఖలో చేరాడు. ఆ తర్వాత ఎన్నో పాపులర్ యాడ్స్‌ను ఆయన రూపొందించారు. ఫెవికాల్, క్యాడ్‌బరీ, ఏషియన్ పేయింట్స్, లూనా మోపెడ్, ఫార్చ్యూన్ ఆయిల్‌తో పాటు అనేక బ్రాండ్లకు యాడ్స్‌ను తయారు చేశారు. ఒగ్లివీ ఇండియా యాడ్ ఏజెన్సీ ఆయన నాయకత్వంలో వరుసగా 12 ఏళ్ల పాటు నెంబర్ వన్ స్థానంలో కొనసాగింది. పాండే ఎన్నో అవార్డులను గెలుచుకున్నారు. 2016లో ఆయన్ను పద్మశ్రీ వరించింది. సినిమాల్లో కూడా ఆయన నటించారు. 2013లో రిలీజైన మద్రాస్ కేఫ్‌లో నటించారు. జాతీయ సమగ్రత కోసం రూపొందించిన మిలే సుర్ మేరా తుమారా పాటకు సాహిత్యాన్ని ఆయనే అందించారు. భోపాల్ ఎక్స్‌ప్రెస్ అనే చిత్రానికి ఆయన స్క్రీన్‌ప్లే సహకారం అందించారు. పీయూష్ పాండే మృతిపట్ల అనేక మంది సెలబ్రిటీలు, నేతలు సంతాపం తెలిపారు. భారతీయ అడ్వర్టైజింగ్ రంగంలో ఆయన లెజెండ్ అని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. పీయూష్ పాండే సృజనాత్మకత అద్భుతమని ప్రధాని మోడీ అన్నారు. ఆయన మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు.

## ఎస్‌బిఐకి రెండు గ్లోబల్ అవార్డులు



**న్యూఢిల్లీ,అక్టోబరు 24:** ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి వార్షిక సమావేశాల్లో నిర్వహించిన ప్రత్యేక ఈవెంట్లలో న్యూయార్క్ గ్లోబల్ ఫైనాన్స్‌నుంచి భారతీయ స్టేట్‌బ్యాంకు రెండు ప్రతిష్టాత్మక అవార్డులు సాధించింది. ప్రపంచఉత్తమ వినియోగదారుని బ్యాంకు-2025, భారత్‌లో అత్యుత్తమ బ్యాంకు-2025 పురస్కారాలు సాధించింది. అంతర్జాతీయ బ్యాంకింగ్ దిగ్గజంగా స్టేట్‌బ్యాంకు స్థానాన్ని ఈ అవార్డులు మరింత బలపరిచాయని ఎస్‌బిఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి అన్నారు. తమ బ్యాంకు పరిధిలో రోజుకు 65వేల కొత్త ఖాతాలు ప్రారంభిస్తున్నామని, డిజిటల్‌ఫస్ట్, కన్స్యూమర్‌ఫస్ట్ బ్యాంకుగా తమ మొబైల్ అప్లికేషన్ 10 కోట్లమందికిపైగా కస్టమర్లకు సేవలందిస్తోందన్నారు. అలాగే రోజువారి యూజర్లు కూడా కోటిమందికిపైగా ఉన్నారన్నారు. 30లక్షల మందికి హోంలోన్ అందించామని, ఈ విభాగంలోనే ఇప్పటి వరకూరూ.8.50లక్షలకోట్లురుణాలిచ్చినట్లు ప్రకటించారు. జూన్ 2025నాటికి బ్యాంకుడిపా జిట్లు రూ.54.73లక్షలకోట్లు మార్క్‌ను అధిగ మించింది. అడ్వాన్సులుకూడారూ.42.54లక్షల కోట్లుగాఉన్నాయి. ప్రపంచంలోనే అత్యంత నమ్మకమైన బ్యాంకుల్లో ఎస్‌బిఐ 4వ స్థానంలో నిలిచింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.